


# వినుకొండ వార్త


epaper.vinukondavartha.com

vnkvarta66@gmail.com

దినపత్రిక

సంపుటి : 7 సంచిక : 93 గుంటూరు శుక్రవారం 1 ఆగష్టు 2025 పేజీలు : 8 వెల : రూ. 2.00/-


శ్రీ విశ్వావసు నామ సంవత్సరం ఆషాడ మాసం గ్రీష్మ ఋతువు ఉత్తరాయణం తిధి - అష్టమి రాహుకాలం - ఉ. 10.30 నుండి 12.00 వరకు. యమగండం - మ. 3.00 నుండి 4.30 వరకు. దుర్ముహూర్తం ఉ. 8.24 నుండి 9.12 వరకు. వర్జము - ఉ. 6.54 నుండి 8.40 వరకు. అమృత ఘడియలు .. రా. 5.48 నుండి 7.34 వరకు




# ఈ ఆగస్టు అదిరిపోద్ది!

## ఆగస్టు నుంచి పండగే.. బాబు కానుకల వెల్లువ..!

అమరావతి : ఆగస్టు నెల నుంచి రాష్ట్రంలో మరిన్ని సంక్షేమ పథకాల అమలు చేస్తామని ప్రభుత్వం చెబుతోంది. అంటే ఒక రకంగా ఇది ఏపీలో పండగ వాతావరణం తీసుకురావడం ఖాయంగా కనిపిస్తుంది. ప్రధానంగా ఆగస్టు 15 తారీకు నుంచి మహిళలకు ఆర్టీసీలో ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యాన్ని అందుబాటులోకి తెస్తున్నారు. దీనికి సంబంధించి ఇప్పటికే చంద్రబాబు అన్ని సిద్ధం చేసుకున్నట్టు ప్రభుత్వం వెల్లడించింది. ఐదు రకాల బస్సుల్లో రాష్ట్రంలో మహిళలకు ఉచితంగా సౌకర్యం కల్పిస్తామని మంత్రి అచ్చం నాయుడు కూడా ప్రకటించారు. పల్లె వెలుగు, డీలక్స్, ఎక్స్ప్రెస్ తో పాటు మరో రెండు రకాల బస్సులను కూడా మహిళల ప్రయాణానికి అనుమతించనున్నట్టు ప్రభుత్వం చెబుతోంది. దీనివల్ల మహిళల సంతృప్తిని కూటమి వైపు పెంచుకునే దిశగా అడుగులు పడుతున్నాయి. మరోవైపు రైతులు గత కొన్నాళ్లుగా ఎదురుచూస్తున్న అన్నదాత సుఖీభవ పథకాన్ని కూడా వచ్చే నెల నుంచి ప్రారంభించనున్నట్టు ప్రభుత్వం పేర్కొంది. ఇది, ఆగస్టు తొలి వారంలోనే ఉండే అవకాశం ఉందని చెబుతున్నారు.

వాస్తవానికి 13 నెలలుగా అన్నదాతలు ఈ పథకం కోసం ఎదురు చూస్తున్నారు. ప్రస్తుతం ఖరీఫ్ కూడా ప్రారంభం అయిపోయింది. అప్పులు చేసి పంటలు సాగు చేస్తున్న రైతులు ప్రభుత్వం ఇచ్చే సాయం కోసం ఎదురుచూస్తున్నారు అన్నది వాస్తవం. వాస్తవానికి గత ఏడాది దీన్ని అమలు చేయాల్సి ఉంది. కానీ ప్రభుత్వం మారడం, అదేవిధంగా రాష్ట్రంలో ఆర్థిక పరిస్థితి బాగాకపోవడం కారణంగా ఈ పథకాన్ని వాయిదా వేశారు. వచ్చే నెలలో దీన్ని అమలు చేయనున్నట్టు ప్రభుత్వం ప్రకటించడం ఆశలు రేకెత్తిస్తోంది. ఇది ఎంతవరకు సక్సెస్ అవుతుంది అనేది చూడాలి. ఇక, ఆగస్టు నెల నుంచే వితంతు పింఛన్లను పునరుద్ధరిస్తామని ప్రభుత్వం తెలిపింది. అంటే వైసిపి హయంలో కొందరికి వితంతు పింఛన్లు తీసేశారు. వాటిని తాము మళ్ళీ పునరుద్ధరిస్తామని ప్రభుత్వం చెబుతోంది. ఇది కూడా మంచి కార్యక్రమం అని చెప్పాలి. అలాగే ఆగస్టు 15 తారీకు నుంచి ప్రభుత్వ కార్యాలయాలకు వెళ్లకుండా అన్ని సేవలను ఆన్లైన్లో పొందే విధంగా వాట్సాప్ సేవలను మరింత విస్తృతం చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఇది కూడా ప్రజల్లో మంచి మార్కులు వేయించుకునే అవకాశం కనిపిస్తుంది. అదేవిధంగా వచ్చే నెల నుంచి ప్రజల మధ్యకు చంద్రబాబు రానున్నారు. తొలుత పట్టణాలు, తర్వాత గ్రామీణ ప్రాంతాలను లక్ష్యంగా చేసుకొని ప్రజలను కలుసుకునే అవకాశం కనిపిస్తుంది. మొత్తంగా ఆగస్టు నుంచి రాష్ట్రంలో ఒక భిన్నమైనటువంటి పరిస్థితి, భిన్నమైన వాతావరణం స్పష్టంగా కనిపించనున్నాయి. ఇది ప్రభుత్వానికి మేలు చేస్తుందని అధికార వర్గం అంచనా వేస్తోంది. మరి ఏం జరుగుతుందనేది చూడాలి.




## తవ్వేకొద్దీ బయటపడుతున్న...

## డా. నమ్రత అద్దెగర్భాల వ్యవహారాలు

సంతానం లేకపోవడంతో రాజస్థాన్ నుంచి వచ్చి సికింద్రాబాద్ లో ఉంటున్న ఓ జంట డాక్టర్ నమ్రతను ఆశ్రయించారు. ఆమె వైద్య పరీక్షలు నిర్వహించి సరోగసీతో బిడ్డను కనొచ్చని విడతల వారీగా రూ.30 లక్షలు వసూలు చేశారు. సరోగసి మహిళ ఖర్చులు అదనంగా తీసుకున్నారు. విశాఖపట్నంలోని ఆసుపత్రిలో ఆ మహిళ గర్భంలో బిడ్డ ఊపిరి పోసుకుంటుందని నమ్మించారు. సరిగ్గా తొమ్మిది నెలలు పూర్తైన తర్వాత పుట్టిన బిడ్డను తీసుకొచ్చి చేతుల్లో పెట్టారు. ఆ బిడ్డకు క్యాన్సర్ రావడం, తర్వాత డీ.ఎన్.ఏ. పరీక్ష చేయించడంతో.. ఆ దంపతులతో మ్యాచ్ కాలేదు. వారి ఫిర్యాదుతో మొదలైన సికింద్రాబాద్ యూనివర్సల్ సృష్టి ఫెర్టిలిటీ సెంటర్ డా. నమ్రత వ్యవహారాలు అటు అహ్మదాబాద్ నుంచి ఇటు విశాఖ వరకూ ఉన్నాయి. ఫిర్యాదులు వెల్లువెత్తుతున్నాయి. అవును... డాక్టర్ నమ్రత వ్యవహారాలపై బాధితులు క్యూ కడుతున్నారని తెలుస్తోంది. ఈ సమయంలో తాజాగా సరోగసీతో బిడ్డను కనొచ్చని ఓ జంట నుంచి విడతల వారీగా రూ.25 లక్షలు వసూలు చేసిన డా. నమ్రత... తొమ్మిది నెలల తర్వాత ఆశగా వెళ్లిన దంపతులకు... మగబిడ్డ శ్వాస సమస్యతో మరణించాడని చెప్పి, బోల్తా కొట్టించారు! ఇదే తరహాలో మరి కొందరు ఆమె ఆగడాలు వెల్లడిస్తున్నారు. ఈ విధంగా... దంపతుల నుంచి అండాలు, వీర్యకణాలు సేకరించి.. అద్దెగర్భంతో బిడ్డను ఇస్తామని నమ్మించి.. వారి నుంచి లక్షల రూపాయల సొమ్ము వసూలు చేసి, సరిగ్గా తొమ్మిది నెలలు పూర్తిన తర్వాత నవజాత శిశువులను కొనుగోలు చేసి వీరి చేతికిచ్చేయడం చేసేవారు. ఈ నేపథ్యంలో... సరోగసీ ముసుగులో సృష్టి ఫెర్టిలిటీ సెంటర్ లో పెద్దఎత్తున మోసాలకు పాల్పడినట్లు చెబుతున్నారు. ఈ నేపథ్యంలో దేశ వ్యాప్తంగా సృష్టి ఫెర్టిలిటీ సెంటర్ మోసాలతో సంబంధం ఉన్న ఆసుపత్రులు, వైద్యులు, శిశు విక్రయ ముఠాల లింకులను ఛేదించేందుకు పోలీసులు సిద్ధమయ్యారని తెలుస్తోంది. ఈ నేపథ్యంలో... వైద్య ఆరోగ్య, శిశు సంక్షేమ శాఖలతో సమన్వయం చేసుకుని లోతైన దర్యాప్తు చేపట్టారని సమాచారం! తెలంగాణ ప్రభుత్వం ఈ విషయాన్ని సీరియస్ గా తీసుకుంది! ఈ క్రమంలో... సికింద్రాబాద్ లో మొదలైన ఈ దందా విశాఖలో ముగిసేలా ప్లాన్ చేసినట్లు చెబుతున్నారు. ఇందులో భాగంగా... సికింద్రాబాద్ సెంటర్ లో సంతానం లేని దంపతులకు కౌన్సెలింగ్ ఇచ్చి.. అనంతరం వారిని ప్రత్యేక వైద్య పరీక్షల కోసమని చెప్పి విమానాల్లో విశాఖకు తీసుకెళ్లేవారట. అక్కడ పరీక్షలు నిర్వహించేవారట. ఇదే సమయంలో... సరోగసీకి అంగీకరించిన మహిళను వీరికి పరిచయం చేసేవారు. ఇదే సమయంలో... పుట్టబోయే బిడ్డ కోసమని వీర్యకణాలు, అండాలు సేకరించేవారట. ఈ క్రమంలో.. నెలరోజుల అనంతరం సరోగసీ విధానం విజయవంతమైందని, మరో 9 నెలల్లో బిడ్డను అందిస్తామని చెప్పి... డెలివరీ సమయాన్ని ముందుగానే చెప్పి రూ.లక్షల్లో వసూలు చేసేవారని చెబుతున్నారు.



## పార్లమెంటు ఆవరణలో బాలయ్య సందడి..

### ఎంపీ కలిశెట్టి సైకిల్‌పై సవారీ



దిల్లీ: పార్లమెంటు ఆవరణలో నటుడు, హిందూపురం ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ సందడి చేశారు. కేంద్రమంత్రి పెమ్మసాని చంద్రశేఖర్, పార్టీ ఎంపీలతో కలిసి లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లాను మర్యాదపూర్వకంగా కలిశారు. కేంద్ర మంత్రి మనోహర్‌లాల్ ఖట్టర్‌తో భేటీ అయ్యారు. తన నియోజకవర్గ అభివృద్ధికి సంబంధించిన పలు వినతులు సమర్పించారు. అంతకుముందు బాలకృష్ణకు తెదేపా ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు తాను రోజూ పార్లమెంటుకు వచ్చేందుకు ఉపయోగించే సైకిల్‌ను చూపించారు. దీంతో బాలయ్య అక్కడ సరదాగా కాసేపు సైకిల్ నడిపారు.

# కేంద్రంలో భారీ మార్పులు..

## పది రోజుల్లో కీలక పరిణామాలు





## మంత్రివర్గంలో పూర్తి స్థాయిలో మార్పులు - చేర్పులకు అవకాశం!

దేశ రాజకీయాల్లో పెను మార్పులు చోటు చేసుకోనున్నాయా? అధికార బీజేపీకి నూతన అధ్యక్షుడి నియామకంతోపాటు కేంద్ర మంత్రివర్గంలోనూ భారీ మార్పులు ఉండే అవకాశాలు ఉన్నాయని రాజధాని ఢిల్లీలో జోరుగా ప్రచారం జరుగుతోంది. మరో వారం పది రోజుల్లోనే పార్టీ, ప్రభుత్వంలో ప్రక్షాళన ఉండొచ్చని కమలం పెద్దలు సంకేతాలు పంపుతున్నారు. అయితే కొత్త అధ్యక్షుడు కాబోయే నేత పార్టీతోపాటు ప్రభుత్వంపైనా పట్టుసాధించేలా ఉండాలని సంఘ్ పరివార్ కోరుకుంటుందనే ప్రచారమే ఆసక్తి రేపుతోంది. ప్రస్తుతం దేశ రాజకీయాల్లో ప్రధాని మోదీ శకం నడుస్తోంది. 2014లో ప్రధానిగా మోదీగా బాధ్యతలు స్వీకరించిన తర్వాత ప్రభుత్వం, బీజేపీలో మోదీ వన్ మేన్ షో నడిచేది.. ప్రస్తుతం నడుస్తుంది కూడా.. అయితే ఈ పరిస్థితిలో మార్పు రావాలని సంఘ్ పరివార్ కోరుకుంటోందని అంటున్నారు. మోదీ మూడోసారి ప్రధాని పదవీకాలం పూర్తయిన తర్వాత కూడా బీజేపీ బలంగా ఉండాలనే ఆలోచనతో ఉన్న సంఘ్ పరివార్ పార్టీ అధ్యక్షుడిగా బలమైన నేత ఉండాలని కోరుకుంటున్నారని అంటున్నారు. మహారాష్ట్ర, హరియాణా ఎన్నికల్లో బీజేపీని గెలిపించిన ఆర్ఎస్ఎస్ తాజా సూచనలను బీజేపీ పెద్దలు పాటించాల్సిన అనివార్య పరిస్థితులు ఉన్నాయంటున్నారు. దీంతో మరో వారం రోజుల్లోనే కేంద్ర మంత్రివర్గ పునర్వ్యవస్థీకరణతోపాటు పార్టీలోనూ భారీ మార్పులు ఉంటాయంటున్నారు. అదే సమయంలో నాలుగైదు రాష్ట్రాలకు కొత్త గవర్నర్లను నియమించే అవకాశం ఉందని అంటున్నారు. దేశంలో మెజార్టీ రాష్ట్రాల్లో బీజేపీ, మిత్రపక్షాల ప్రభుత్వాలే ఉన్నప్పటికీ గత సార్వత్రిక ఎన్నికల్లో అత్తెసరు సంఖ్యలో గెలవడం, మిత్రపక్షాల మద్దతుతో ప్రభుత్వాన్ని కొనసాగించాల్సి రావడాన్ని బీజేపీ పెద్దలతోపాటు ఆర్ఎస్ఎస్ అగ్ర నేతలు జీర్ణించుకోలేకపోతున్నారని అంటున్నారు. ఇదే సమయంలో కచ్చితంగా ఓడిపోతాయని సర్వేలు తెలిపిన మహారాష్ట్ర, హరియాణా ఎన్నికలల్లో ఆఎస్ఎస్ ఫార్ములా వర్క్ అవుట్ అవ్వడాన్ని గుర్తు చేస్తున్నారు. వచ్చే ఎన్నికల నాటికి దేశవ్యాప్తంగా ఈ ఫార్ములా అమలు కావాలంటే బలమైన నేత పార్టీ అధ్యక్షుడిగా ఉండాలని ఆర్ఎస్ఎస్ సూచిస్తోందని అంటున్నారు. మరోవైపు కేంద్ర మంత్రివర్గంలో ఉన్న కొందరు మంత్రులను తప్పించాలని సూచనలు ఉన్నాయంటున్నారు. ప్రజలతో నేరుగా సంబంధం లేని చాలా మంది కేంద్ర మంత్రులుగా ఉన్నారని, దీనివల్ల ప్రజలను ఆకర్షించలేకపోతున్నామని ఆర్ఎస్ఎస్ అభిప్రాయపడుతోందని అంటున్నారు. ఐఏఎస్, ఐపీఎస్ అధికారులుగా పనిచేసిన కొందరి ప్రతిభ ఆధారంగా కేంద్ర మంత్రివర్గంలో చేర్చుకోవడం వల్ల రాజకీయంగా ప్రయోజనం దక్కడం లేదని ఆర్ఎస్ఎస్ అసంతృప్తి వ్యక్తం చేస్తున్నట్లు చెబుతున్నారు. ఇదే సమయంలో ఐపీఎస్ గా పనిచేసి రాజీనామా చేసిన తమిళనాడు బీజేపీ మాజీ అధ్యక్షుడు అన్నామలై వంటివారిని కేంద్ర మంత్రివర్గంలో చేర్చుకోవాలని ఆర్ఎస్ఎస్ నుంచి సూచనలు వస్తుండటం గమనార్హం అంటున్నారు. ఇదేవిధంగా కొంతమంది గవర్నర్ల వల్ల పార్టీకి చెడ్డ పేరు వస్తోందని బీజేపీతోపాటు ఆర్ఎస్ఎస్ నేతలు అంతర్గత సంభాషణల్లో వ్యాఖ్యానిస్తున్నారని చెబుతున్నారు. తమిళనాడు గవర్నర్ రవి ఆ రాష్ట్ర ప్రభుత్వంతో వివాదం పెట్టుకోవడం, తమిళనాడు ప్రభుత్వం జాతీయ విద్యా విధానాన్ని వ్యతిరేకించడమే కాకుండా నియోజకవర్గాల పునర్విభజన వంటి అంశాలతో దక్షిణాదితో పార్టీని వేరు చేసే వ్యూహాన్ని అమలు చేయడాన్ని బీజేపీ పెద్దలు సీరియస్ గా తీసుకున్నారని అంటున్నారు. ఈ రాజకీయ వ్యూహం నుంచి బయటపడాలంటే గవర్నర్ ను మార్చాలనే అంశాన్ని పరిశీలిస్తున్నారని అంటున్నారు. అయితే ఒక్క తమిళనాడు గవర్నర్ ను మార్చితే స్టాలిన్ ప్రభుత్వానికి తలొగ్గినట్లు అవుతుందనే ఆలోచనతో దేశవ్యాప్తంగా నలుగురైదుగురు గవర్నర్లను మార్చాలనే ప్రతిపాదన పరిశీలిస్తున్నారని అంటున్నారు. దీంతో ఆగష్టు మొదటి వారం లేదా రెండవ వారంలో దేశ రాజకీయాల్లో భారీ మార్పులు ఉండొచ్చని ప్రచారం జరుగుతోంది.

# సంపాదకీయం

## బంగ్లాదేశ్-చైనా-పాకిస్తాన్ సాన్నిహిత్యం భారత్‌కు భవిష్యత్ ముప్పు?

భారతదేశం ప్రపంచంలోనే అత్యంత వేగంగా అభివృద్ధి చెందుతున్న ఆర్థిక వ్యవస్థల్లో ఒకటిగా దూసుకుపోతోంది. ఇటీవలే ఐదో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థ నుంచి నాలుగో స్థానానికి చేరింది. ఇది దేశానికి గర్వకారణమే అయినప్పటికీ, పెరుగుతున్న అభివృద్ధి కొన్ని సవాళ్లను కూడా తీసుకొస్తుంది. ముఖ్యంగా చుట్టూ ఉన్న దేశాలతో సంబంధాలు, వాటి నుంచి ఎదురయ్యే సంభావ్య ముప్పులు ఆందోళన కలిగిస్తున్నాయి. ఈ నేపథ్యంలో, బంగ్లాదేశ్... చైనా ,పాకిస్తాన్‌లతో సన్నిహిత సంబంధాలు పెంచుకోవడం భారత్‌కు ఒక ప్రధాన భద్రతాపరమైన ఆందోళనగా మారుతోంది.

**పాకిస్తాన్ కుట్రలు కొనసాగుతున్నాయి...** పాకిస్తాన్ నుంచి భారత్‌కు భద్రతాపరమైన ముప్పులు ఎప్పటినుంచో ఉన్నాయి. ఉగ్రవాదాన్ని ప్రోత్సహించడం, దేశంలో అంతర్గత అశాంతిని రెచ్చగొట్టడంలో పాకిస్తాన్ కీలక పాత్ర పోషిస్తోంది. కాశ్మీర్ విషయంలో పాక్ తన వైఖరిని మార్చుకోలేదు. ఇప్పుడు చైనాతో కలిసి పాకిస్తాన్ చేస్తున్న దూకుడు భారత భద్రతా వ్యవస్థకు గట్టి పరీక్షనే పెడుతోంది.

**చైనాతో బంగ్లాదేశ్ సాన్నిహిత్యం ఆందోళనకరం...** ఇటీవలి కాలంలో బంగ్లాదేశ్, చైనా మధ్య వాణిజ్య, ఆర్థిక ఒప్పందాలు గణనీయంగా పెరిగాయి. చైనా అందిస్తున్న భారీ రుణాలపై బంగ్లాదేశ్ ఆసక్తి చూపడం, బెల్ట్ అండ్ రోడ్ ప్రాజెక్టులో భాగంగా మౌలిక సదుపాయాలు అభివృద్ధి చేసుకోవడం భవిష్యత్తులో భారత్‌కు సవాలుగా మారే అవకాశం ఉంది. చైనా-బంగ్లాదేశ్ సంబంధాలు బలపడితే, భారత్‌కు వ్యతిరేకంగా ఒక సమీకృత శత్రుశక్తిగా ఎదిగే ప్రమాదం ఉంది.

**భారత ప్రజాస్వామ్యానికి ముప్పు?...** బంగ్లాదేశ్ ఒకప్పుడు భారత్‌తో స్నేహపూర్వక సంబంధాలను కొనసాగించింది. అయితే, ప్రస్తుతం రాజకీయంగా కొంత దూరం పాటిస్తోంది. ప్రస్తుత పరిస్థితుల్లో బంగ్లాదేశ్ కూడా చైనా, పాకిస్తాన్‌లతో కలిసి భారత్‌పై ఒత్తిడి తెచ్చే ప్రయత్నాలు చేస్తే, అది అంతర్గత స్థాయిలో భారత శక్తిని దెబ్బతీసే అవకాశం ఉంది.

**భవిష్యత్ దృష్టితో ముందుకు సాగాలి...** శత్రుదేశాల కలయిక భారత్‌కు ఎంత ప్రమాదకరమో చరిత్రే చెబుతోంది. అలాంటి పరిస్థితుల్లో భారత్ తన సమీప దేశాలతో సానుకూల దౌత్య సంబంధాలు కొనసాగించడమే కాకుండా, భద్రతాపరమైన చర్యల్లో ముందుండాలి. అంతర్జాతీయ స్థాయిలో మిత్రదేశాల మద్దతు కూడగట్టుకుంటూ, చైనా, పాకిస్తాన్, బంగ్లాదేశ్‌ల మధ్య బలపడుతున్న సంబంధాలను సరిదిద్దే విధంగా భారత్ తన వ్యూహాలను సిద్ధం చేయాలి. భారత్ అభివృద్ధి చెందుతున్న సమయంలో చుట్టూ ఉన్న పొరుగు దేశాలు శత్రువుల ముసుగులో కలిసి పనిచేయడం దేశ భద్రతకు తీవ్ర హెచ్చరిక. ఇది పెద్ద సమస్యగా మారకముందే, భారత్ తగినంత ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాల్సిన అవసరం ఉంది.

### బాపట్ల మండలం నందిరాజు తోట గ్రామంలో ప్రాథమిక సహకార సొసైటీ ప్రమాణస్వీకార కార్యక్రమంలో పాల్గొన్న శాసనసభ్యులు వేగేశన నరేంద్ర వర్మ రాజు.....



బాపట్ల:వినుకొండ వార్త:బాపట్ల మండలం నందిరాజుతోట గ్రామంలో ప్రాథమిక సహకార సొసైటీ ప్రమాణ స్వీకారం కార్యక్రమంలో పాల్గొని సభ్యులు తాతా హరి చంద్ర ప్రసాద్ , పల్లప్రోలు శంకర్రావు, కోకి హరిబాబు రెడ్డి గార్లతో ప్రమాణ స్వీకారం చేయించిన బాపట్ల నియోజకవర్గ ఎమ్మెల్యే వేగేశన నరేంద్ర వర్మ రాజు . ఈ కార్యక్రమంలో బావుడా చైర్మన్ సలగల రాజశేఖర్ బాబు, బాపట్ల నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ పరిశీలకులు బొంతు శివ సాంబి రెడ్డి, రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి తాతా జయప్రకాష్ నారాయణ,బాపట్ల మండల పార్టీ అధ్యక్షుడు ముక్కామల సాంబశివరావు,నియోజకవర్గ జనసేన పార్టీ సమన్వయకర్త నామన వెంకట శివన్నారాయణ, గ్రామ పార్టీ అధ్యక్షుడు కందుల బాలకోటేశ్వరరావు, మరియు తెలుగుదేశం పార్టీ నాయకులు కార్యకర్తలు గ్రామస్తులు పాల్గొన్నారు.



చీరాల: వినుకొండ వార్త : మున్సిపల్ చైర్మన్గా గా నూతనంగా ఎన్నికైన మించాలా సాంబశివరావు ను బుధవారం కార్యాలయంలోని చేర్మెన్ ఛాంబర్‌లో చీరాల గడియార స్తంభం దగ్గర ఉన్న మించాల సాంబశివరావు ఫ్రెండ్స్ మర్యాదపూర్వకంగా కలిశారు . ఈక్రమంలో చేర్మెన్ సాంబశివరాను దుశ్శలవాలతో ఘనంగా సత్కరించారు. పట్టణ ప్రథమ పౌరుడిగా తనదైన శైలిలో చీరాల మున్సిపాలిటీ అభివృద్ధి పథంలో నడిపించాలని సాంబశివరావు ఫ్రెండ్స్ కోరారు. ఈ కార్యక్రమంలో గడ్డం శ్రీనివాసరావు,వడ్లమూడి ఆదినారాయణ,పూడి నారాయణ,భూషణం, కాకి జాన్,దాసు,రామచంద్రారెడ్డి పాల్గొన్నారు.

### నేడు సర్దార్ గౌత లచ్చన్న విగ్రహా ఆవిష్కరణ

చెరుకుపల్లి. ( వి ఎన్ కే వార్త ). బడుగు బలహీన వర్గాల ఆశాజ్యోతి స్వాతంత్ర సమరయోధులు సర్దార్ గౌత లచ్చన్న విగ్రహ ఆవిష్కరణ శుక్రవారం రేపల్లె జూనియర్ కళాశాల ఎదురు ఆవిష్కరించడం జరుగుతుందని మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు తాత ఏడుకొండలు అన్నారు. గురువారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ విగ్రహ ఆవిష్కరణ కార్యక్రమానికి రాష్ట్ర రెవెన్యూ రిజిస్ట్రేషన్ మరియు



స్టాంపులు మంత్రివర్యులు అనగాని సత్యప్రసాద్ హాజరవుతున్నట్లు ఆయన తెలిపారు. కావున మండలంలోని బడుగు బలహీన వర్గాలకు చెందిన నాయకులు కార్యకర్తలు అభిమానులు ఆంధ్ర హాజరు కావాలని ఆయన కోరారు.



చీరాల : వినుకొండ వార్త : చీరాల 15వ వార్డు కౌన్సిలర్ శ్రీమతి దాసరి శారద దాసరి రామకృష్ణ గారి కుమార్తె వివాహ వేడుకకు హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించిన చీరాల తెలుగుదేశం పార్టీ అధికార ప్రతినిధి మద్దులూరి మహేంద్రనాథ్, మరియు ఏఎంసీ చైర్మన్ కౌతరపు జనార్దన్, మున్సిపల్ చైర్మన్ మించాలా సాంబశివరావు, మున్సిపల్ కమిషనర్ రషీద్,మరియు కౌన్సిలర్లు. తెలుగుదేశంపార్టీ కూటమి నాయకులు, కార్యకర్తలు శ్రేయోభిలాషులు, పాల్గొన్నారు.

### దారుణం.. నిద్రిస్తున్న భర్తపై వేడినీళ్లు పోసిన భార్య

భీమునిపట్నం: విశాఖపట్నం జిల్లా భీమునిపట్నం పరిధి నేరెళ్లవలసలో దారుణం చోటుచేసుకుంది. నిద్రిస్తున్న భర్తపై భార్య వేడినీళ్లు పోసింది. బుధవారం రాత్రి 2 గంటల సమయంలో ఈ ఘటన జరిగింది. వివరాల్లోకి వెళితే.. నందిక కృష్ణ, గౌతమి ఆరేళ్ల క్రితం ప్రేమ వివాహం చేసుకున్నారు. భార్యాభర్తల మధ్య తరచూ తగాదాలు జరుగుతున్నాయి. ఈ క్రమంలో బుధవారం రాత్రి గౌతమి తన భర్తపై వేడినీళ్లు పోసింది.

బాధితుడికి గాయాలు కావడంతో విశాఖ కేజీహెచ్‌లో చికిత్స పొందుతున్నాడు. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేశారు.

# బాపట్ల జిల్లా వార్తలు

## వరదలు వస్తే తక్షణమే నివారణ, సహాయక చర్యలకు అధికార యంత్రాంగం సంసిద్ధంగా ఉండాలని అంటున్న జిల్లా కలెక్టర్ వెంకట్ మురళి....



బాపట్ల:వినుకొండ వార్త: వరదలు వస్తే తక్షణమే నివారణ, సహాయక చర్యలకు అధికార యంత్రాంగం సంసిద్ధంగా ఉండాలని జిల్లా కలెక్టర్ జె వెంకట మురళి తెలిపారు. విపత్తు నిర్వహణ, నిర్మూలన, ముందస్తు ప్రణాళిక అంశాలపై ఆర్డీవోలతో గురువారం ఆయన ముందస్తు సమావేశం నిర్వహించారు. విపత్తుల నిర్వహణపై సూక్ష్మ స్థాయిలో సమగ్ర ప్రణాళిక ఉండాలని కలెక్టర్ చెప్పారు. కృష్ణానది వరద అకస్మాత్తుగా వస్తే మునిగే ప్రాంతాలు, ప్రభావిత ప్రాంతాల వివరాలు, జనాభా వివరాలు సేకరించాలన్నారు. తీర ప్రాంతంలో ఉన్న బాపట్ల జిల్లాకు తుపాను హెచ్చరికలు వస్తే ముందస్తుగా ఎలాంటి చర్యలు తీసుకోవాలో గుర్తించాలన్నారు. దెబ్బతినే గృహాలు, ప్రాంతాలపై నివేదిక సిద్ధం చేయాలన్నారు. అలాగే భారీ వర్షాలు కురిస్తే లోతట్టు ప్రాంతాలు, జలమయం అయ్యే గృహాల వివరాలు ముందస్తుగా గుర్తించాలన్నారు. వరద, తుపాను, భారీ వర్షాలకు నష్టాలు, ముందస్తుగా తీసుకోవలసిన చర్యలపై వేరువేరుగా ప్రణాళికలు రూపొందించాలన్నారు. కృష్ణానది ఎగువ ప్రాంతాలలో వర్షాలు అధికంగా కురవడం, డ్యాములలోకి వరద నీరు చేరుతుందన్నారు. ఈ నేపథ్యంలో వరద నీరు దిగువకు విడుదల చేస్తున్నందున్న లంక గ్రామాలకు ప్రమాదం పొంచి ఉందన్నారు. 14 నివాస ప్రాంతాలు మునిగే అవకాశం ఉందన్నారు. కృష్ణానది కరకట్ట బలహీనంగా ఉన్నందున ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు. గండ్లు పడే అవకాశం ఉన్న ప్రాంతాలలో ఇసుక బస్తాలతో బలోపేత చేయడానికి అన్ని చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఆ ప్రాంతాలలో గర్భిణీలు, దీర్ఘకాలిక వ్యాధిగ్రస్తులు, వృద్ధులు చిన్నారులను గుర్తించి వివరాలు పంపాలన్నారు. మర బోట్లు సిద్ధం చేసుకోవాలన్నారు. పునరావాసు కేంద్రాలు ముందుస్తుగా గుర్తించాలన్నారు. మూడు నెలలకు సరిపడా నిత్యవసర సరుకులు, పునరావాస కేంద్రాలలో పది రోజులు భోజన సదుపాయాలు అందించేలా అన్ని ఏర్పాట్లు చేసుకోవాలన్నారు. సహాయక చర్యలకు యంత్రాంగం సిద్ధంగా ఉండాలన్నారు. ప్రతి 30 కుటుంబాలకు ఒక ఉద్యోగి అందుబాటులో ఉండేలా నియామకాలు చేసుకోవాలన్నారు. నివాస ప్రాంతానికి ఒక మండల అధికారిని నియమించాలన్నారు. ఈ సమావేశంలో ఇంచార్జి సంయుక్త కలెక్టర్, డి ఆర్ ఓ జి.గంగాధర్ గౌడ్, ఆర్డీవోలు గ్లోరియా, చంద్రశేఖర్, రామలక్ష్మి, సిపిఓ షాలెంరాజు, సంబంధిత విభాగం పర్యవేక్షకులు షేక్ షఫీ, తదితరులు పాల్గొన్నారు.

## ఎమ్మెల్యే ఏలూరి కృషితో...పర్చూర్ ఎస్టి బాలుర గురుకుల పాఠశాలకు సొంత భవనం...



**-రూ5.30 కోట్లు మంజూరు చేసిన కూటమి ప్రభుత్వం...**
**-నూతన బిల్లింగ్ నిర్మాణానికి నిధులు విడుదల...**
**-తరగతి గదుల నిర్మాణం1.60 కోట్లు...**
**హాస్టల్ బిల్డింగ్ నిర్మాణానికి 3.19 కోట్లు..**
**ఫర్నిచర్ కొనుగోలుకు 16 లక్షలు..**
**ఆధునికరణ పనులకు 35 లక్షలు..**

పర్చూరు:వినుకొండ వార్త:ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు ప్రత్యేక కృషితో పర్చూరు మండల కేంద్రంలో ఎస్సీ గురుకుల బాలుర పాఠశాల విద్యార్థుల వసతి గృహ నిర్మాణానికి కూటమి ప్రభుత్వం నిధులు మంజూరు చేసింది. ఈ మేరకు నూతన భవన నిర్మాణానికి 5.30 కోట్లు నిధులు మంజూరు చేస్తూ ప్రభుత్వం ఉత్తరలు జారీ చేసింది. గత వైసిపి పాలనలో విద్యార్థులు శిథిలావస్థకు చేరిన భవనంతో తీవ్ర ఇబ్బందులకు గురైన నేపథ్యంలో ఎమ్మెల్యే ఏలూరి ప్రత్యేక చొరవతో నూతన భవన నిర్మాణానికి ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. విద్యార్థులకు ఆధునిక క్లాస్ రూమ్స్ హాస్టల్ బిల్డింగు మరుగుదొడ్లు టీచింగ్ స్టాఫ్ రూమ్స్ ఫర్నిచర్ ఆధునికరణ పనులకు ప్రభుత్వం ప్రత్యేక అంచనాలతో నిధులు మంజూరు చేసింది.గత ఐదేళ్లు నిరాదరణకు గురైన గిరిజన గురుకుల పాఠశాలలు ,హాస్టల్స్ కు పూర్వ వైభవం తీసుకురావాలని లక్ష్యంతో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే విద్యా వ్యవస్థ పై ప్రత్యేక దృష్టించింది సొంత భవనాలు లేని హాస్టల్స్ పాఠశాలను దీంతో గిరిజన సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో గిరిజన వసతి పాఠశాలల మౌలిక సదుపాయాల అభివృద్ధికి కార్యాచరణకు పూనుకుంది. అత్యాధునిక వసతులతో హాస్టల్ భవనం నిర్మించేలా ప్రణాళికలు చేశారు. ఐదేళ్లు సమస్యలతో సహవాసం చేసిన విద్యార్థులకు ఎలాంటి అసౌకర్యం లేకుండా ఉండాలనే లక్ష్యంతో ఎమ్మెల్యే ఏలూరి ప్రత్యేక కృషితో నూతన బిల్లింగ్ నిర్మాణానికి ప్రభుత్వం రూపకల్పన చేసింది. దీనిలో భాగంగా నూతన తరగతి గదుల నిర్మాణం రూ. 1.60 కోట్లు , నూతన హాస్టల్ బిల్డింగ్ నిర్మాణానికి రూ. 3.19 కోట్లు,ఫర్నిచర్ కొనుగోలుకు రూ. 16 లక్షలు ,ఆధునికరణ పనులకు రూ. 35 లక్షలు ప్రభుత్వం విడుదల చేసింది. త్వరలో భవన నిర్మాణానికి చర్యలు చేపట్టనున్నారు. విద్యార్థుల కష్టాలకు చెక్ పడనుంది.

## అటు వెడల్పు.. ఇటు లైనింగ్

అనంతపురం : ఉమ్మడి అనంత జిల్లా వరప్రదాయినిగా భావించే హంద్రీనీవా ప్రధాన కాలువ ఆధునికీకరణ పనులు కొనసాగుతున్నాయి. నీటి సీజన్ మొదలు కావడం.. శ్రీశైలం ప్రాజెక్టుకు వరద పోటెత్తడంతో పనుల పురోగతిపై అధికార యంత్రాంగం ప్రత్యేక దృష్టి సారించింది. కాలువకు ఈనెలాఖరులోపు నీటిని విడుదల చేసే అవకాశం ఉండటంతో జిల్లా జలవనరుల శాఖ సీఈ నాగరాజు, ఎస్ఈ అన్నవరం స్వరూప్‌కుమార్.. క్షేత్ర స్థాయి పనులను పర్యవేక్షిస్తున్నారు. దీంతో ప్రధాన కాలువ పనుల్లో వేగం పెరిగింది. కానీ పుంగనూరు ఉప కాలువ(పీబీసీ) పనులు మందకొడిగా సాగుతున్నాయి. ఇక్కడ మట్టి తొలగింపులో వేగం పెరగాల్సి ఉంది. ఈనెల 10 నాటికి పూర్తి చేయాలని గడువు పెట్టుకున్నారు. ప్రధాన కాలువ తొలి దశ కింద వెడల్పు, రెండో దశలో పీబీసీ లైనింగ్ పనులు చేస్తున్న సంగతి తెలిసిందే.

**తొలి దశ కీలకం**

ప్రధాన కాలువ తొలి దశ కింద విస్తరణ పనులు చేస్తున్నారు. 88 కి.మీ. నుంచి 216.300 కి.మీ. దాకా వెడల్పు చేయడానికి ప్రభుత్వం రూ.695.53 కోట్ల అంచనా వ్యయంతో పరిపాలన ఉత్తర్వు ఇచ్చిన సంగతి తెలిసిందే. 3850 క్యూసెక్కుల ప్రవాహ సామర్థ్యంతో విస్తరిస్తున్నారు. మార్చి రెండో వారం నుంచి పనులు మొదలయ్యాయి. ఇప్పటివరకు 71.02 శాతం పనులు జరిగాయి. 84.97లక్షల క్యూబిక్ మీటర్ల మట్టిని తొలగించాల్సి ఉండగా.. 60.345 క్యూబిక్ మీటర్ల మట్టిని ఎత్తిపోశారు. తొలి దశ కాలువ ద్వారా గుంతకల్లు, ఉరవకొండ, రాయదుర్గం, కళ్యాణదుర్గం ప్రాంతాలకు నీరు అందనుంది.

**259 కి.మీ.మేరకు..** రెండో దశలో ప్రధాన కాలువ, పీబీసీ కలిపి లైనింగ్ పనులు 259 కి.మీ. చేయాల్సి ఉంది. 216 నుంచి 400 కి.మీ. దాకా ఇద్దరు గుత్తేదారులు ఐదు ప్యాకేజీలుగా విభజించారు. ఇందుకు రూ.1256.30 కోట్ల అంచనా వ్యయంతో పని చేస్తున్నారు. లైనింగ్ పనుల్లో జాప్యం జరుగుతోంది. ఇక పీబీసీని రెండు ప్యాకేజీలు విభజించారు. రూ.266.24 కోట్ల అంచనా వ్యయంతో ఆధునికీకరణ సాగుతోంది. లైనింగ్‌లోనే కాదు.. మట్టి పనిలోనూ నత్తనడక కొనసాగుతోంది. ఈ రెండు ప్యాకేజీల్లో వేగం పెరగాల్సి ఉంది. మేలో కొంతమేర వర్షాలు పడటంతో పనులకు ఆటంకం ఏర్పడింది. ఈనెలాఖరుకు పనులు పూర్తి చేసేందుకు కృషి చేస్తున్నట్లు ఎస్ఈ స్వరూప్‌కుమార్ తెలిపారు.రెండో దశ ప్రధాన కాలువ ఉరవకొండ, రాప్తాడు, పుట్టపర్తి, మడకశిర, పెనుకొండ, హిందూపురం, కదిరి నియోజకవర్గాల మీదుగా వెళ్తుంది.

## జేఎన్‌టీయూ టు స్వీడన్

విశాఖపట్నం : అనంత జేఎన్‌టీయూలో ఇంజినీరింగ్ చదివితే స్వీడన్‌కు వెళ్లే అవకాశం ఉంది. స్వీడన్‌లోని బకింగ్‌హమ్ విశ్వవిద్యాలయంతో జేఎన్‌టీయూ ఒప్పందం కుదుర్చుకుంది. సాధారణంగా బీటెక్ చదివితే ఒక డిగ్రీ పట్టా వస్తుంది. జేఎన్‌టీయూ అందిస్తున్న డబుల్ డిగ్రీ కోర్సుల్లో నాలుగేళ్ల బీటెక్ కోర్సు పూర్తి చేస్తే ఒకేసారి రెండు డిగ్రీలు పొందొచ్చు. ఇక్కడ మూడేళ్లు, స్వీడన్‌లో ఏడాది చదవాల్సి ఉంటుంది. కోర్సు పూర్తి చేసిన విద్యార్థులకు జేఎన్‌టీయూ బీటెక్ పట్టా, స్వీడన్‌లోని ఇంజినీరింగ్ కళాశాల సర్టిఫికెట్ ప్రదానం చేయనున్నారు. 2017 నుంచి కళాశాల ఈ సదవకాశాన్ని కల్పిస్తోంది. ఇటీవలే మాస్టర్స్ డిగ్రీ జత కలిపారు.

**ప్రవేశాలు ఎలా..**

డబుల్ డిగ్రీ కోర్సులో చేరాలంటే ఇంటర్మీడియట్‌లో 60 శాతంతో ఉత్తీర్ణులై ఉండాలి. జేఈఈ, ఈఏపీసెట్ గాని, తెలంగాణ ఈఏపీసెట్‌లో అర్హత సాధించి ఉండాలి. జేఈఈలో ర్యాంకు సాధించిన వారికి 50 శాతం ప్రవేశాలు కల్పిస్తారు. కంప్యూటర్ సైన్స్ విభాగంలో 20, ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్ విభాగంలో 10 సీట్లున్నాయి.

**ప్రయోజనం ఏమిటి?**

విదేశీ విద్య, ఉద్యోగాలు చేయాలనుకొనేవారికి కోర్సు ఎంతో ఉపయుక్తంగా ఉంటుంది. జేఎన్‌టీయూ అందించే బ్యాచిలర్ ఆఫ్ సైన్స్ (బీఎస్సీ) సర్టిఫికెట్‌తో ఎంఎస్‌లో చేరడానికి ప్రవేశ పరీక్ష రాయాల్సిన అవసరం ఉండదు. నేరుగా ఎంఎస్‌లో చేరి స్వీడన్‌లోనే కొలువులు



సాధించవచ్చు.

**ఈనెల 10 వరకు గడువు**

దరఖాస్తుకు ఈనెల 10 తుది గడువుగా నిర్ణయించాం. 14 న కౌన్సెలింగ్ నిర్వహించనున్నాం. ఏటా రూ.1.50 లక్షలు చెల్లించాల్సి ఉంటుంది. చివరి ఏడాది స్వీడన్ కళాశాల నిర్ణయించిన మేరకు ఫీజు చెల్లించాలి. అక్కడ ఉత్తమ మార్కులు సాధిస్తే ఉపకారవేతనం లభిస్తుంది. సాధారణ బీటెక్‌లా కాకుండా డబుల్‌డిగ్రీ కోర్సులో చేరడం వల్ల రెండు డిగ్రీలు లభిస్తాయి. ఆసక్తి గలవారు సద్వినియోగం చేసుకోవచ్చు.

ఆచార్య సుదర్శనరావు, ఉపకులపతి, జేఎన్‌టీయూ



# ఘనవ్యర్థాల నిర్వహణపై అధ్యయనం

సింగపూర్‌లో ఏపీ మంత్రి నారాయణ పర్యటన కొనసాగుతోంది. ఆ దేశంలో ఘన వ్యర్థాల నిర్వహణపై ఆయన అధ్యయనం చేస్తున్నారు. చెత్తసేకరణ వాహనాలు, స్వీపింగ్ మెషీన్లను మంత్రి నారాయణ, సీఆర్డీఏ కమిషనర్ కన్నబాబు పరిశీలించారు. సింగపూర్ అధికారులు ఘన వ్యర్థాల నిర్వహణపై వివరించారు. ఇళ్లలో చెత్త సేకరణ చేయడం నుంచి ఘన వ్యర్థాల నిర్వహణ వరకు తీసుకుంటున్న చర్యలను మంత్రి అధ్యయనం చేశారు. గ్రీనరీ నిర్వహణ కోసం ఉపయోగిస్తున్న అధునాతన ట్యాంకర్లను ఆయన పరిశీలించారు. సింగపూర్‌లో వేస్ట్ టు ఎనర్జీ ప్లాంట్లను మంత్రి పరిశీలించనున్నారు. ఏపీలో ఘన వ్యర్థాల నిర్వహణ కోసం వేస్ట్ టు ఎనర్జీ ప్లాంట్లను ప్రభుత్వం ఏర్పాటు చేస్తోంది. సింగపూర్ తరహాలో ఇళ్ల వద్ద నుంచి చెత్త సేకరణ చేసే విధానంపై ఏపీ ప్రభుత్వం ఆసక్తిగా ఉంది.



# సీఐడీ మాజీ చీఫ్ సంజయ్‌కు షాక్

దిల్లీ: ఏపీ సీఐడీ మాజీ చీఫ్ సంజయ్ ముందస్తు బెయిల్‌ను సుప్రీంకోర్టు రద్దు చేసింది. సంజయ్‌కు ముందస్తు బెయిల్ ఇస్తూ గతంలో హైకోర్టు ఇచ్చిన ఉత్తర్వులను కొట్టివేస్తూ గురువారం ఆదేశాలు జారీ చేసింది. కోర్టు ముందు లొంగిపోవడానికి మూడు వారాల సమయం ఇచ్చింది. సంజయ్ కస్టడీ కోసం మేజిస్ట్రేట్ కోర్టులో దర్యాప్తు సంస్థ పిటిషన్ దాఖలు చేసుకోవచ్చని, బెయిల్ కోరుతూ నిందితుడు మేజిస్ట్రేట్ కోర్టును ఆశ్రయించవచ్చని తెలిపింది. అగ్నిమాపక విభాగంలో అవినీతి కేసులో ఆయనపై ఏపీ ప్రభుత్వం ఎఫ్ఐఆర్ నమోదు చేసింది. ఈ కేసులో సంజయ్‌కు ఏపీ హైకోర్టు ముందస్తు బెయిల్ ఇచ్చింది. ఉన్నత న్యాయస్థానం తీర్పును రాష్ట్ర ప్రభుత్వం సుప్రీంకోర్టులో సవాల్ చేసింది. దీనిపై సుదీర్ఘ వాదనల తర్వాత జస్టిస్ అమానుతుల్లా, జస్టిస్ ఎస్.వి.ఎన్ భట్టి ధర్మాసనం ఇవాళ తీర్పు వెలువరించింది. సంజయ్‌కి ముందస్తు బెయిల్ ఇస్తూ రాష్ట్ర హైకోర్టు 49 పేజీల తీర్పు రాయడంపై గత విచారణ సందర్భంగా ధర్మాసనం విస్మయం వ్యక్తం చేసింది. ముందస్తు బెయిల్ దశలోనే ట్రయల్ పూర్తి చేసినట్లు ఉందని వ్యాఖ్యానించింది. నిర్వహించిన ప్రతి సదస్సులో 350 మంది హాజరయ్యారని చూపారు.. ఇదెలా సాధ్యం అని ప్రశ్నించింది. అన్ని సదస్సుల్లో ఒకరు ఎక్కువ ఒకరు తక్కువ లేకుండా ఎలా ఉంటారని విస్మయం వ్యక్తం చేసింది. ముఖ్యమైన పదవుల్లో ఉన్న అధికారులు.. అన్ని చూసుకోవాలి గానీ, ఇష్టానుసారం చేస్తే ఎలా అని సుప్రీంకోర్టు ఆగ్రహం వ్యక్తం చేసింది.

**రూ.2 కోట్లకు పైగా నిధులు దుర్వినియోగం...** 'అగ్నిమాపక శాఖలో నిరభ్యంతర పత్రాలు (ఎన్వోసీలు) ఆన్‌లైన్‌లో జారీచేసేందుకు అగ్ని-ఎన్వోసీ వెబ్‌సైట్, మొబైల్ యాప్ అభివృద్ధి, నిర్వహణ, 150 ట్యాబ్‌ల సరఫరా కాంట్రాక్టును సౌత్రికా టెక్నాలజీస్ అండ్ ఇన్‌ఫ్రా సంస్థకు సంజయ్ అప్పగించారు. ఎలాంటి పనులూ జరగకపోయినా ఆ సంస్థకు రూ.59.93 లక్షల బిల్లులు చెల్లించేశారు.

సీఐడీ తరఫున ఎస్సీ, ఎస్టీ ఎట్రాసిటీ నిరోధక చట్టంపై దళితులు, గిరిజనులకు అవగాహన సదస్సుల నిర్వహణ కాంట్రాక్టును క్రిత్వ్యాప్ టెక్నాలజీస్‌కు ఇచ్చి, రూ.1.19 కోట్లు చెల్లించారు. సదస్సులు మొత్తం సీఐడీ అధికారులే నిర్వహించారు. క్రిత్వ్యాప్ సంస్థ అసలు సదస్సులే నిర్వహించకపోయినా బిల్లుల పేరిట దోచేశారు. ఈ మేరకు ప్రభుత్వ ఖజానాకు దాదాపు రూ.2 కోట్ల మేర నష్టం కలిగించారు' అని విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ విభాగం ప్రభుత్వానికి రెండు వేర్వేరు నివేదికలు సమర్పించింది. వాటి ఆధారంగా సంజయ్‌పై ఏసీబీ కేసు నమోదు చేసిన విషయం తెలిసిందే.



# జగన్ పర్యటన.. ఆంక్షలు ఉల్లంఘించి జనసమీకరణ

నెల్లూరు: వైకాపా అధినేత జగన్ నెల్లూరు జిల్లా పర్యటన సందర్భంగా ఆ పార్టీ శ్రేణులు పోలీసుల ఆంక్షలు ఉల్లంఘించారు. హెలికాప్టర్‌లో నెల్లూరుకు చేరుకున్న జగన్ నేరుగా సెంట్రల్ జైలు వద్దకు వెళ్లి మాజీ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డితో ములాఖత్ అయ్యారు. జైల్లోకి ముగ్గురుకి మాత్రమే పోలీసులు అనుమతి ఇచ్చారు. కాకాణితో ములాఖత్ ముగిసిన తరువాత నెల్లూరు నగరంలోని మాజీ ఎమ్మెల్యే నల్లపురెడ్డి ప్రసన్నకుమార్ రెడ్డి ఇంటికి బయల్దేరారు. నెల్లూరు ఆర్అండ్‌బీ అతిథి గృహం వద్ద మాజీ ఎమ్మెల్యే ప్రసన్న కుమార్‌రెడ్డి బైఠాయించారు. కార్యకర్తలను పోలీసులు అనుమతించట్లేదని ఆందోళనకు దిగారు. జగన్ పర్యటనకు పోలీసు ఆంక్షలు ఉన్నా.. నిబంధనలకు విరుద్ధంగా జన సమీకరణ చేశారు. వేదాయపాలెం, కరెంట్ ఆఫీస్ సెంటర్, ప్రభుత్వ ఆసుపత్రి సమీపంలో భారీగా గుమికూడారు. అనంతపురం జిల్లా రాప్తాడు, ప్రకాశం జిల్లా పొదిలి, పల్నాడు జిల్లా రెంటపాళ్ల, చిత్తూరు జిల్లా బంగారుపాళ్యం పర్యటనల్లో వైకాపా శ్రేణులు ఆంక్షలను ధిక్కరించిన నేపథ్యంలో పోలీసులు మరింత అప్రమత్తమయ్యారు. జగన్ పర్యటనకు ఇన్‌ఛార్జి ఎస్పీ దామోదర్ ఆంక్షలతో కూడిన అనుమతినిచ్చారు. ఎట్టి పరిస్థితుల్లోనూ హెలిప్యాడ్ వద్ద 10 మంది, జైలు దగ్గర ములాఖత్‌కు ముగ్గురు, నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి ఇంటి దగ్గర 100 మందికి మించి అనుమతించకూడదని స్పష్టంచేశారు. అయినా... కార్యాకర్తలను భారీగా తరలించేందుకు వైకాపా నేతలు విశ్వప్రయత్నం చేశారు. ఎక్కడికక్కడ పోలీసులు తనిఖీలు నిర్వహించి కార్యకర్తలను నిలువరించారు. నిబంధనల్ని ఉల్లంఘించే వారిపై చర్యలు చేపట్టారు.



# జగన్ పరిపాలన చేయలేదు.. అవినీతి ముఠాను నడిపారు

అమరావతి: ఏపీ మాజీ సీఎం, వైకాపా అధినేత జగన్ ఓ అవినీతి శాస్త్రవేత్త అని ఏపీ కాంగ్రెస్ వ్యవహారాల ఇంఛార్జి మాణికం ఠాగూర్ వ్యాఖ్యానించారు. మద్యం ముడుపుల కేసులో రూ.11 కోట్లు దొరకటంపై ఆయన స్పందించారు. "తొలి విడతలో రూ.11 కోట్ల మద్యం ముడుపులు పట్టుబడ్డాయి. జగన్ చేసిన దోపిడీ నగదు ప్రస్తుతం పోలీసుల కస్టడీలో ఉంది. మొత్తం రూ. 3,500 కోట్ల స్కామ్ జరిగింది. మద్యం ముడుపులతోనే సినిమాలు, ఆస్పత్రులు నిర్మించారు. ఆ డబ్బుతోనే షెల్ కంపెనీలు ఏర్పాటు చేశారు. ఈ కుంభకోణంలో మనీలాండరింగ్ జరిగింది. జగన్ పరిపాలన చేయలేదు.. అవినీతి ముఠాను నడిపారు. "అని విమర్శలు గుప్పించారు.



# మాలేగావ్ పేలుడు కేసు.. మాజీ ఎంపీ నిర్దోషి..

ముంబయి: దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించిన 2008 నాటి మాలేగావ్ పేలుడు కేసులో ముంబయిలోని ప్రత్యేక కోర్టు కీలక తీర్పు వెలువరించింది. ఈ కేసు లో అభియోగాలు ఎదుర్కొంటున్న మాజీ ఎంపీ ప్రజ్ఞా ఠాకూర్, లెఫ్టినెంట్ కర్నల్ ప్రసాద్ పురోహిత్ సహా మొత్తం ఏడుగురు నిందితులను ఎన్ఐఏ కోర్టు నిర్దోషులుగా తేల్చింది. ఈ మేరకు గురువారం తీర్పు వెలువరించింది.

ఈ కేసు దర్యాప్తు, ప్రాసిక్యూషన్ వాదనలో చాలా లోటుపాట్లు ఉన్నాయని కోర్టు తెలిపింది. "ఈ కేసుకు ఉపా (చట్టవ్యతిరేక కార్యకలాపాల నిరోధక) చట్టం వర్తించదు. ఈ పేలుడుకు వినియోగించిన మోటార్‌బైక్.. మాజీ ఎంపీ ప్రజ్ఞా ఠాకూర్ పేరు మీద రిజిస్టర్ అయిందని ప్రాసిక్యూషన్ చేసిన వాదనకు తగిన సాక్ష్యాధారాలు లేవు. బైక్‌కు అమర్చిన బాంబు వల్లే పేలుడు సంభవించిందని చెప్పేందుకు కూడా ఆధారాల్లేవ్. ఉగ్రవాదానికి మతం లేదు. ఎందుకంటే ఏ మతం కూడా హింసను ప్రోత్సహించదు. కానీ, కేవలం ఊహాగానాలు, నైతిక ఆధారాలతో ఎవరినీ కోర్టులు శిక్షించవు. బెనిఫిట్ ఆఫ్ డౌట్ మినహా ఈ కేసులో ఎలాంటి బలమైన ఆధారాల్లేవు" అని తీర్పు వెలువరించే సమయంలో కోర్టు వెల్లడించింది.

**మీ ప్రవర్తన విశ్వాసం కలిగించటం లేదు...** ఈ కేసులో ఆరుగురు మృతుల కుటుంబాలకు రూ.2 లక్షల చొప్పున నష్టపరిహారం ఇవ్వాలని న్యాయస్థానం ఆదేశించింది. క్షతగాత్రులకు రూ.50వేల ఆర్థికసాయం ఇవ్వాలని సూచించింది. తీర్పుపై మాజీ ఎంపీ ప్రజ్ఞా ఠాకూర్ హర్షం వ్యక్తంచేశారు. ఈ కేసు కారణంగా గత 17 ఏళ్ల పాటు తన జీవితం నాశనం అయ్యిందన్నారు. తనను బాధ పెట్టిన వారిని దేవుడే శిక్షిస్తారని అన్నారు. మరోవైపు, ఈ తీర్పును తాము హైకోర్టులో సవాల్ చేయనున్నట్లు బాధిత కుటుంబాలు వెల్లడించాయి.

**ఏంటీ కేసు..?..** మహారాష్ట్రలోని మాలేగావ్ ప్రాంతంలో 2008 సెప్టెంబరు 29న పేలుడు సంభవించింది. ఓ మసీదు సమీపంలో మోటార్ సైకిల్‌కు అమర్చిన బాంబు పేలడంతో ఆరుగురు ప్రాణాలు కోల్పోయారు. మరో 100 మందికి పైగా గాయపడ్డారు. అప్పట్లో ఈ కేసు పెను సంచలనం సృష్టించింది. ఈ ఘటనపై ప్రజ్ఞా ఠాకూర్, పురోహిత్‌తో పాటు రమేశ్ ఉపాధ్యాయ్, అజయ్ రహీర్‌కార్, సుధాకర్ ద్వివేది, సుధాకర్ చతుర్వేది, సమీర్ కులకర్ణి ప్రధాన నిందితులుగా కేసు నమోదైంది. ఈ కేసులో తొలుత దర్యాప్తు ప్రారంభించిన ఏటీఎస్.. ప్రస్తుత సాక్షి (40వ నంబరు) సహా పలువురి వాంగ్మూలాలను అప్పట్లో నమోదుచేసింది. ఆపై కేసు దర్యాప్తు బాధ్యతలను ఎన్ఐఏ స్వీకరించింది. ఈ కేసులో 220 మంది సాక్షులను విచారించగా.. వారిలో 15 మంది అంతకుముందు తాము ఇచ్చిన వాంగ్మూలానికి విరుద్ధంగా మాట్లాడటం గమనార్హం.




# ప్రకాశం బ్యారేజీకి పెరుగుతున్న వరద

## ప్రకాశం బ్యారేజీకి వరద.. 70 గేట్లు ఎత్తి నీటివిడుదల

విజయవాడ: పులిచింతల ప్రాజెక్టు నుంచి విడుదలైన 3లక్షల క్యూసెక్కుల వరద నీరు ఇవాళ ప్రకాశం బ్యారేజీకి చేరుతుందని ఎన్టీఆర్‌జిల్లా కలెక్టర్ లక్ష్మీశ తెలిపారు.

లోతట్టు ప్రాంతాల ప్రజలను అప్రమత్తం చేశామన్న కలెక్టర్.. 24గంటల పర్యవేక్షణకు కమాండ్ కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేశామన్నారు. ప్రకాశం బ్యారేజీని జలవనరులశాఖ అధికారులతో కలిసి కలెక్టర్ పరిశీలించారు. విజయవాడ నగరంలో 43 లోతట్టు ప్రాంతాలను గుర్తించినట్లు అధికారులు వెల్లడించారు.

ప్రకాశం బ్యారేజీలో ప్రస్తుతం 55 గేట్లను ఒక అడుగు మేర, 15 గేట్లను రెండు అడుగుల మేర ఎత్తి60 వేల క్యూసెక్కుల నీటిని సముద్రంలోకి.. ఈస్ట్, వెస్ట్ కెనాల్స్ ద్వారా 14వేల క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నామని కలెక్టర్ తెలిపారు.

# సింగపూర్ పర్యటనతో 45వేల కోట్ల పెట్టుబడులు: మంత్రి నారా లోకేశ్



అమరావతి: సింగపూర్ పర్యటన విజయవంతమైందని, ఐదేళ్లలో రూ.45 వేల కోట్ల పెట్టుబడులకు ఒప్పందాలు కుదిరాయని మంత్రి నారా లోకేశ్ తెలిపారు. గురువారం సచివాలయంలో మీడియాతో మంత్రి మాట్లాడారు. తాము ఎంవోయూలు చేయట్లేదని, నేరుగా కార్యరూపంలోకి తెస్తున్నామని చెప్పారు. పెట్టుబడులు పెట్టాలని జూమ్‌కాల్ ద్వారా ఆర్సెల్లార్ మిత్తల్‌ను ఆహ్వానించినట్లు తెలిపారు. దేశంలోనే అతిపెద్ద స్టీల్‌ప్లాంట్, డేటా సెంటర్‌లు ఏపీలో ఏర్పాటు కాబోతున్నట్లు వెల్లడించారు. "2019-24 మధ్య ఏపీ బ్రాండ్‌ను జగన్ నాశనం చేశారు. అమరావతిని సంయుక్తంగా అభివృద్ధి చేద్దామని సింగపూర్ కోరింది. ఆ దేశ ప్రభుత్వం చెప్పే మాటలు వినకుండా గత ప్రభుత్వం ఒప్పందాలను రద్దు చేసింది. పారదర్శకతలో సింగపూర్ అగ్రస్థానంలో ఉంటుంది. అలాంటి దేశంపై అవినీతి ముద్ర వేశారు. అమర్‌రాజా, లులు సహా పలు కంపెనీలను జగన్ తరిమేశారు. కానీ, కర్ణాటకకు బెంగళూరు, తమిళనాడుకు చెన్నై, ఏపీకి చంద్రబాబు ఉన్నారు. ఐటీ పటంలో విశాఖను పెట్టాలని నిర్ణయించుకున్నాం.

**హెరిటేజ్‌కు కూడా ఇవ్వలేదు.. టీసీఎస్‌కు ఇచ్చాం..** ఏ రాష్ట్రం ఇవ్వని విధంగా టీసీఎస్‌కు ఎకరా రూ.99పైసలకే భూమి కేటాయించాం. దీనిపై వైకాపా నేతలు కోర్టుకెళ్లారు. తక్కువ ధరకు భూముల్ని మేం హెరిటేజ్‌కు కూడా ఇవ్వలేదు.. టీసీఎస్‌కు ఇచ్చాం. ఉద్యోగాలు వస్తాయని రూ.99పైసలకే భూములు ఇస్తున్నాం. అందులో తప్పేంటి?వైకాపా తెచ్చిన పెట్టుబడులకంటే మా ప్రభుత్వం 14 నెలల్లో తెచ్చిన పెట్టుబడులే ఎక్కువ.

**పెట్టుబడులు రాకుండా ఈ-మెయిల్ పంపించారు...** ఏపీకి పెట్టుబడులు రాకుండా సింగపూర్ అధికారులకు మురళీ కృష్ణ అనే వ్యక్తి ఈ-మెయిల్ పంపించారు. రేపోమాపో ఏపీలో ప్రభుత్వం మారిపోతుందని అందులో పేర్కొన్నారు. మురళీకృష్ణకు వైకాపా నేతలతో సంబంధాలున్నాయి. పెట్టుబడుల కోసం తమిళనాడులో డీఎంకే, ఏఐడీఎంకే కలిసికట్టుగా పనిచేస్తాయి. ఏపీలో మాత్రం పెట్టుబడులు రాకుండా కంపెనీలకు వైకాపా లేఖ రాస్తుంది. ఇలా లేఖలు పంపితే పెట్టుబడులు పెట్టడానికి ఎవరు ముందుకొస్తారు?ఇలా చేస్తే నష్టపోయేది తెలుగువారే"అని మంత్రి లోకేశ్ అన్నారు.

# శ్రీవారి ఆలయం ముందు రీల్స్ చేస్తే కఠిన చర్యలు.. తితిదే హెచ్చరిక

తిరుమల: తిరుమల శ్రీవారి ఆలయం ముందు, మాడ వీధుల్లో కొంతమంది వెకిలి చేష్టలు, డ్యాన్స్‌లతో సోషల్ మీడియా రీల్స్ చేస్తుండటంపై తిరుమల తిరుపతి దేవస్థానం (తితిదే) ఆగ్రహం వ్యక్తం చేసింది. ఇలాంటి వీడియోలు చిత్రీకరించేవారిని తితిదే విజిలెన్స్ సిబ్బంది గుర్తించి కఠిన చర్యలు తీసుకుంటారని హెచ్చరించింది. భక్తుల మనోభావాలను దెబ్బతీసే ఈ తరహా చర్యలు ఆధ్యాత్మిక వాతావరణానికి విఘాతం కలిగిస్తున్నాయని తితిదే పేర్కొంది. పవిత్రమైన క్షేత్రంలో ఇలాంటి అభ్యంతరకర, అసభ్యకర చర్యలు అనుచితమని.. ఇక్కడ కేవలం ఆధ్యాత్మిక కార్యక్రమాలకే పరిమితం కావాలని సూచించింది. తిరుమల క్షేత్రం భక్తి, ఆరాధనలకు నిలయమనే విషయాన్ని ప్రతి ఒక్కరూ గుర్తుంచుకోవాలని పేర్కొంది. శ్రీవారి దర్శనార్థం వచ్చే లక్షలాది మంది భక్తుల మనోభావాల పట్ల గౌరవం చూపడం ప్రతి ఒక్కరి బాధ్యత అని.. క్షేత్ర పవిత్రతకు భంగం కలిగేలా వ్యవహరించే వ్యక్తులపై కేసులు నమోదు చేసి చట్టపరమైన చర్యలు చేపడతామని తితిదే తెలిపింది.

# చేసిన తప్పులకు పశ్చాత్తాపం లేని జగన్‌ను ప్రజలు ఎప్పటికీ క్షమించరు: మంత్రి నిమ్మల




పాలకొల్లు: జగన్ ఐదేళ్ల పాలనలో సీఎంఆర్ఎఫ్ నిధులను పక్కదోవ పట్టించారని మంత్రి నిమ్మల రామానాయుడు విమర్శించారు. పేదలకు వైద్య సాయం అందించకుండా మానవత్వం మరిచారని మండిపడ్డారు.

పశ్చిమ గోదావరి జిల్లా పాలకొల్లు నియోజకవర్గంలో గురువారం మంత్రి నిమ్మల సీఎంఆర్ఎఫ్ చెక్కులు పంపిణీ చేశారు. 82 మందికి రూ.61 లక్షల విలువైన చెక్కులను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాష్ట్రంలో ఇంకా మిగిలిపోయిన వనరులను దోచుకోవడానికే జగన్ ఆరాట పడుతున్నారని దుయ్యబట్టారు. చేసిన తప్పులకు పశ్చాత్తాపం లేని ఆయన్ను ప్రజలు ఎప్పటికీ క్షమించరని మండిపడ్డారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితి ఇబ్బందికరంగా ఉన్నా, చంద్రబాబు మానవత్వంతో సీఎం సహాయనిధిని పునరుద్ధరించారని గుర్తుచేశారు. జగన్ హయాంలో ఆస్పత్రుల యాజమాన్యాలకు చెల్లించాల్సిన నిధులను సైతం కూటమి ప్రభుత్వమే చెల్లించిందన్నారు. గత ప్రభుత్వ పాలనలో రాష్ట్ర విధ్వంసంతో పాటు ఆర్థిక వ్యవస్థను చిన్నాభిన్నం చేశారని విమర్శించారు.

## ప్లాస్టిక్ కవర్లు వద్దు.. కాటన్ సంచులు హద్దు....


బాపట్ల:వినుకొండ వార్త:పట్టణ పుర ప్రజలు ప్లాస్టిక్ కవర్ల నిర్మూలనకు సహకరించాలని మున్సిపల్ కమిషనర్ రఘునాథ్ రెడ్డి అన్నారు. పట్టణంలో ప్లాస్టిక్ కవర్ల వాడకాన్ని బ్యాన్ చేస్తూ ప్లాస్టిక్ కవర్ల వాడకం వద్దు అంటూ షాపుల వద్ద కరపత్రాలను మున్సిపల్ కమిషనర్ ఆధ్వర్యంలో సానిటరీ ఇన్స్పెక్టర్ కరుణా నేతృత్వంలో షాపులకు అంటిస్తున్నారు. ఈ సందర్భంగా మున్సిపల్ కమిషనర్ రఘునాథ్ రెడ్డి మాట్లాడుతూ ప్లాస్టిక్ కవర్లు వాడకం ఇవాళ రోజున



ప్రజలకు బాగానే ఉన్నా భవిష్యత్తు తరాలకు తీరని అన్యాయం చేస్తున్నానన్నారు. కవర్ల వాడకం వలన జరుగుతున్న అనర్ధాలను సచివాలయ సిబ్బంది ద్వారా అన్ని వార్డులలో ప్రజలకు అవగాహన కల్పిస్తున్నామన్నారు. ప్రతి ఒక్కరూ ప్లాస్టిక్ కవర్ల వినియోగాన్ని తగ్గించి కాటన్ సంచులను ,గోను సంచులను వాడాలని ఆయన ప్రజలకు విజ్ఞప్తి చేశారు.


## ప్లాస్టిక్ కవర్లు వద్దు.. కాటన్ సంచులు హద్దు....

బాపట్ల:వినుకొండ వార్త:పట్టణ పుర ప్రజలు ప్లాస్టిక్ కవర్ల నిర్మూలనకు సహకరించాలని మున్సిపల్ కమిషనర్ రఘునాథ్ రెడ్డి అన్నారు. పట్టణంలో ప్లాస్టిక్ కవర్ల వాడకాన్ని బ్యాన్ చేస్తూ ప్లాస్టిక్ కవర్ల వాడకం వద్దు అంటూ షాపుల వద్ద కరపత్రాలను మున్సిపల్ కమిషనర్ ఆధ్వర్యంలో సానిటరీ ఇన్స్పెక్టర్ కరుణా నేతృత్వంలో షాపులకు అంటిస్తున్నారు.

SUPERINTENDENT OF POLICE
BAPATLA POLICE
BAPATLA DISTRICT, AP
CERTIFICATE OF APPRECIATION
Awarded to A. Chandrashekar, SI-3449
Working in Chirala Rural P.S
For Good work done in using drone & save the lifes in beach areas
His/Her meritorious service rendered is
Highly Appreciable
Date 28/7/2025
TUSHAR DUDI, IPS.,
SUPERINTENDENT OF POLICE


ఈ సందర్భంగా మున్సిపల్ కమిషనర్ రఘునాథ్ రెడ్డి మాట్లాడుతూ ప్లాస్టిక్ కవర్లు వాడకం ఇవాళ రోజున ప్రజలకు బాగానే ఉన్నా భవిష్యత్తు తరాలకు తీరని అన్యాయం చేస్తున్నానన్నారు. కవర్ల వాడకం వలన జరుగుతున్న అనర్ధాలను సచివాలయ సిబ్బంది ద్వారా అన్ని వార్డులలో ప్రజలకు అవగాహన కల్పిస్తున్నామన్నారు. ప్రతి ఒక్కరూ ప్లాస్టిక్ కవర్ల వినియోగాన్ని తగ్గించి కాటన్ సంచులను ,గోను సంచులను వాడాలని ఆయన ప్రజలకు విజ్ఞప్తి చేశారు.




చీరాల :వినుకొండ వార్త : బ్యాంకు సిబ్బంది మరియు పోలీస్ అధికారుల సమన్వయంతో పనిచేస్తే సైబర్ నేరాలను నియంత్రించవచ్చని చీరాల %DSP,MD% మోయిన్ అన్నారు. చీరాలలో బ్యాంక్ మేనేజర్లతో సైబర్ నేరల గురించి పోలీస్ శాఖ ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు . ఈసందర్భంగా వివిధ బ్యాంకుల్లో పని చేస్తున్న బ్యాంకు మేనేజర్లతో బ్యాంకుల వద్ద భద్రతా ప్రమాణాలు,సిసి కెమెరాల ఏర్పాటు,ఆర్థిక,సైబర్ నేరాలు,తదితర అంశాల పై చీరాల %DSP ,MD% మోయిన్ సమీక్షించారు. మరీముఖ్యంగా ఇటీవల కాలంలో చోరీల కన్నా సైబర్ మోసాల ద్వారా ప్రజలు ఎక్కువ మొత్తంలో నగదు పోగొట్టుకుంటున్నారన్నారు. రాబోయే రోజుల్లో ఈ సంఖ్య ఇంకా పెరిగే అవకాశం ఉందని, ఈనేరాలను తగ్గుముఖం పట్టేలా, నగదు పోగొట్టుకున్న భాదితులకు న్యాయం చేసే దిశగా బ్యాంకు అధికారులు, పోలీసులు సమన్వయంతో పనిచేయాల్సిన అవసరం,ఆవశ్యకత ఎంతేన ఉందన్నారు. ఈ సమావేశంలో చీరాల డివిజన్ పోలీస్ అధికారులు అన్ని బ్యాంకు సంస్థల మేనేజర్లు పాల్గొన్నారు.

## నేడు నూతన లబ్ధిదారులకు పించన్ల పంపిణీ

భట్టిప్రోలు వినుకొండ వార్త: అర్హులైన వారందరికీ సంక్షేమ ఫలాలు అందించడమే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం పని చేస్తుందని తెలుగుదేశం పార్టీ రాష్ట్ర కార్యదర్శి తూనుగుంట్ల సాయిబాబా పేర్కొన్నారు. గురువారం ఆయన మీడియాతో మాట్లాడుతూ అర్హత కలిగి ఉన్న వితంతు లబ్ధిదారులకు పెన్షన్లను మంజూరు చేయడం జరిగిందన్నారు. ఈ పెన్షన్లను ఆగస్టు 1వ తేదీ శుక్రవారం భట్టిప్రోలు రథం



సెంటర్లోని తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో వేమూరు నియోజకవర్గ శాసనసభ్యులు మాజీ మంత్రి నక్కా ఆనందబాబు అందజేస్తారని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో లబ్ధిదారులు తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొని జయప్రదం చేయాలని ఆయన కోరారు.

## కాళిదాసు జీవితం స్ఫూర్తిదాయకం...

బాపట్ల:వినుకొండ వార్త:మాధవపెద్ది కాళిదాసు త్యాగనిరతి,సేవాతత్పరత నేటి తరానికి ఆదర్శప్రాయమని వ్యవసాయ కళాశాల ఇన్చార్జి ఏడి డాక్టర్ ఎస్ ఆర్ కోటేశ్వరరావు అన్నారు. గురువారం ఫోరం ఫర్ బెటర్ బాపట్ల ఆధ్వర్యంలో గవర్నమెంట్ హాస్పటల్ రోడ్డులో ఏర్పాటు చేయబడిన కాళిదాసు విగ్రహాన్ని ఏడి ఆవిష్కరించారు. కాళిదాసు నీతి, నిజాయితీ, నిస్వార్ధపరత్వం మనందరికీ స్ఫూర్తినిస్తాయని ఆయన వివరించారు. అటువంటి వ్యక్తులు నేటి సమాజంలో అరుదుగా కనిపిస్తున్నారని ఆయన పేర్కొన్నారు.కార్యక్రమంలో విశిష్ట అతిథిగా పాల్గొన్న ఏరియా ప్రభుత్వ వైద్యశాల సూపరింటెండెంట్ డాక్టర్ కే



సిద్ధార్థ మాట్లాడుతూ కాళిదాసు విలువలకు ప్రతిరూపంగా నిలిచారని కొనియాడారు. ఆయన బాపట్ల సర్వతోముఖాభివృద్ధికి పాటు పడ్డారని ప్రశంసించారు.వారి రుణం మనం తీర్చుకోలేనిది అని తెలిపారు. రైల్వే స్టేషన్ సూపరింటెండెంట్ ఎస్ ఆర్ మీనా మాట్లాడుతూ బాపట్ల రైల్వే స్టేషన్ ఏర్పాటు లో కాళిదాసు కృషి చారిత్రాత్మకమైనదని చెప్పారు. కార్యక్రమంలో కాళిదాసు కోడలు మాధవ పెద్ది నిర్మల, కాళిదాసు మనుమడు కాళిదాససాయి, ఫోరం ఫర్ బెటర్ బాపట్ల కార్యదర్శి డాక్టర్ పిసి సాయిబాబు , ప్రముఖ న్యాయవాది విన్నకోట సత్యప్రసాద్, విశ్రాంత అధ్యాపకులు శ్రీనివాస శర్మ, విజయకుమార్, చిత్రకారుడు జీ వి, సాహితీ భారతి అధ్యక్షుడు నరసింహ వర్మ, రచయిత మల్లికార్జున, బందా బాబు,మానం అప్పారావు, కరణం రవీంద్ర, పొగడదండ హరిబాబు, మల్లికార్జున రావు,బండికళ్ల బాబురావు పాల్గొన్నారు.

## కుక్కల బెడదలో ఇబ్బంది పడుతున్న చీరాల పట్టణ ప్రజలు



చీరాల : వినుకొండ వార్త: చీరాల పట్టణం మున్సిపాలిటీ పరిధిలో కుక్కల బెడద అధికంగా ఉందని,అధికారులు చర్యలు చేపట్టాలని డిమేండ్ చేస్తూ చీరాల మున్సిపల్ కార్యాలయం వద్ద దళిత బహుజన పార్టీ నేతలు నిరసన ప్రదర్శన చేశారు. అనంతరం అధికారులకు సమస్యలతో కుడిన వినతిపత్రాన్ని అందజేశారు. అధికారులు వెంబటే స్పందించి కుక్కల బెడద సమస్యలను పరిష్కరిస్తామని అన్నారు.

## చీరాల కటారివారిపాలెం గ్రామంలో సీతారాముల గుడి ఉన్న పునర్నిర్మాణం కోసం భూమి పూజ లో పాల్గొన్న చీరాల టిడిపి అధికార ప్రతినిధి మద్దులూరి మహేంద్రనాథ్ చీరాల

వినుకొండ వార్త : కటారివారిపాలెం గ్రామం నందు సీతారాముల గుడి పునర్నిర్మాణ భూమి పూజ కార్యక్రమంలో పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించిన చీరాల ఎమ్మెల్యే మద్దులూరి మాలకొండయ్య తనయుడు, చీరాల తెలుగుదేశం పార్టీ అధికార ప్రతినిధి మద్దులూరి మహేంద్రనాథ్. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శ్రీ సీతారాము ల వారి గుడి పున నిర్మాణంలో నేను పాల్గొనడం, భూమి పూజ చేయడం, నా అదృష్టంగా భావిస్తున్నాను అని అన్నారు. అంతేకాక ఆ సీతారాముల ఆశీస్సులు కటారి వారి పాలానికి మరియు చీరాల నియోజకవర్గ



ప్రజలకు ఎల్లవేళలా తోడు ఉండాలని, మరియు చీరాల నియోజకవర్గం అభివృద్ధికి శ్రీ సీతారాముల వారి ఆశీస్సులు ఉండాలని కోరుకుంటు న్నాను అన్నారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ ముఖ్య నాయకులు, ఏఎంసీ చైర్మన్ కౌతవరపు జనార్ధన్, ఏఎంసీ డైరెక్టర్లు పోలీస్ సిబ్బంది, అధికారులు,మరియు కూటమి నాయకులు, నియోజకవర్గ కూటమి కార్యకర్తలు పాల్గొన్నారు.

## పీజీఆర్ఎస్ లో ప్రతి అర్జీకి పరిష్కారం కావాలి : కలెక్టర్....

### –అర్జీదారుల సమస్యలపై నిర్లక్ష్యం చేస్తే చర్యలు తప్పవు....



బాపట్ల: వినుకొండ వార్త:జిల్లా కలెక్టర్ జె. వెంకట మురళీ గురువారం కలెక్టరేట్‌లో ఆకస్మిక తనిఖీ చేపట్టారు. ఉదయం కార్యాలయానికి వచ్చిన ఆయన, అనూహ్యంగా ప్రజా సమస్యల పరిష్కార విభాగం (పీజీఆర్ఎస్) సెల్‌లోకి వెళ్లి అధికారుల పనితీరును తనిఖీ చేశారు. కంప్యూటర్ వద్ద కూర్చొని పలు ఫిర్యాదులను స్వయంగా పరిశీలించారు. అనంతరం ఫిర్యాదుదారులకు స్వయంగా ఫోన్ చేసి, “అమ్మా, నేను మీ కలెక్టర్ మాట్లాడుతున్నా.. మీరు ఇచ్చిన ఫిర్యాదు పరిష్కారం అయ్యిందా?” అంటూ వారి సమస్యలపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, పీజీఆర్ఎస్ లో వచ్చే ప్రతి ఫిర్యాదును వెంటనే పరిష్కరించాలి, అధికారుల పనితీరులో నిర్లక్ష్యం ఉంటే చర్యలు తప్పవని హెచ్చరించారు. రెవెన్యూ, పోలీస్, పంచాయతీరాజ్, మున్సిపల్ శాఖలపై వచ్చిన ఫిర్యాదులపై ప్రత్యేకంగా దృష్టి సారించిన ఆయన, ప్రజల విశ్వాసాన్ని నిలబెట్టుకోవాలంటే పీజీఆర్ఎస్ సమర్థంగా, పారదర్శకంగా పనిచేయాలన్నారు.

# బాపట్ల జిల్లా వార్తలు

## నేడు నూతన అండర్ టన్నెల్ కమ్ బ్రిడ్జి ప్రారంభం

### పాల్గొననున్న పలువురు ప్రజాప్రతినిధులు, మంత్రులు





భట్టిప్రోలు వినుకొండ వార్త: భట్టిప్రోలు మండల పరిధిలోని వెల్లటూరు ఛానల్–భట్టిప్రోలు మెయిన్ డ్రైయిన్ పై గత సంవత్సరం నవంబర్ మాసంలో కూలిపోయిన చప్టాను( అండర్ టన్నెల్ కమ్ బ్రిడ్జి)ను నూతనంగా రూ 10.75 కోట్ల రూపాయల వ్యయంతో నిర్మించిన నూతన అండర్ టన్నెల్ కమ్ బ్రిడ్జిను శుక్రవారం ప్రారంభిస్తారని తెలుగుదేశం పార్టీ రాష్ట్ర కార్యదర్శి తూనుగుంట్ల సాయిబాబా తెలిపారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర రెవెన్యూ, రిజిస్ట్రేషన్, స్టాంపుల శాఖ మంత్రి అనగాని సత్య ప్రసాద్, బాపట్ల పార్లమెంటు సభ్యులు తెన్నేటి కృష్ణ ప్రసాద్, వేమూరు శాసనసభ్యులు నక్కా ఆనందబాబు పాల్గొంటారని తెలిపారు. ఖరీఫ్ సీజన్ నాటికి పూర్తి స్థాయిలో పూర్తి చేసి రైతులకు సకాలంలో నీరందించేందుకు త్వరితగతిన ఈ నిర్మాణాన్ని పూర్తి చేయడం జరిగిందన్నారు. ఈ చప్టా వలన 36 వేల ఎకరాల ఆయకట్టు భూములకు నీరు అందించవచ్చని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో కూడా తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొనాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

## రైతుల కోసం వరికూటి జల దీక్ష

### రైతు ప్రయోజనాల కోసం ఉద్యమానికి సిద్ధం - అశోక్ బాబు



భట్టిప్రోలు వినుకొండ వార్త: రైతులకు అండగా ఉంటాం, రైతు రాజా స్థాపన లక్ష్యంగా సాగుతాం అంటూ ప్రగల్భాలు పలికిన కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన పిమ్మట రైతుల సమస్యలను పట్టించుకోవడంలో నిర్లక్ష్యం వహిస్తుందని వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ వేమూరు నియోజకవర్గ సమన్వయకర్త వరికూటి అశోక్ బాబు ఆరోపించారు. గురువారం ఆయన రైతుల కోసం జలదీక్ష అంటూ భట్టిప్రోలు మండలంలోని భట్టిప్రోలు గ్రామ జగనన్న కాలనీ వద్ద ఉన్న గంగోలు మెయిన్ డ్రైయిన్ ను పరిశీలించారు. కాల్వ పూర్తిగా తూటికాడతో నిండిపోయి ఉండడాన్ని ఆయన గమనించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం మరియు ప్రభుత్వ అధికారులు రైతుల సమస్యలను పరిష్కరించడంలో పూర్తిగా విఫలమ య్యారని అంతేకాకుండా నిర్లక్ష్య ధోరణి ప్రదర్శిస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. సత్వరమే ఈ కాలువలో తూటికాడ తొలగించి రైతులకు డ్రైయిస్ ను మురుగునీటి సమస్యను పరిష్కరించాలని ఆయన డిమాండ్ చేశారు. సమస్యను పరిష్కరించే వరకు రైతుల పక్షాన నిలబడి ఆందోళన చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో భట్టిప్రోలు మండలంలోని పలువురు వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, రైతులు పాల్గొన్నారు.

## అన్నదాత సుఖీభవ కార్యక్రమం పై అన్ని జిల్లాల కలెక్టర్లు తో వీక్షణ సమావేశం ద్వారా మాట్లాడుతున్న రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, బాపట్ల జిల్లా నుండి వీక్షణ ద్వారా పాల్గొన్న జిల్లా కలెక్టర్ జె వెంకట మురళి....





బాపట్ల:వినుకొండ వార్త: రైతులకు లాభసాటి వ్యవసాయం, వారి జీవన ప్రమాణాలు పెరిగేలా గిట్టుబాటు ధరలు కల్పించడమే ప్రభుత్వ లక్ష్యమని రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు తెలిపారు. అన్నదాత సుఖీభవ పథకం అమలు తీరుపై అన్ని జిల్లాల కలెక్టర్లతో అమరావతి నుంచి గురువారం ఆయన వీక్షణ సమావేశం నిర్వహించారు. జిల్లా నుంచి జిల్లా కలెక్టర్ జె వెంకట మురళి హాజరయ్యారు. అన్నదాత సుఖీభవ పథకం కింద రైతులకు నగదు పంపిణీ చేయనున్న కార్యక్రమాన్ని వేడుకగా జరపాలని రాష్ట్ర ముఖ్యమంత్రి చెప్పారు. ప్రజల విశ్వాసానికి తగినట్టుగా రాష్ట్ర ప్రభుత్వం పనిచేస్తుందన్నారు. సుపరిపాలన అందించడమే లక్ష్యమన్నారు. అన్నదాత సుఖీభవ ద్వారా రైతులకు కలిగే ప్రయోజనంపై గ్రామాలలో అవగాహన కల్పించాలన్నారు. ఆగస్టు రెండో తేదీన అన్నదాత సుఖీభవ కింద రైతులకు నగదు పంపిణీ కార్యక్రమం జరుగుతుందన్నారు. రైతులను చైతన్య పరచడం ద్వారానే రైతులకు మరింత మేలు జరుగుతుందన్నారు. ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను వివరిస్తూ కరపత్రాలు పంపిణీ చేయాలన్నారు. ఆధునాతన సాంకేతిక పరిజ్ఞానాన్ని అన్నింటిలోకి తెస్తున్నామన్నారు. భవిష్యత్తులో ప్రజలకు బాధ్యతగా సేవలందించేలా వాట్సాప్ గవర్నెన్స్ వస్తుందన్నారు. అధికారులు జవాబుదారీతనంతో పనిచేయాలని సూచించారు. లోపాలు సవరించడానికే ఆర్ టి జి ఎస్ ,(రియల్ టైం గవర్నెన్స్ సిస్టం)ను ప్రవేశపెట్టామని, పక్కాగా అమలయ్యేలా చర్యలు తీసుకోవాలన్నారు. తాగు, సాగునీటి చెరువులన్నింటిని సమృద్ధిగా జలాలతో నింపాలన్నారు. వాటిపై నిర్వహణ, పర్యవేక్షణ ఉంటే సుస్థిర వ్యవసాయం అభివృద్ధి చెందుతుందని రాష్ట్ర ముఖ్యమంత్రి చెప్పారు. ఆ దిశగా అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. ప్రభుత్వం తీసుకుంటున్న నిర్ణయాలు, సంక్షేమ కార్యక్రమాలతో వ్యవసాయ రంగంలో జిడిపి పెరుగుతుందని, ఈ విషయాలపై రైతులకు మరింతగా అవగాహన కల్పించాలన్నారు. అన్నదాత సుఖీభవ పథకం లబ్ధిదారుల జాబితా ఆర్ ఎస్ కె లు, సచివాలయాల వద్ద అందుబాటులో ఉంచాలన్నారు. రైతుల సందేహాలన్ని నివృత్తి చేసేలా అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. ఈ సమావేశంలో ఇంచార్జి సంయుక్త కలెక్టర్, డి ఆర్ ఓ జి.గంగాధర్ గౌడ్, ఆర్డీవో పి గ్లోరియ, సిపిఓ షాలెంరాజు, వ్యవసాయ, ఉద్యాన వనశాఖ అధికారులు, అనుబంధ శాఖల అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## పారిశుధ్యం పై నిర్లక్ష్యం వహిస్తే సహించేది లేదు





నగరం, వి ఎన్ కే వార్త : పారిశుద్ధ్య పనులపై నిర్లక్ష్యం వహిస్తే సహించేది లేదని ఎంపీడీవో బొర్రా శ్రీనివాసరావు అన్నారు. నగరం మండలంలో అన్ని పంచాయతీలలో పారిశుధ్య పనుల పట్ల ఎంపీడీవో శ్రీనివాస్ ఆకస్మిక తనిఖీలు నిర్వహిస్తున్నారు. ఉదయం 8 గంటలకే కొన్ని పంచాయతీలను విసిట్ చేస్తూ ఎవరైతే నిర్లక్ష్యం వహిస్తున్నారో వారిపై నిఘా ఉంచుతూ చర్యలు తీసుకుంటున్నారు. గురువారం ఉదయం 8 గంటలకే నగరం సెంటర్లో పారిశుధ్య పనులను తనిఖీ చేశారు.

పంచాయతీ సిబ్బందికి సూచన లిస్టు నాకు ఎవరివద్దనైనా ఫిర్యాదు అందితే చర్యలు తప్పవని హెచ్చరిస్తున్నారు. గతంలో కుప్పలు తెప్పలుగా పేరుకుపోయిన చెత్తను ఇటీవల పూర్తిగా శుభ్రం చేయించారు. జిల్లా కలెక్టర్ ఆదేశాల ప్రకారం నడుచుకుంటూ ఎక్కడా చెత్త పేరుకు పోకుండా ఫోకస్ పెట్టారు. అలాగే ప్రజల్లో కూడా అవగాహన కల్పిస్తూ చెత్తను రోడ్లమీద వేయకుండా పంచాయతీ బండి లోనే వేయాలని సూచిస్తున్నారు. మండల ప్రజలు ఎంపీడీవో పనితీరు పట్ల హర్షం వ్యక్తం చేస్తున్నారు.

## పదవీ విరమణ చేసిన ప్రధానోపాధ్యాయునికి సత్కారం

భట్టిప్రోలు వినుకొండ వార్త: ఉపాధ్యాయునిగా, ప్రధానోపాధ్యాయునిగా మోర్ల జనార్దన్ రావు ఎనిమిది సంవత్సరాల సేవలు మరపురానివి అని భట్టిప్రోలు మండల పరిషత్ అధ్యక్షురాలు దావూరి వెంకట లలిత కుమారి నాగమల్లేశ్వరరావు పేర్కొన్నారు. పెదపులివర్రు గ్రామ శివారు జిలుగు వారి పాలెం మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో 8 సంవత్సరాలుగా విద్యార్థుల గ్రామస్తుల ఆదరాభిమానాలతో ఉద్యోగ బాధ్యతలు నిర్వర్తించిన జనార్దన్ రావు జులై 31 గురువారం పదవి విరమణ గావించారు. ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన సన్మాన కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా లలిత కుమారి హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో ఆమెతో పాటు మండల విద్యాశాఖ అధికారులు పులి లాజర్, నీలం దేవరాజు హాజరై ఆయనను సత్కరించారు. ఈ సందర్భంగా పలువురు జనార్దనరావు ను శాలువలు పూల బొకేలతో అభినందనలు తెలియజేశారు. సభలో ఎంపీపీ మాట్లాడుతూ జనార్దనరావు ఉపాధ్యాయ వృత్తికి



వన్నె తెచ్చిన వ్యక్తి అని కొనియాడారు. ఆయన గ్రామ ప్రజలతోనూ విద్యార్థులతోనూ మమేకమై అత్యున్నత విద్యను అందించారని ఆమె ప్రశంసించారు. ఈ కార్యక్రమంలో గ్రామ ప్రముఖులు, విద్యా కమిటీ చైర్మన్, కమిటీ సభ్యులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## గంబుషియా చేపలు విడుదల ఆరోగ్య విస్తరణ అధికారి శిఖా శాంసన్



క్రోసూరు ( వి. ఎ న్. కే. వార్త )గంభుషియా అను చిన్న చిన్న చేపలు నీటి స్థావరంలో వదిలినట్లయితే దోమలు పుట్టవని, దోమలను ఈ చేపలు తిని బ్రతుకుతాయని తద్వారా దోమల ఉత్పత్తిని తగ్గించవచ్చునని ఆరోగ్య విస్తరణ అధికారి శిఖా శాంసన్ గురువారం తెలిపారు పల్నాడు జిల్లా కోసూరు మండలం లోని పీసపాడ్, ఎర్రబాలెం, అనంతవరం, క్రోసూరు, విప్పర్ల తదితర గ్రామాల్లో వాడుకు లో లేని బావుల్లో గంబుషా చేపలు ను చేసినట్టు ఆయన తెలిపారు జాతీయ కీటక జనిత నియంత్రణ కార్యక్రమంలో భాగంగా ఈ కార్యక్రమం ను చేపట్టినట్లు ఆయన పేర్కొన్నారు ఈ కార్యక్రమంలో మగ ఆరోగ్య కార్యకర్తలు ప్రహ్లాద్, ప్రేమ రాజ్, ఆశా కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు

## గ్రామాలలో మలేరియా నివారణ చర్యలు...

యడ్లపాడు ( వి.ఎన్. కె. వార్త) :మలేరియా వ్యాధి నివారణలో భాగంగా మండలంలోని యడ్లపాడు, మైదవోలు, జగ్గాపురం బావులు మరియు చెరువులలో గంబూసియా చేపల పిల్లలను వదిలే కార్యక్రమం ఆరోగ్య శాఖ ద్వారా గురువారం నిర్వహించబడింది. దోమల లార్వాలను తినే లక్షణం కలిగిన ఈ చేపలు దోమల పెరుగుదలను నియంత్రించడంలో ముఖ్య పాత్ర పోషిస్తాయని ఆరోగ్య శాఖ అధికారులు



తెలిపారు. ఈ చేపలు నీటిలో పెరిగే దోమల లార్వాను తినడం ద్వారా మలేరియా, డెంగ్యూ వంటి వ్యాధుల వ్యాప్తిని తగ్గించడంలో సహాయపడతాయి. ఈ కార్యక్రమంలో డాక్టర్ పి. భరద్వాజ, వైద్యాధికారి పున్నారావు, మండల సామాజిక ఆరోగ్య అధికారి రాజశేఖర్, ఆరోగ్య పర్యవేక్షకులు మరియు రిజ్వాన్ బాషా, ఆరోగ్య కార్యకర్త లు నిర్వహించారు. ఆయా గ్రామాల ప్రజలు కార్యక్రమాన్ని అభినందించారు. ఇటువంటి చర్యలు ప్రజల ఆరోగ్యాన్ని కాపాడటంలో సహాయకరమవుతాయని వారు అభిప్రాయపడ్డారు.

## అడ్డేదెవరు.. ఆపేదెవరు!

అనకాపల్లి : జిల్లాలో అక్రమ మైనింగ్‌కు హద్దు, అదుపూ లేకుండా పోతోంది. సహజ వనరులు ఎక్కడ కనిపించినా.. వాటిని పిప్పి చేసేంతవరకు అక్రమార్కులు వదలడం లేదు. అధికారులు అడ్డుకున్నా.. లెక్కచేయడం లేదు. ముఖ్యంగా సాగుకు ఆధారమైన చెరువుల రూపురేఖలు మార్చేస్తున్నారు. దీంతో వాటిపై ఆధారపడి జీవిస్తున్న అన్నదాతలు ఇబ్బందులు పడుతున్నారు. అక్రమార్కులు బరితెగిస్తున్నా.. అధికారులు మాత్రం కొరడా ఝుళిపించడం లేదు. ఫిర్యాదులొచ్చినా తూతూమంత్రం చర్యలతోనే సరి పెడుతున్నారు.

రోలుగుంట మండలం రాజన్నపేట గ్రామంలో సర్వే నెంబర్ 57–2లో భూపతి చెరువు ఉంది. దీనికింద 40 ఎకరాలకు పైగా ఆయకట్టు ఉంది. చెరువు ఆధారంగా కొన్ని సంవత్సరాల నుంచి రైతులు సాగు చేసుకుంటున్నారు. ఈ చెరువు గర్భాన్ని చదును చేసి రోడ్డుగా మార్చేశారు ఓ మైనింగ్ నిర్వాహకుడు. కొండలను పేల్చి బండరాళ్లను ఈ దారిమీదుగా తరలించేందుకు సిద్ధం చేసుకున్నారు. దీనిపై కొన్ని రోజుల క్రితం స్థానికులు జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. కలెక్టర్ ఆదేశాల మేరకు అధికారులు స్పందించి దీనిపై విచారణ చేపట్టారు. జలవనరులు, రెవెన్యూ అధికారులు రెండేసిసార్లు నిర్వాహకులకు నోటీసులిచ్చారు. ఇటీవల దారికి అడ్డంగా పొక్లెయిన్ గండ్లు తీసి..



రవాణాకు వీలులేకుండా చేశారు. అయినా అక్రమార్కులు దానిని ఏమాత్రం లెక్కచేయలేదు. చక్కగా గండ్లుపూడ్చేసి.. మళ్లీ రోడ్డు వేసి దర్జాగా మైనింగ్ సాగిస్తున్నారు.

**చెరువుల చిక్కిపోతున్నాయి..** జిల్లాలో సుమారు 2,890 వరకు చెరువులు, సాగునీటి వనరులు ఉన్నట్లు అధికారులు చెబుతున్నారు. వీటిపై ఆధారపడి 2.5లక్షల ఎకరాల్లో పంటలు పండిస్తున్నారు. గత ప్రభుత్వ కాలం నుంచి సాగునీటి వనరులు క్రమంగా ఆక్రమణలకు గురవుతున్నాయి. పాయకరావుపేట మండలం పెదరామభద్రపురంలో ఎనిమిదెకరాల్లో లేఅవుట్ వేస్తున్నారు. దీనికి ఆనుకుని ఉన్న పంటకాలువలను కలిపేసుకున్నారు. రావికమతం మండలం మేడివాడలో ఓ స్థిరాస్తి వ్యాపార సంస్థ వేసిన లేఅవుట్‌లో భారీగా ప్రభుత్వ భూములు, గెడ్డలు ఆక్రమించుకున్నట్లు ఫిర్యాదులొచ్చాయి. కానీ అధికారులు వాటిని పట్టించుకోలేదు.

**పరిశీలించి చర్యలు తీసుకుంటాం...**– వి.వి.రమణ, ఆర్డీవో, నర్సీపట్నం

రాజన్నపేట చెవులో అక్రమంగా వేసిన రోడ్డును అడ్డుకున్నాం. మళ్లీ రోడ్డు వేస్తున్నట్లు మా దృష్టికి రాలేదు. పరిశీలిస్తాం.. అతిక్రమించినట్లు తేలితే చర్యలు తీసుకుంటాం. రెవెన్యూ పరిధిలో భూ అక్రమాలను సహించేదే లేదు. సహజవనరుల దోపిడీకి పాల్పడితే చర్యలు తప్పవు.

## పెన్షనర్స్ కార్యాలయానికి లక్ష బహుకరణ...!!

సత్తెనపల్లి (వి. ఎన్. కె. వార్త).... పెన్షనర్స్ కార్యాలయంలో జక్కుల లక్ష్మీనారాయణ అధ్యక్షతన సమావేశం జరిగింది. ఈ సమావేశంలో ఇటీవల మరణించిన శరభయ్య హై స్కూల్ తెలుగు పండితులు కొల్లిపర రాధాకృష్ణమూర్తి చిత్రపటాన్ని వారి శ్రీమతి జానకి కార్యాలయములో ఆవిష్కరించడానికి వచ్చి వారి జ్ఞాపకార్థం ఒక లక్ష రూపాయలు కార్యాలయానికి బహుకరించారు. ఈ కార్యక్రమంలో జనరల్ సెక్రెటరీ ప్రసాద్, పోతులూరయ్య, పులి సాంబయ్య, జెట్టి రమేష్, జ్ఞానానందం, అంకాల ప్రభుదాస్, బొడ్డు రామారావు, జెట్టి సైదులు, మోహిద్దీన్,



జగన్నాథ నాయుడు, రామకోటయ్య, నాసరయ్య, నాగవర్ధన్, సుబ్బారావు, బి డి ఆర్ నాగవర్ధన్, మల్లేశ్వరరావు, జిల్లా సెక్రెటరీ ఆదెయ్య, జిల్లా ట్రెజరర్ ఎం ఎస్ ఆర్ కె ప్రసాద్ తదితరులు హాజరై జానకి ని అభినందించారు. సంఘానికి వారు చేస్తున్న సేవలను ఈ సందర్భంగా కొనియాడారు.

## గంబుషియా చేపలు విడుదల

### ఆరోగ్య విస్తరణ అధికారి శిఖా శాంసన్

అమరావతి వి ఎన్ కే వార్త: గంభుషియా అను చిన్న చిన్న చేపలు నీటి స్థావరంలో వదిలినట్లయితే దోమలు పుట్టవని, దోమలను ఈ చేపలు తిని బ్రతుకుతాయని తద్వారా దోమల ఉత్పత్తిని తగ్గించవచ్చునని క్రోసూరు ఆరోగ్య విస్తరణ అధికారి శిఖా శాంసన్ అన్నారు. గురువారం క్రోసూరు మండల పరిధిలోని పీసపాడు, ఎర్రబాలెం,



అనంతవరం, క్రోసూరు, విప్పర్ల తదితర గ్రామాల్లో వాడుకులో లేని బావుల్లో గంబుషా చేపలు ను వదిలినట్లు ఆయన తెలిపారు. జాతీయ కీటక జనిత నియంత్రణ కార్యక్రమంలో భాగంగా ఈ కార్యక్రమం ను చేపట్టామని అన్నారు. ఈ కార్యక్రమంలో మగ ఆరోగ్య కార్యకర్తలు ప్రహ్లాద్, ప్రేమ రాజ్, ఆశా కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

### అనధికార లే - అవుట్లో ప్లాట్ల క్రమబద్ధీకరణ...!!

సత్తెనపల్లి (వి. ఎన్. కె. వార్త)....సత్తెనపల్లి మున్సిపల్ పరిధిలోని అనధికార లే-అవుట్లలో ప్లాట్లను క్రమబద్ధీకరణ చేసుకునేందుకు ప్రభుత్వం మరో అవకాశం కల్పించిందని మున్సిపల్ కమిషనర్ యన్. ఆనందకుమార్ తెలిపారు. పట్టణ పరిధిలోని అనధికార లే-అవుట్లలోని ప్లాట్లను క్రమబద్ధీకరించు కొనేందుకు లే-అవుట్ రెగ్యులైజేషన్ స్కీమ్ కోసం ప్రభుత్వం మరోసారి అవకాశం కల్పించిందన్నారు. అనధికారిక లే-అవుట్లలోని ప్లాట్ రిజిస్ట్రేషన్ జూన్ 30వ తేదీ లోపు జరిగి ఉంటే, వాటిని క్రమబద్ధీకరించు కునేందుకు అవకాశం కల్పించారన్నారు.




పట్టణ పరిధిలోని లే-అవుట్ల యజమానులు, ప్లాట్ల యజమానులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని, గతంలో 2019 అక్టోబర్ వరకు ఇచ్చిన అవకాశాన్ని మరో ఆరు సంవత్సరాలు పొడిగిస్తూ ప్రభుత్వం అవకాశం కల్పించిందన్నారు. ఈ సంవత్సరం అక్టోబర్ 23 వరకు లే- అవుట్ల క్రమబద్ధీకరణకు అవకాశం ఉందని తెలిపారు. క్రమబద్ధీకరణ చేసుకోని వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవడం జరుగుతుందని, ఇతర వివరాలకు తమ కార్యాలయంలోని పట్టణ ప్రణాళిక విభాగంలో సంప్రదించి పూర్తి వివరాలు తెలుసుకోవాలన్నారు.

### నేడు అమరావతిలో పింఛన్ల పంపిణీ కార్యక్రమంలో పాల్గొననున్న ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్

అమరావతి వి ఎన్ కే వార్త : మండల కేంద్రమైన అమరావతిలోని పట్నం మాలపల్లి (అంబేద్కర్ కాలనీ) నందు శుక్రవారం ఉదయం 9 గంటలకు జరిగే పెన్షన్ ల పంపిణీ కార్యక్రమంలో పెదకూరపాడు నియోజకవర్గ శాసనసభ్యులు భాష్యం ప్రవీణ్ పాల్గొంటారని అమరావతి టిడిపి నాయకులు గుడిసె కిరణ్ కుమార్ తెలిపారు. ఈ సందర్భంగా గుడిసె కిరణ్ కుమార్ మాట్లాడుతూ పెన్షన్ల పంపిణీ కార్యక్రమంలో మండల పరిధిలోని కూటమి పార్టీల నాయకులు, కార్యకర్తలు పాల్గొనాలని కోరారు.

# పల్నాడు జిల్లా వార్తలు

## అధాని విద్యుత్ స్మార్ట్ మీటర్లను వ్యతిరేకించటమే పరిష్కారం

### వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి జి.రవిబాబు



క్రోసూరు( వి. ఎ న్. కే. వార్త ) క్రోసూరులోని ఆమంచి విజ్ఞాన కేంద్రంలో తిమ్మిశెట్టి హనుమంతరావు అధ్యక్షతన క్రోసూరు మండల ప్రజావేదిక ఆధ్వర్యంలో అదాని స్మార్ట్ విద్యుత్ మీటర్లకు వ్యతిరేకంగా రౌండ్ టేబుల్ సమావేశం గురువారం జరిగింది. ఈ సందర్భంగా వ్యవసాయకార్మిక సంఘం జిల్లా కార్యదర్శి జి.రవిబాబు మాట్లాడుతూ నూతనంగా అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం ప్రజలపై ఎటువంటి విద్యుత్ భారాలు వెయ్యబోమని చెబుతూనే , మరొకపక్క సర్దుబాటు చార్జీల పేరుతో 15 వేల కోట్ల రూపాయలు వసూలు చేసేందుకు సిద్ధమైందని, అందులో భాగంగా ఇప్పటికే 2750 కోట్ల రూపాయలు వసూలు చేయడం జరిగిందని అన్నారు. గత ప్రభుత్వాల విధానాల వలనే సర్దుబాటు చార్జీలు వేస్తున్నామని పదేపదే చెబుతున్న కూటమి ప్రభుత్వం , గతంలో వైయస్సార్ ప్రభుత్వం కేంద్ర ప్రభుత్వం ఒత్తిడితో సెకి తో చేసుకున్న విద్యుత్ ఒప్పందాలు సరైనవి కాదని , పెద్ద ఎత్తున అవినీతి జరిగిందని కోర్టుకు వెళ్లి మరీ వాదించిన టిడిపి పాలకులు ఇప్పుడు మౌనంగా ఉండటంలో అర్థమేమిటో ప్రజలు ఆలోచించాలని అన్నారు. పైగా గత ప్రభుత్వం సోలార్ విద్యుత్ ఉత్పత్తి కి 2.45 పైసలు చెల్లించాలని ఒప్పందం చేసుకుంటే , ఈ ప్రభుత్వం 4.60 పైసలు చెల్లిస్తామని ఒప్పందం చేసుకోవడంతో కూటమి ప్రభుత్వం , ప్రజల డబ్బులను ఏ స్థాయిలో కార్పొరేట్లకు కట్టబెట్టడానికి చూస్తున్నారో అర్థమవుతుందని అన్నారు. స్మార్ట్ మీటర్ల తయారు చేసే శ్రీ షిర్డీ సాయి ఎలక్ట్రానిక్స్ కంపెనీ తో వైయస్సార్ ప్రభుత్వం పెద్ద ఎత్తున 1200 కోట్ల రూపాయల అవినీతి కి పాల్పడిందని అమెరికా కోర్టు లో సాక్షాదారాలతో వాదనలు వినిపిస్తుంటే , అదే కంపెనీ టిడిపి ప్రభుత్వానికి కూడా 30 కోట్లు ఇవ్వడం జరిగిందని అన్నారు. అదానీ స్మార్ట్ మీటర్లు బిగించడం అంటే పూర్తిగా విద్యుత్తును ప్రైవేటీకరించడమేనని , ఈ ఒప్పందం 10 సంవత్సరాలు కొనసాగితే పూర్తిగా ప్రైవేటు వ్యక్తి చేతుల్లోకి విద్యుత్ ఉత్పత్తి , సరఫరా %డ% పంపిణీ విభాగాల మొత్తం కూడా కార్పొరేట్ల చేతులలోకి వెళ్లిపోయి , ప్రజలకు ఎటువంటి జవాబుదారితనం లేని వ్యవస్థ ఏర్పడుతుందని , ఇవి భవిష్యత్తులో ప్రజలకు మరింత భారం కానున్నదని అన్నారు. ఇలాంటి విధానాలను అధికారంలో ఉన్న టిడిపి , జనసేన మాట్లాడక పోవడం వలన ప్రజలు పెద్ద ఎత్తున నష్టపోయే ప్రమాదం ఉందని, ఈ సందర్భంలో ప్రజలు పార్టీలకతీతంగా వ్యతిరేకించడం ద్వారానే ఈ స్మార్ట్ మీటర్ల భారాలని ఎదుర్కోగలమని అన్నారు. ఈ కార్యక్రమంలో ప్రజాసంఘాల నాయకులు రావెళ్ల వెంకటేశ్వర్లు, ఆవుల ఆంజనేయులు, పోతుగంటి నాగేశ్వరరావు, ఏపూరి వెంకటేశ్వర్లు, ఎమ్మార్పీఎస్ నాయకులు నందిగం దాసు , జి.ఎలిసమ్మ , ఎస్.కె జానబీ, కంచేటి పెద్దబ్బాయి , బురిశైదా, శివశంకర్ తదితరులు పాల్గొన్నారు.

## చంద్రబాబు గారి విదేశీ పర్యటన అమరావతిని గ్లోబల్ సిటీగా తీర్చిదిద్దే దిశగా సాగింది

### - ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్



అచ్చంపేట (వి. ఎ న్. కే. వార్త)ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు గారి సింగపూర్ పర్యటన రాష్ట్రానికి పెట్టుబడులతో పాటు అమరావతి రాజధాని అభివృద్ధికి మార్గం సుమగం అవుతుందని పెదకూరపాడు ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్ అన్నారు. ఆర్థిక విశ్వాసానికి గురైన రాష్ట్రాన్ని అభివృద్ధి బాటలో నిలబెట్టేందుకు సీఎం గారు చేస్తున్న కృషి ప్రజల్లో విశ్వాసాన్ని కలిగిస్తోందని ఆయన పేర్కొన్నారు. రాష్ట్రానికి పెట్టుబడులను తెచ్చేందుకు చంద్రబాబు దృఢ సంకల్పంతో కృషి చేస్తున్నారన్నారు. చంద్రబాబు నాయుడి పాలనలో విశ్వసనీయత, పారదర్శకత ఉండటం వల్లే ప్రపంచ స్థాయి కంపెనీలు మన రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టేందుకు ఆసక్తి చూపుతున్నాయన్నారు. ఆయన విదేశీ పర్యటనలో ఇప్పటికే అనేక బహుళస్థాయి సంస్థలు రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టేందుకు ముందుకు రావడం ముఖ్యమంత్రి చంద్రబాబు గారి విశ్వసనీయతకు నిదర్శనమన్నారు. రాజధాని అమరావతిని ప్రపంచంలోనే అత్యుత్తమ నగరాల సరసన నిలబెట్టే విధంగా ముఖ్యమంత్రి చంద్రబాబు కృషి చేస్తున్నారన్నారు. అమరావతి పేరును మళ్లీ అంతర్జాతీయ స్థాయిలో నిలిపేలా ముఖ్యమంత్రి గారు విదేశాల్లో ప్రెజెంటేషన్‌లు ఇచ్చి పెట్టుబడిదారులకు రాష్ట్రం మీద మళ్లీ నమ్మకాన్ని కలిగించారన్నారు. వైసీపీ పాలనలో ఒక్క పెట్టుబడి కూడా రాష్ట్రానికి రాలేదన్నారు. గత ప్రభుత్వంలో రాష్ట్ర యువతకు ఉపాధి కల్పన అన్న మాటే మరిచిపోయారన్న నిజాన్ని ప్రజలు గమనిస్తున్నారన్నారు అతివేగంగా అభివృద్ధి చెందే రాష్ట్రంగా ఆంధ్రప్రదేశ్‌ను తీర్చిదిద్దేందుకు ముఖ్యమంత్రి చంద్రబాబు చేస్తున్న కృషి అభినందనీయమన్నారు. ప్రతి పెట్టుబడి, ప్రతి పరిశ్రమ రాష్ట్రానికి ఉద్యోగాల కల్పనతో యువత భవిష్యత్తు మెరుగవుతుందన్నారు.

## ఉద్యోగ విరమణ పొందిన హెడ్ కానిస్టేబుల్ మంగమ్మకి ఆత్మీయ వీడ్కోలు పలికిన పోలీస్ సిబ్బంది

### సంపూర్ణ ఆరోగ్యంతో ఉద్యోగ విరమణ చెందడం అదృష్టం పల్నాడు జిల్లా ఎస్పీ కంచి శ్రీనివాస రావు



నరసరావుపేట (వి.ఎన్. కే వార్త).సుదీర్ఘకాలం పాటు పోలీస్ శాఖలో అత్యున్నత సేవలు అందించి, సంపూర్ణ ఆరోగ్యంతో నేడు పదవీ విరమణ చేసినటువంటి డబ్ల్యూహెచ్సి .మంగమ్మ ని పల్నాడు జిల్లా ఎస్పీ కంచి శ్రీనివాసరావు, పల్నాడు జిల్లా పోలీస్ కార్యాలయం నందు నందు ఘనంగా ఆత్మీయ వీడ్కోలు పలికారు. కే.మంగమ్మ ని శాలువాలు ,పూలదండలతో సత్కరించి వారి కుటుంబ సభ్యులు, సిబ్బంది సమక్షంలో ఘనంగా ఆత్మీయ వీడ్కోలు పలికారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ.. కుటుంబంతో కంటే పోలీస్ శాఖ లోకి ప్రవేశించిన నాటి నుండి నేటి వరకు అహర్నిశలు ప్రజాక్షేమం కోసం కృషి చేసి, గౌరవ ప్రదంగా, మర్యాద పూర్వంగా పదవి విరమణ పొందడం అదృష్టమన్నారు ఇలా పదవీ విరమణ పొందడం బాధగానే ఉంటుందని, జీవితంలో ఉద్యోగం అన్న తరువాత పదవి విరమణ పొందడం కూడా ఉంటుందని, ఉద్యోగంలో మొదటి రోజు ఎలా సంతోషంగా ఉంటామో చివరి రోజున కూడా అంతే ఉత్సాహంగా ఉండాలని తెలిపారు సెలవులు ఉన్నా తీసుకోలేని పరిస్థితిలో కూడా డ్యూటీ చేస్తూ బంధాలకు, అనుబంధాలకు, ముఖ్యమైన కార్యక్రమాలకు దూరమై, ఎన్నో భాధలు, బాధ్యతలు ఉన్నా అన్నిటిని మరిచిపోయి పోలీస్ ఉద్యోగాన్ని ప్రతి క్షణం ఒక ఛాలెంజ్ గా తీసుకొని ఈ పోలీస్ వ్యవస్థకు మంచి సేవలు అందించిన మిమ్మల్ని డిపార్టుమెంటు మరిచి పోదని తెలిపారు పదవి విరమణ పొందిన తరువాత మీ కుటుంభ సభ్యులతో మిగిలిన శేష జీవితాన్ని సుఖ సంతోషాలతో గడుపుతారని ఆశిస్తున్నాను అన్నారు పదవి విరమణ పొందిన తరువాత కూడా మీకు ఏదైనా సమస్యలు వస్తే పోలీస్ శాఖ తలుపులు ఎప్పుడూ తెరిచే వుంటుందని మీ సమస్యలను పరిష్కరించడంలో ముందు ఉంటామని,మిగిలిన మీ శేష జీవితాన్ని కుటుంబ సభ్యులతో బంధు మిత్రులతో ఆనందమయంగా గడపాలని, ఆరోగ్యం విషయంలో శ్రద్ధ కనబరచాలని, సూచించారు. అలాగే పదవీ విరమణ చెందుతున్న సిబ్బంది యొక్క కుటుంబ వివరాలను, పిల్లల చదువుల ,ఉద్యోగ స్థితిగతులను గురించి అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ అడ్మిన్ జే.వి సంతోష్, ఏ ఆర్ అడిషనల్ ఎస్పీ వి. సత్తి రాజు, వెల్ఫేర్ ఆర్ ఎల్ గోపీనాథ్, సిఐ యం. శ్రీనివాస రావు,మహిళా పోలీస్ స్టేషన్ సీఐ సుభాషిణి, ఎస్సై లు,పల్నాడు జిల్లా పోలీస్ యూనియన్ ప్రెసిడెంట్ టీ.మాణిక్యాల రావు మరియు డి సి ఆర్ బి సిబ్బంది, కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

# టీడీపీ కౌన్సిలర్ మేరీ గ్రేస్ పై... అనుచిత వ్యాఖ్యలు చేసిన టీపీఓ రాధాకృష్ణ....!!

## ఆగ్రహం వ్యక్తం చేసిన కౌన్సిలర్లు...!



సత్తెనపల్లి (వి. ఎన్. కె. వార్త)....మున్సిపల్ చైర్- పర్సన్ చల్లంచర్ల లక్ష్మి తులసి సాంబశివరావు అధ్యక్షతన గురువారం కౌన్సిల్ సమావేశం జరిగింది. ఈ సమావేశంలో మున్సిపల్ ఫ్లోర్ లీడర్, 31వ వార్డ్ టీడీపీ కౌన్సిలర్ మేరీ గ్రేస్ పై మున్సిపల్ టీ.పీ.ఓ రాధాకృష్ణ అనుచిత వ్యాఖ్యలు చేశారు. దీంతో అధికార, ప్రతిపక్ష పార్టీలకు చెందిన కౌన్సిలర్లు మూకుమ్మడిగా రామకృష్ణ పై ఆగ్రహం వ్యక్తం చేశారు. "నీ సంగతి స్థానిక ఎమ్మెల్యే కన్నా లక్ష్మి నారాయణ దగ్గరే తేల్చుకుంటాం... అంటూ పార్టీలకు అతీతంగా వైసీపీ కౌన్సిలర్స్, కో-ఆప్షన్ మెంబర్స్ మద్దతు పలికారు. కౌన్సిలర్స్ వ్యతిరేకతో కమీషనర్ ఆనంద కుమార్ జరిగిన దానికి ఈ ఒక్కసారికి ఎక్స్ క్యూజ్ చేయాలంటూ సభలో కౌన్సిలర్ మేరీ గ్రేస్ ను కోరారు. కౌన్సిలర్ మేరీ గ్రేస్ మాట్లాడుతూ...టీపీఓ అనే అతను పబ్లిక్ సర్వెంట్... ఏది అడిగినా పబ్లిక్ పరంగా సమాధానం చెప్పే భాధ్యత మీకు ఉందని, మేము ప్రజా ప్రతినిధిగా, భాధ్యతగా ప్రవర్తిస్తున్నానని, నీవు ప్లానింగ్ సెక్రటరీల పట్ల ప్రవర్తించే తీరు ఏంటో నాకు తెలుసు,10 కి 9 మంది సెక్రటరీలు మీ గురించి ఫిర్యాదులే చెప్తున్నారని దుయ్యబట్టారు. పట్టణంలో పెద్ద, పెద్ద భవనాలు కట్టుబడి చేస్తుంటే, వాళ్ల దగ్గర నువ్వు మౌనంగా ఎందుకు ఉంటున్నావని, నీవు అక్కడ ఏం చేస్తున్నావో నాకు నీ డేటా అంతా తెలుసని, మున్సిపాల్టీకి కూత వేటు దూరంలో రోడ్ మీదకి వచ్చి మరి స్లాబ్ వేస్తుంటే నీ ప్రతాపం ఎక్కడంటూ...చిన్న, చిన్న వారిని నువ్వు పెట్టే ఇబ్బందులు అంత ఇంత కాదంటూ టీ.పీ.ఓ పై విరుచుకుపడ్డారు. సత్తెనపల్లి మున్సిపాల్టీలో కమిషనర్ చాంబర్లో శానిటరీ సెక్రటరీ ప్రదీప్ అనే వ్యక్తి నిత్యం ఎందుకు మీ ఛాంబర్ లో కుర్చుంటున్నాడు...!? టీపీఓ సెక్షన్ లో ప్లానింగ్ సెక్రటరీ మునాఫ్ అనే వ్యక్తి నిత్యం ఎందుకు ఉంటున్నాడు...!? గత ప్రభుత్వంలో ఈ మునాఫ్ అనే వ్యక్తిపై ఎన్నో విమర్శలు వెల్లువెత్తాయి... ఐనా మీరు అతన్ని అక్కడ కూర్చోపెట్టుకోవాల్సిన అంత అవసరం ఏంటంటూ కమీషనర్ ను కౌన్సిలర్ మేరీ గ్రేస్ ప్రశ్నించారు. అసలు వీళ్ల ఉద్యోగాలు వారు చేయరా...!? వారికేమన్నా ప్రత్యేకమా..., అందరిలా వాళ్లు కూడా ఒక్కటే కథా అంటూ...ఆ రెండు డిపార్టుమెంట్ ల తోటి ఉద్యోగులు నన్ను ప్రశ్నిస్తే మేము ఏం సమాధానం చెప్పాలన్నారు. సాయంత్రం 5 దాటితే కార్యాలయంలో వారికేం పని ఇక్కడ...!? ఓ సచివాలయంలో కార్మికులు హాజరు కాకుండా మేనేజ్ చేస్తున్నారని, ఇష్టా రాజ్యంగా ఎవరికి నచ్చిన వారి వేళ్లల్లో వస్తారు... వెళ్తారని తీవ్ర స్థాయిలో అధికారులని ఆమె ప్రశ్నించింది. మరొక సారి ఇలా చేసి మా స్థానిక ఎమ్మెల్యే కన్నా లక్ష్మి నారాయణకు, కూటమి ప్రభుత్వానికి చెడ్డ పేరు తెచ్చి పెట్టవద్దని సూచించారు. కమీషనర్ మాట్లాడుతూ... స్థానిక ఎమ్మెల్యే "కన్నా" సచివాలయాల సిబ్బందితో సమావేశం ఏర్పాటు చేయాలంటూ ఆదేశాలు ఇచ్చి ఉన్నారని, ఛాంబర్స్ లో ఎవరిని కూర్చోనివ్వమంటూ బదులిచ్చారు. జన సేన పార్టీ కౌన్సిలర్ ర%శీ%గిశెట్టి సుమన్ మాట్లాడుతూ... ప్రజాప్రతినిధులు అంటే అధికారులకు లెక్కలేని తనమని, రైల్వే స్టేషన్ రోడ్ లోని డీఎం జోన్ లపై మీరు తీసుకున్న చర్యలేవి అంటూ టీపీఓ పై మండిపడ్డారు. ఎంక్రోచ్ మెంట్లు చేస్తే అన్ని చేయాలని, కొన్ని చేసి వదిలేయడం కాదని, ప్రజలు మమ్మల్ని విమర్శిస్తున్నారన్నారు. వైసీపీ కౌన్సిలర్ సతీష్ మాట్లాడుతూ... గుంటూర్ రోడ్ లో ఆక్రమణలు తొలగించారు సరే... నర్సారావుపేట బస్ పాయింట్ దగ్గర, పాత జూనియర్ కళాశాల ముందు నుండి ఆ చివరకు అన్ని ఆక్రమణలే నని, కనీసం చూడాలన్న వెనుక ఏం కనపడవని, వీటన్నిటినీ ఎప్పుడు తొలగిస్తారో స్పష్టంగా చెప్పాలంటూ టీపీఓ ని ప్రశ్నిస్తే త్వరలోనే అవన్నీ కూడా తొలగిస్తామని, ఎమ్మెల్యే చెప్పారని ముందు అక్కడ తొలగించామని, అన్నీ ఆక్రమణ లను త్వరలో తొలగిస్తామని, క్రేన్ ఒక్కటే ఉండటం, లేబర్ తక్కువగా ఉండటం, వర్షాలు పడటం వల్ల తొలగించలేక పోయామన్న టీపీఓ రాధాకృష్ణ సమాధానమిచ్చారు. కో- ఆప్షన్ స్వాతి మాట్లాడుతూ... పారిశుధ్య కార్మికులకు 4 లక్షలు బిల్ పెట్టారంటూ, వారికి ఏ మేం అందిస్తారని, గడిచిన నెలలకు కూడా ఇలా బిల్స్ పెడ్తే ఎలాగంటూ, వారికి ఇచ్చే సదుపాయాలు అన్నీ అందాలన్నారు. వావిలాల ట్రాక్ లో ఆట వస్తువులు తుప్పు పట్టి ఉన్నాయని, లక్షలు... లక్షలు వేటికో ఖర్చు పెడ్తారంటూ, ట్రాక్ లో సీసీ కెమెరాలు ఏర్పాటు నేటికి ఏర్పాటు చేయలేకపోయారన్నారు.ప్రజలకు ఉపయోగపడే వీటిపై దృష్టి పెట్టాలంటూ కమిషనర్ కు దృష్టికి తీసుకురాగా, పిల్లల క్రీడా వస్తువులు అన్ని మరమత్తులు చేయిస్తామన్నారు. కెమెరాలు ఏర్పాటు చేస్తామన్నారు. కౌన్సిలర్ శెట్టి ఆనంద్ మాట్లాడుతూ.. మున్సిపల్ స్థలాల్లో బోర్డులు ఏర్పాటు చేయాలంటూ ఎమ్మెల్యే చెప్పినా కూడా చేయలేదని, గత కౌన్సిల్లో కూడా చెప్పామని, వావిలాల పార్కో లో ఫౌంటైన్ లైటింగ్ తో ఉండేలా చూడాలన్నారు. ఈ సమావేశంలో మున్సిపల్ డీఈ, ఏఈ లు, ఆర్వో,ఆర్ ఐ , శానిటరీ ఇన్స్పెక్టర్, శాఖల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# నడికట్టు వాల్ పోస్టర్ మరియు టీజర్ విడుదల







నరసరావుపేట (వి.ఎన్. కే వార్త).హైదరాబాద్ ప్రసాద్ ఫిలిం ల్యాబ్ లో నడికట్టు సినిమా పోస్టర్ మరియు టీజర్ లాంచింగ్ చేసిన ప్రముఖ రాజకీయ నాయకులు సినిమా పెద్దలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా జంగా కృష్ణమూర్తి మాట్లాడుతూ నడికట్టు మూవీ విజయం సాధించాలని ఈ యొక్క చిత్రాన్ని తెరమీదకు తీసుకొస్తున్న హీరో నిర్మాత దర్శకులు మరియు టెక్నీషియన్స్ అందరికీ శుభాకాంక్షలు అని ఆయన అన్నారు ఈ చిత్రం మంచి విజయం సాధించాలని ఆయన అన్నారు అదేవిధంగా ఫార్మ మినిస్టర్ సీనియర్ నటులు బాబు మోహన్ మాట్లాడుతూ నడికట్టు ఈ సినిమా మంచి విజయం సాధించి నాలుగు భాషలు లో తీస్తున్న ఈ చిత్రం మంచి విజయం సాధించాలని ఇంకా ఎన్నో చిత్రాలు వీరి బ్యానర్ పైన నిర్వహించాలని ఆయన అన్నారు సీనియర్ నటులు శివాజీ రాజా మాట్లాడుతూ ఈ యొక్క టీజర్ చూడటం జరిగిందని ఈ చిత్రం మంచి సక్సెస్ ఫుల్లుగా విజయం సాధిస్తుందని ఈ చిత్రంలో నటించిన ప్రతి ఒక్కరికి శుభాకాంక్షలు అని ఆయన అన్నారు అదేవిధంగా మన ఫిలిం ఛాంబర్ ఆఫ్ కామర్స్ చైర్మన్ రాజేంద్ర మాట్లాడుతూ ఈ చిత్రం తీయటానికి ఎంతో కష్టపడిన నిర్మాత సోమశేఖర్ అని ఆయన పడిన కష్టానికి ఫలితం తప్పకుండా దక్కుతుందని ఆయన అన్నారు ఈ చిత్రం మంచి విజయం సాధిస్తుందని ఆయన అన్నారు ఈ కార్యక్రమంలో మూవీ హీరో భాను. దర్శకులు. అనిల్. కౌలాస కోట చిత్రం నిర్మాత మాదాల నాగూర్. ప్రముఖ యాక్టర్ నిర్మాత శ్రీనివాసరావు . తెలుగు తమిళం హీరో. కిరణ్ కుమార్. టీవీ సినిమా హీరో. కార్తికేయ. మూర్తి. శర్మ. రాజనాల సత్య. నిర్మాత లల్లి మధు లత. యామర్తి రాము. ఏసుబాబు. తదితరులు పాల్గొన్నారు

# ఈ నెల 4 వ తేదీన బిజెపి అధ్యక్షులు మాధవ్ చేపట్టిన సారథ్యం కార్యక్రమాన్ని విజయవంతం చేయాలి

## పల్నాడు జిల్లా బిజెపి మాజీ అధ్యక్షులు ఆలోకం సుధాకర్ బాబు





అమరావతి వి ఎన్ కే వార్త :భారతీయ జనతా పార్టీ రాష్ట్ర అధ్యక్షులు పివిఎన్ మాధవ్ ఆగస్టు 4 వ తేదీన పల్నాడు జిల్లాలో జరిగే సారథ్యం కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పల్నాడు జిల్లా బిజెపి మాజీ అధ్యక్షులు ఆలోకం సుధాకర్ బాబు, బిజెపి ప్రకాశం జిల్లా ఇన్చార్జి, పెదకూరపాడు నియోజకవర్గ కార్యక్రమ పరిశీలకులు పునుగొళ్ళ రవిశంకర్ లు పిలుపునిచ్చారు. మండల కేంద్రమైన అమరావతి లోని ధ్యాన బుద్ధ సమీపంలోని హరిత రిసార్ట్స్ లో గురువారం పెదకూరపాడు నియోజకవర్గ బిజెపి నాయకుల సమావేశం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పి.రవిశంకర్ పాల్గొన్నారు. ఈ కార్యక్రమానికి బిజెపి జిల్లా ఉపాధ్యక్షుడు గోగినేని వెంకటరమణ అధ్యక్షత వహించారు. పల్నాడు జిల్లా బిజెపి మాజీ అధ్యక్షులు ఆలోకం సుధాకర్ బాబు మాట్లాడుతూ ఈ నెల 4 వ తేదీన మాధవ్ ఆధ్వర్యంలో జరిగే కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. మాధవ్ నాయకత్వం లో బిజెపి పార్టీ బలోపేతం అవుతుందని అన్నారు. పెదకూరపాడు నియోజకవర్గ బీజేపీ పరిశీలకులు పి .రవిశంకర్ మాట్లాడుతూ పెదకూరపాడు నియోజకవర్గ పరిధిలోని అన్ని గ్రామాల నుంచి పెద్ద సంఖ్యలో తరలిరావాలని కోరారు. బిజెపి నాయకులకు మాధవ్ పర్యటన గురించి దిశా నిర్దేశం చేశారు. ఎంపీపీల సంఘం రాష్ట్ర అధ్యక్షులు, అమరావతి ఎంపీపీ మేకల హనుమంతరావు మాట్లాడుతూ పెదకూరపాడు నియోజకవర్గం లోని ప్రతి గ్రామం నుండి వందల సంఖ్యలో కార్యకర్తలు ,నాయకులు పాల్గొని పివిఎన్ మాధవ్ సారథ్యం కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. బిజెపితోనే వికసిద్భారత్ సాధ్యమని తెలిపారు. బిజెపి పల్నాడు జిల్లా కార్యవర్గం నకు జిల్లా ఉపాధ్యక్షుడు గా గోగినేని వెంకటరమణ , జిల్లా కార్యదర్శి సులోచన లు ఎన్నికైనందున వారిని శాలువాలతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో పెదకూరపాడు నియోజకవర్గ పరిధిలోని బిజెపినాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# పల్నాడు జిల్లా వార్తలు

# పల్నాడు జిల్లా క్రీడాభివృద్ధి కి బాటలు జూడో అసోసియేషన్

## నరసరావుపేట ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవింద బాబు.














నరసరావుపేట (వి.ఎన్. కే వార్త).పల్నాడు జిల్లా జూడో అసోసియేషన్ ఏర్పాటుతో క్రీడాభివృద్ధికి బాటలు వేశారని నరసరావుపేట ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవింద బాబు అన్నారు. గురువారం నరసరావుపేటలోని వినుకొండ రోడ్లోని జూపల్లి స్ప్రెసెస్ రెసిడెన్షియల్లో పల్నాడు జిల్లా జూడో అసోసియేషన్ నూతన కార్యవర్గం ఎన్నిక జనరల్ బాడీ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ముఖ్యఅతిథిగా నరసరావుపేట ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవింద బాబు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఉద్యోగ అవకాశాల్లో క్రీడాకారులకు 3 శాతం రిజర్వేషన్లు కల్పించారని అన్నారు. అంతేకాకుండా ఎటువంటి ఇంటర్వ్యూ, వ్రాత పరీక్ష లేకుండా క్రీడాకారులకు ప్రభుత్వ ఉద్యోగాల కల్పనలో అవకాశం కల్పించారని అన్నారు. జూడో క్రీడ ఒలింపిక్స్ క్రీడలకు నామినేట్ అయిన క్రీడని అన్నారు. నూతనంగా ఎన్నికైన కార్యవర్గం పల్నాడు జిల్లా క్రీడా శాఖతో అనుసంధానమై విద్యార్థులను క్రీడల పట్ల ఆసక్తి పెంచే విధంగా కృషి చేయాలని అన్నారు. పల్నాడు, గుంటూరు జిల్లాల ఉమ్మడి క్రీడాధికారి నరసింహారెడ్డి మాట్లాడుతూ కుల మతాలకతీతంగా ప్రోత్సహించే ఏకైక శాఖ క్రీడా శాఖ అని అన్నారు. నూతనంగా ఎన్నికైన పలనాడు జిల్లా జూడో అసోసియేషన్ కార్యవర్గం క్రీడలను ప్రోత్సహించే విధంగా చర్యలు తీసుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో జూడో రాష్ట్ర అధ్యక్షులు గణేష్ సుబ్బారావు, సీఈఓ నామిశెట్టి వెంకట్ లు మాట్లాడుతూ జూడో క్రీడ భారతదేశంలో 20వ శతాబ్దం మధ్య భాగంలో, ముఖ్యంగా 1950లలో ప్రవేశించిందని. ఈ క్రీడ జపాన్లో జిగోరో కానో చే 1882లో స్థాపించబడిన ఆధునిక మార్షల్ ఆర్ట్, భారతదేశంలో మొదటగా కొన్ని పట్టణ ప్రాంతాల్లో, ముఖ్యంగా సైనిక మరియు పోలీసు శిక్షణ కేంద్రాల ద్వారా పరిచయం చేయబడిందని అన్నారు. 1960లలో, జూడో ఫెడరేషన్ ఆఫ్ ఇండియా (%JFI%) ఏర్పాటుతో ఈ క్రీడ వ్యవస్థీకృత రూపం సంతరించుకుంది. జె ఎఫ్ ఐ 1965లో అధికారికంగా స్థాపించబడి, జూడోను దేశవ్యాప్తంగా ప్రోత్సహించడానికి కృషి చేసింది. జూడో భారతదేశంలో విస్తరణకు జె ఎఫ్ ఐ కీలక పాత్ర పోషించింది. 1970ల నాటికి, జూడో దేశవ్యాప్తంగా వివిధ రాష్ట్రాల్లోని క్రీడా సంఘాల ద్వారా పాఠశాలలు, కళాశాలలు మరియు క్రీడా క్లబ్లలో వ్యాప్తి చెందింది. దేశంలోని ప్రధాన నగరాలైన ఢిల్లీ, ముంబై, చెన్నై, మరియు కోల్కతాలలో జూడో శిక్షణ కేంద్రాలు స్థాపించబడ్డాయి. 1988లో జూడో అంతర్జాతీయ ఒలింపిక్ కమిటీ (%IOC%) ద్వారా ఒలింపిక్ క్రీడగా గుర్తింపు పొందడంతో, భారతదేశంలో దాని ప్రజాదరణ మరింత పెరిగింది. జాతీయ, రాష్ట్ర స్థాయి టోర్నమెంట్లు, జూడో శిక్షణా కార్యక్రమాలు, మరియు అంతర్జాతీయ పోటీలలో భారత క్రీడాకారుల పాల్గొనడం ద్వారా ఈ క్రీడ విస్తరించింది. ఆంధ్రప్రదేశ్ లోని పల్నాడు జిల్లా వంటి ప్రాంతాల్లో కూడా స్థానిక అసోసియేషన్లు ఏర్పాటై, జూడో ను గ్రామీణ స్థాయిలో ప్రోత్సహించడం ప్రారంభమైంది. కులం, మతం, లింగ భేదాలకు అతీతంగా క్రీడ ద్వారా సామాజిక సామరస్యాన్ని పెంపొందించడం జె ఎఫ్ ఐ ఆధ్వర్యంలో రాష్ట్ర మరియు జిల్లా అసోసియేషన్లు క్రీడా నియమాలను రూపొందించడం, క్రీడాకారులను ఎంపిక చేయడం, మరియు క్రీడా కార్యక్రమాలను సమన్వయం చేయడం వంటి లక్ష్యాలను పెట్టుకుందన్నారు.

**నూతన కార్యవర్గం ఎన్నిక.**

పల్నాడు జిల్లా జూడో అసోసియేషన్ అధ్యక్షులుగా పసుపులేటి వెంకటేశ్వరరావు, ఉపాధ్యక్షుడు కొప్పుల పార్వతి, జనరల్ సెక్రెటరీ కొప్పుల నరసింహారావు, జాయింట్ సెక్రటరీ బి బాలమురలీకృష్ణ మరియు సభ్యులు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. వీరిని వాగ్దేవి విద్యాసంస్థల అధినేత రాయల శ్రీనివాసరావు సన్మానించారు.

# కే - రిడ్జ్ పాఠశాలలో స్కూల్ ఎలక్షన్స్ నిర్వహణ










నరసరావుపేట (వి.ఎన్. కే వార్త).నరసరావుపేటలోని కే-రిడ్జ్ ఇంటర్నేషనల్ నందు స్కూల్ హెడ్ బాయ్, హెడ్ గర్ల్ కి సంబంధించి ఎన్నికలను నిర్వహించారు. ప్రపంచంలోనే అతిపెద్ద ప్రజాస్వామ్య దేశమైన భారతదేశంలో ఎన్నికల నిర్వహణ ఎంతో ప్రాముఖ్యతను సంతరించుకున్నదని, అదే విధముగా ఓటు హక్కు అనే బలమైన ఆయుధంతో ప్రతినిధులను ఎన్నుకోవటం ద్వారా ప్రజా ప్రభుత్వానికి మార్గం ఏర్పడుతుందని, ఈ క్రమంలోనే పాఠశాలలో కూడా ఎన్నికల నిర్వహణ ద్వారా విద్యార్థులు స్కూల్ హెడ్ బాయ్, హెడ్ గర్ల్, డిప్యూటీ హెడ్ బాయ్, డిప్యూటీ హెడ్ గర్ల్ ఎన్నుకోవటం ద్వారా విద్యార్థులకు ప్రజాస్వామ్యంలో ఎన్నికల పట్ల పూర్తి అవగాహన పెంపొందించుకోవడం జరుగుతుందని, విద్యార్థి దశ నుండే నాయకత్వ లక్షణాలు అలవర్చుకోవటానికి, దేశం పట్ల, సమాజం పట్ల భాధ్యత కలిగిన పౌరులుగా ఉండటానికి ఈ ఎన్నికలు తోడ్పడుతాయని స్కూల్ చైర్మన్ నాతాని వెంకటేశ్వర్లు పేర్కొనటం జరిగింది. ఈ ఎన్నికల నిర్వహణ ప్రక్రియలో చీఫ్ ఎలక్షన్ కమీషనర్ గా టి. విజయ రాజు, అసిస్టెంట్ ఎలక్షన్ కమీషనర్ గా హేమలత బాధ్యతలు నిర్వర్తించారు. మూడు పోలింగ్ బూత్లను ఏర్పాటు చేసి ప్రతి పోలింగ్ బూత్ లో ప్రిసైడింగ్ ఆఫీసర్, అసిస్టెంట్ ప్రిసైడింగ్ ఆఫీసర్ మరియు సిబ్బందిని ఏర్పాటు చేయటం జరిగింది. బాబు రావు, లక్ష్మణ్, అయ్యన్న గార్లు పోలింగ్ ప్రిసైడింగ్ ఆఫీసర్స్ గాను, అన్నపూర్ణ, శ్రీనివాసరావు, శుభమిత్ర అసిస్టెంట్ పోలింగ్ ఆఫీసర్స్ గాను భాధ్యతలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు మరియు ఉపాధ్యాయులతో పాటు స్కూల్ చైర్మన్ నాతాని వెంకటేశ్వర్లు, డైరెక్టర్ కోమటినేని నాసరయ్య, ప్రిన్సిపాల్ బర్నబాస్, క్యాంపస్ ఇంచార్జి కోట బాపూజీ తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు.

# మొదటి ర్యాంకు.. రాదెందుకు?

విశాఖపట్నం : స్వచ్ఛసర్వేక్షణ్ అవార్డులు ప్రకటించిన తొలిసారి మధ్యప్రదేశ్‌లోని ఇండోర్ నగరం 25వ స్థానంలో ఉంది. ఆ తర్వాత ఏడాది నుంచి వరుసగా ఎనిమిదేళ్లు ప్రథమ స్థానంలో నిలిచింది. ఇదంతా ఎలా సాధ్యమైంది? పక్కా ప్రణాళిక, స్వచ్ఛతపై ప్రజలందరికీ అవగాహన, జన భాగస్వామ్యం, మురుగునీటి శుద్ధి, ఘనవ్యర్థాల నిర్వహణ వంటివి అమలు చేయడమే కారణం. మహా విశాఖ నగరపాలక సంస్థ(జీవీఎంసీ) ఆ దిశగా సాగుతున్నా తడబడుతోంది. పూర్తిస్థాయిలో కసరత్తు లోపించింది.

**ఎక్కువ ఇళ్లు..తక్కువ సిబ్బంది, వాహనాలు:** స్వచ్ఛ మిషన్, ఆపరేషన్ క్లీన్ ఛాలెంజ్ పేరుతో ఇండోర్‌లో ప్రత్యేక శ్రద్ధ పెట్టారు. ప్రతి ఇంటి నుంచి తడి–పొడి చెత్తసేకరణ, రోడ్ల పక్కన ప్రతి 500 మీటర్ల దూరానికి ఒక డస్ట్‌బిన్ ఉండేలా నగరంలో 3 వేలు ఏర్పాటు చేశారు. ప్రజా మరుగుదొడ్ల సంఖ్య అత్యధికంగా పెంచారు. రోడ్లపై ఉమ్మితే జరిమానాలు విధించారు. తడిచెత్తను కంపోస్టుగా, పొడిచెత్తను ట్రీట్‌మెంట్ ప్లాంట్‌లో రీసైక్లింగ్ చేస్తున్నారు. బయో మిథనైజేషన్ ప్లాంటు ఏర్పాటు చేశారు. కమాండ్ కంట్రోల్ సెంటర్ ఏర్పాటు చేసి చెత్త తరలింపు, ట్రీట్‌మెంట్‌పై సీసీ కెమెరాల నిఘా ఉంచారు. జీవీఎంసీలో ఇండోర్ కంటే ఎక్కువ ఇళ్ల నుంచి చెత్తసేకరణ చేయాల్సి ఉన్నా తక్కువ వాహనాలు, తక్కువ సిబ్బంది ఉన్నారు.

నగరంలో బహిరంగంగా ఏర్పాటు చేసిన చెత్త డబ్బాల నిర్వహణ అధ్వానంగా మారింది. కొండవాలు ప్రాంతాల్లో చెత్త సేకరణ సరిగా జరగడం లేదు. పలు చోట్ల అపార్ట్‌మెంట్‌ల వద్దా ఇదే పరిస్థితి. స్వచ్ఛ ర్యాంకు సాధనలో ఎన్నో అంశాలు విశాఖకు ప్రతిబంధకాలుగా



మారాయి. రోజువారీ సేకరిస్తున్న చెత్తలో కాపులుప్పాడలోని విద్యుత్ ప్లాంటు, బయోగ్యాస్ ప్లాంట్‌కు, కంపోస్టు తయారీకి వెయ్యి టన్నులకు పైగా వినియోగిస్తున్నారు. అయితే పారిశుద్ధ నిర్వహణ, తరలింపు, ఘనవ్యర్థాల నిర్వణలపై ప్రత్యేక నిఘాలేదు. రెండేళ్లు వర్మీ కంపోస్టు తయారు చేసినా, కొనుగోలకు ఎవరూ రాకపోవడంతో ఆయా కేంద్రాలు నిలిపివేశారు. ప్లాస్టిక్ వ్యర్థాలను సైతం వేరు చేయడం లేదన్న విమర్శలున్నాయి.

**అంతా సముద్రంలోకి:** ఇండోర్‌లో మురుగు నీటిని శుద్ధి చేసిన తర్వాతే నదుల్లోకి వదులుతారు.అలాగే.. శుద్ధి చేసిన మురుగు నీటిని పలు కూడళ్లలో ఫౌంటైన్లలో, గార్డెన్స్ నిర్వహణకు ఉపయోగిస్తున్నారు. విశాఖలో రోజూ 263 ఎంఎల్‌డీ మురుగు ఉత్పన్నమవుతుంది. భూగర్భ డ్రైనేజీ కాల్వల ద్వారా వచ్చే మురుగును శుద్ధి చేయడానికి 19 ఎస్‌టీపీలు (శుద్ధికేంద్రాలు) ఏర్పాటు చేశారు. వీటిలో కొన్ని మరమ్మతులకు గురైన నేపథ్యంలో శుద్ధి చేయకుండానే మురుగును నేరుగా సముద్రంలోకి వదిలేస్తున్నారు.

**జరిమానాల్లేవు:** ఇండోర్ జనాభా దాదాపు 35 లక్షలు. ఇక్కడ ప్రజా మరుగుదొడ్లు 1500పైగా ఏర్పాటు చేశారు. 24 లక్షల జనాభా ఉన్న విశాఖలో 328 ప్రజామరుగు దొడ్లు ఉన్నాయి. వీధి దీపాల నిర్వహణకు ఏటా రూ.7 కోట్లకు పైగా ఖర్చు పెడుతున్నా కొన్ని ప్రాంతాల్లో అంధకారం తప్పడం లేదు. వెలగని దీపాలను 24 గంటల్లో మరమ్మతు చేయకపోతే జరిమానా విధించాల్సి ఉన్నా ఆ ఊసే కరవైంది. మరోవైపు నిషేధిత ప్లాస్టిక్ ఇబ్బడిముబ్బడిగా విక్రయిస్తున్నారు. ఈ పరిస్థితులు మారితేనే విశాఖ స్వచ్ఛ సర్వేక్షణ్ ర్యాంకుల్లో ముందుకు దూసుకువెళ్లే అవకాశాలున్నాయని నిపుణులు చెబుతున్నారు.

# నీటి సరఫరాలో మాయాజాలం

విశాఖ : మహా విశాఖ నగరపాలక సంస్థ మంచినీటి సరఫరా ఇంజినీరింగ్ విభాగంలో ఇంటి దొంగలు భారీగా దండుకుంటున్నారు. జోన్–8 పరిధిలోని కొందరు అధికారులు ఓ కంపెనీకి చేసే నీటి సరఫరాలో అక్రమాలకు పాల్పడుతూ రెండు చేతులా సంపాదించుకుంటున్నారనే ఆరోపణలొస్తున్నాయి. ఏళ్ల తరబడి నీటి సరఫరా నిర్వహణ, ప్రాజెక్టుల్లో ఇంజినీర్లుగా కొనసాగుతూ, నీటి విక్రయాల్లోనూ, లెక్కల్లోనూ అక్రమాలకు పాల్పడుతున్నట్లు సమాచారం. మంచినీటి సరఫరా, మురుగునీటి వ్యవస్థ రెండూ పనులు కొందరికే అప్పగించిన నేపథ్యంలో పూర్తిస్థాయిలో విచారణ చేస్తే జరుగుతున్న మాయ బయటపడుతుంది.

నరవ వద్ద 108 ఎంఎల్‌డీ (మిలియన్ లీటర్ పర్ డే) మురుగునీటి శుద్ధి కేంద్రం ఉంది. ప్రస్తుతం 54 ఎంఎల్‌డీ సామర్థ్యంతో మురుగును శుద్ధి చేస్తుంది. దాని నుంచి ఉత్పత్తయ్యే నీటిని కిలోలీటరు రూ.45ల చొప్పున ఓ కంపెనీకి విక్రయించాలి. రోజుకు 2 ఎంజీడీ (మిలియన్ గ్యాలన్ పర్ డే) నీటిని సరఫరా చేయాల్సి ఉంది. అందుకు తగ్గ మురుగు నీటిని శుద్ధి చేయాల్సిన బాధ్యత ఓ నిర్వహణ సంస్థది. అయితే వారు సక్రమంగా నీటిని అందించలేకపోతున్నారు. ఇంజినీరింగ్ అధికారులు ప్రత్యేకంగా నరవలోని మంచినీటి ట్యాంకుల నుంచి భారీ పైపులైను సదరు కంపెనీకి ఏర్పాటు చేశారు. నగర అవసరాలకు వినియోగించాల్సిన నీటిలో 2 ఎంజీడీల నీటిని గుట్టుగా ఈ మార్గంలో అందిస్తున్నారు. ఒప్పందం మేరకు కిలో లీటరుకు రూ.45 చెల్లిస్తున్నారు. అయితే... వారికి పంపిస్తున్నది శుద్ధి చేయని మంచినీరు. ఇది కిలో లీటరు రూ.90. అలా చూస్తే కిలో లీటరుకు రూ.45ల తక్కువ. ఇలా మిగులుతున్న సొమ్ములో వాటాలు కొందరు అధికారులకు అందుతున్నాయన్న ఆరోపణలున్నాయి.



నిత్యం 2 ఎంజీడీల నీటి సరఫరాలో భారీగా అక్రమాలకు పాల్పడుతున్నా, ఉన్నతాధికారులు పట్టనట్లు వ్యవహరించడంపై అనుమానాలు రేగుతున్నాయి. 2 ఎంజీడీల నీటికి నెలకు రూ.2.16 కోట్లు చెల్లించాల్సి ఉండగా రూ. 1.08 కోట్లే చెల్లిస్తున్నారు. ఏడాదికి రూ.25.92 కోట్లు రావాల్సి ఉన్నా రూ.12.96 కోట్లే ఖజానాకు వస్తున్నాయి.

మరో వైపు...పర్యావరణానికి ఇబ్బంది లేకుండా విదేశీ టెక్నాలజీ ఉపయోగించి, మురుగునీటిని మూడు దశల్లో శుద్ధి చేసి మంచినీరుగా మార్చి ఇవ్వాల్సిన ప్రాజెక్టు ఆదిలోనే పక్కదారి పట్టడంపైనా అధికారులు దృష్టి కేంద్రీకరించాల్సి ఉంది.

జీవీఎంసీ విక్రయించే నీటిని లెక్కకట్టడానికి ప్రత్యేకంగా మీటర్లను ఏర్పాటు చేసింది. బల్క్ కనెక్షన్‌ల విషయంలో మరింత పకడ్బందీగా వ్యవహరిస్తుంది. దీంతో సదరు కంపెనీకి నీటిని అందించే విషయంలో అధికారులు జాగ్రత్తపడ్డారు. నరవ ఎస్టీపీ వద్ద నీటిని విడిచిపెట్టే ప్రాంతంలో ఏర్పాటు చేయాల్సిన మీటరును.. కంపెనీలో మంచినీరు, ఎస్టీపీ నుంచి చేరే నీరు కలిసే సమీప ప్రాంతంలో ఏర్పాటు చేశారు. దీని వల్ల ఎస్టీపీ నుంచి వచ్చే శుద్ధి చేసిన నీరే వినియోగిస్తున్నారన్న భ్రమ కల్పిస్తున్నారు.

# తూకమేసి మోసం






కర్నూలు : చిరు ఉద్యోగి రాముడు ఇటీవల 25 కిలోల సోనామసూరి బియ్యం కొనుగోలు చేశారు. ఇందుకు రూ.1,100 చెల్లించారు.. ఆ సంచి తూకం వేయగా 24 కిలోలే ఉంది.. ఆయన రూ.44 అధికంగా చెల్లించారు.ఒక్క రాముడే కాదు.. జిల్లాలో బియ్యం కొనుగోలు చేస్తున్న ప్రతి వినియోగదారుడు ఇలానే మోసపోతున్నారు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా నెలకు 2.32 లక్షల క్వింటాళ్ల బియ్యం విక్రయాలు జరుగుతున్నాయి. ఒక బియ్యం సంచిపై రూ.50 చొప్పున ఏటా రూ.55.80 కోట్ల మేర వ్యాపారులు దోచుకుంటున్నారు.

**పాతవంటూ బురిడీ**

ఖరీఫ్ సీజన్‌లో నంద్యాల జిల్లాలో 65–80 వేల హెక్టార్లు, కర్నూలులో 12–13 వేల హెక్టార్లలో వరి సాగు చేస్తున్నారు. ఇందులో 96 శాతం సోనామసూరి రకాలే ఉంటాయి. సాధారణంగా ఎకరాకు 30–40 సంచుల ధాన్యం దిగుబడి వస్తుంది. ఏడాది కిందట పండిన ధాన్యం అయితే 75 కిలోల సంచి ధాన్యాన్ని రూ.3,000 కొనుగోలు చేస్తున్నారు. అదే కొత్తవి (గత ఖరీఫ్, రబీ కాలం) అయితే రూ.2,000 చెల్లిస్తున్నారు. వ్యాపారులు మిల్లుల్లో మిల్లింగ్ చేసి సంచుల్లో ప్యాకింగ్ చేసి విక్రయిస్తున్నారు. వరి గింజ నాణ్యతగా ఉంటే 75 కిలోల వరి ధాన్యం మిల్లింగ్ చేయించగా 50 కిలోల బియ్యం వస్తుంది. ః రైతుల వద్ద కొత్త బియ్యాన్ని తక్కువ ధరకు కొనుగోలు చేసి మరాడించి పాతవంటూ అంటగడుతున్నారు.

**ధరల నియంత్రణ ఊసేలేదు**

ఉమ్మడి జిల్లాలో 9.30 లక్షల కుటుంబాలు (70 శాతానికిపైగా) సోనామసూరి బియ్యాన్నే వినియోగిస్తున్నాయి. నలుగురైదుగురు సభ్యులున్న ఒక కుటుంబం సరాసరిన నెలకు 25 కిలోల చొప్పున ఏడాదిలో 3 క్వింటాళ్ల బియ్యం వినియోగిస్తుంది. 2019 నుంచి ఇప్పటి వరకు పరిశీలిస్తే కిలో బియ్యంపై రూ.25 మేర ధర పెరిగింది. వ్యాపారులు ఇష్టారాజ్యంగా పెంచేస్తున్నారు. అదుపు చేయడంలో అధికారులు పూర్తిగా విఫలమవుతున్నారు.

జేసీ అధ్యక్షతన పౌరసరఫరాల అధికారులతోపాటు అనుబంధ శాఖలు సమన్వయంతో సమావేశాలు నిర్వహించి ధరలు నియంత్రించాల్సి ఉంది. కమిటీ సమావేశం ఏడాదికి ఒకసారి.. అదీ మొక్కుబడిగా సాగుతోంది. మరోవైపు పౌరసరఫరాల శాఖ అధికారులు తమకెలాంటి సంబంధం లేదన్నట్లు వ్యవహరిస్తున్నారు.

**తనిఖీలు తకరారు** ఉమ్మడి కర్నూలు జిల్లాలో 220 వరకు బియ్యం మిల్లులు ఉన్నాయి. ఇక్కడి నుంచి గంపగుత్తగా సంచులు తీసుకొచ్చి చిరు వ్యాపారులు విక్రయిస్తుంటారు. పౌరసరఫరాల శాఖ అధికారులు గతంలో బియ్యం మిల్లుల్లో విస్తృతంగా తనిఖీలు చేసేవారు. తూకాల్లో తేడాలకు సంబంధించి పెద్దఎత్తున కేసులు నమోదయ్యేవి. గత కొన్నేళ్లుగా ఏ ఒక్క శాఖ అధికారి అటువైపు వెళ్లడం లేదు. ఇదే అవకాశంగా వ్యాపారులు వినియోగదారులను నిలువునా ముంచుతున్నారు. సంచిపై 25 కిలోలు అని ముద్రించి 24 కిలోలు నింపి ప్యాకింగ్ చేస్తున్నారు. కిలోకు రూ.2 నుంచి రూ.5, రూ.10 వరకు దోపిడీ చేస్తున్నారు. ప్రభుత్వం ఏటా విధించే లక్ష్యాలను పూర్తి చేసేందుకు తూనికలు, కొలతల శాఖ అధికారులు చిన్నచిన్న దుకాణాలపై దాడులు చేస్తున్నారు. కానీ బియ్యం సంచుల్లో కిలో నుంచి రెండు కిలోల వరకు తక్కువగా ఉంటున్నా చర్యలు తీసుకుంటున్న దాఖలాలు లేవు.

# గుర్తింపులేని కష్టం.. కార్మికులకు నష్టం



కర్నూలు : భవన, ఇతర నిర్మాణ రంగ కార్మికులు గుర్తింపు కార్డుల్లేక ఆర్థిక ప్రయోజనాలకు దూరమవుతున్నారు. పని ప్రదేశంలో భద్రత లేక ప్రమాదాల బారినపడుతున్నారు. వారికి ఎలాంటి ఆర్థిక సాయం అందక కుటుంబాలు వీధినపడాల్సిన పరిస్థితి నెలకొంది. బీమా పథకాల ప్రయోజనాలకు దూరం అవుతున్నారు. మరోవైపు పని ప్రదేశంలో సౌకర్యాలు, భద్రత కరవయ్యాయి. వాటి గురించి ప్రశ్నిస్తే మళ్లీ పనికి పిలవరన్న భయంతో ప్రమాదాల మధ్యనే కష్టపడుతున్నారు.

**భద్రత కరవు**

ఎత్తయిన ప్రదేశాల్లో పనిచేసే కార్మికులు నిబంధనల ప్రకారం సేఫ్టీ బెల్టు ధరించాలి. అదుపుతప్పితే జారి కింద పడిపోకుండా మరో గోడకు రక్షణ వలయం ఏర్పాటు చేసుకోవాలి. పని ప్రదేశాల్లో శిరస్త్రాణం ధరించాలి. నేలపై నిల్చుని పనిచేసే వారు, విద్యుత్తు కార్మికులు కాళ్లకు బూట్లు, చేతులకు గ్లౌజులు ధరించాలి. ఉమ్మడి జిల్లాలో ఎక్కడా ఇవి అమలు కావడం లేదు. పని ప్రదేశాల్లో ఎలాంటి రక్షణ చర్యలు చేపట్టడం లేదు. దీంతో తరచూ ప్రమాదాలు జరిగి కార్మికులు ప్రాణాలు కోల్పోతున్నారు.

**కార్డు ఎలా పొందాలి..?**

భవన, ఇతర నిర్మాణ కార్మికులు కార్మిక శాఖ నుంచి గుర్తింపు కార్డులు పొందాలంటే 18- 59 మధ్య వయసు వారై ఉండాలి. నమోదు చేసుకునే ఏడాదిలో 90 రోజుల పాటు నిర్మాణ రంగంలో పనిచేసి ఉండాలి. కార్మికశాఖ అధికారులకు రూ.110 చెల్లించి గుర్తింపు కార్డు పొందవచ్చు. ఐదేళ్ల తర్వాత రూ.60 చెల్లించి కార్డును రెన్యువల్ చేసుకోవాల్సి ఉంటుంది. ప్రస్తుతం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఈ-శ్రమ్ కార్డును ఉచితంగా అందిస్తున్నాయి. దీనికి నమోదు చేసుకుంటే మేలు.

**ఇవీ ప్రయోజనాలు**

భవన నిర్మాణ కార్మికులు పనిచేసే ప్రదేశంలో మృతి చెందితే రూ.5 లక్షల బీమా పరిహారం అందజేస్తారు. తక్షణ సాయంగా రూ.20 వేలు మంజూరు చేస్తారు. అంగవైకల్యానికి రూ.25 వేల నుంచి రూ.లక్ష వరకు అందజేస్తారు. కార్మికులు సాధారణ మరణం పొందితే కుటుంబ సభ్యులకు రూ.60 వేల సాయం అందుతుంది. మహిళా కార్మికులకు రెండు కాన్పుల నిమిత్తం రూ.20 చొప్పున అందజేస్తారు.

**సాయానికి ఎదురుచూపులు**

కర్నూలు జిల్లా గూడూరులో భవన నిర్మాణం కోసం గుంతలు తీస్తుండగా పక్కనే ఉన్న ప్రహరీ కూలడంతో ఇద్దరు కార్మికుల మృతి చెందారు.

ఇటీవల కర్నూలు నగరంలోని బుధవారపేటలో మూడంతస్తుల భవనం నిర్మాణ పనులకు వెళ్లిన ఓ కార్మికుడు సిమెంటు బస్తాను పైకి తీసుకెళ్తూ అదుపుతప్పి కిందపడి మృతి చెందారు.

ఇలా పలువురు మృతి చెందారు. ఎందరో దివ్యాంగులుగా మారారు. వీరిలో చాలామంది గుర్తింపు పత్రాల్లేక నష్టపోయారు. మరోవైపు గుర్తింపు పత్రాలు కలిగిన కార్మికులు మృతి చెందినా వారి కుటుంబాలకు బీమా సొమ్ము సకాలంలో అందడం లేదు. ఉమ్మడి జిల్లాలో వేలాది కుటుంబాలు ఆర్థిక సాయం కోసం ఎదురు చూస్తున్నాయి.

ఉమ్మడి జిల్లాలో భవన నిర్మాణ కార్మికులు : 1,67,860

ఆర్థిక సాయం కోసం ఎదురు చూస్తున్న కుటుంబాలు : 5,318

**రెండురోజుల్లో కార్డు ఇస్తాం**

– కె.వెంకటేశ్వర్లు, కార్మికశాఖ ఉప కమిషనరు, కర్నూలు జిల్లా

భవన, ఇతర నిర్మాణ కార్మికులు ప్రభుత్వ పథకాలపై అవగాహన పెంచుకోవాలి. కార్మికశాఖ తరఫున అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నాం. గుర్తింపు కార్డు కోసం దరఖాస్తు చేసుకున్న రెండు రోజుల్లో మంజూరు చేస్తున్నాం. ప్రమాదవశాత్తు కార్మికులు మృతి చెందిన సందర్భంలో వారి కుటుంబం పోలీసు కేసు నమోదు చేయిస్తే పరిహారం ఇప్పించేందుకు చర్యలు తీసుకుంటాం.

# సమయం దాటాక విత్తనమా!

కదిరి : ఖరీఫ్‌లో అదునుకు పెట్టే పంటలే చేతికందటం లేదు. అలాంటిది సీజన్ ముగుస్తున్న సమయంలో వర్షాధార సాగుకు అధికారులు సమాయత్తం అవుతున్నారు. నూతన వంగడం.. నాలుగైదు రోజుల్లో ముగుస్తున్న ఖరీఫ్ సాగు సమయం. ఈ తరుణంలో వర్షాకాలం సాగంటూ విత్తనాలు ఇవ్వడమేంటని రైతులు చర్చించుకుంటున్నారు. నూతన వంగడమైన టీసీజీఎస్ 1694 (విశిష్ట) వేరుసెనగను రైతు పొలాల్లో సాగుకు చర్యలు చేపట్టారు. ఈ విత్తనాన్ని ఫార్మర్ ప్రొడ్యూసర్ ఆర్గనైజేసేషన్‌చే సాగు చేయించాలి. ఎంపిక ప్రక్రియ మార్చిలోనే పూర్తవ్వాలి. ఖరీఫ్ సీజన్ ముగుస్తున్న సమయంలో ఎన్జీవోల ప్రమేయంతో పంపిణీకి అధికారులు విత్తనం సరఫరా చేస్తున్నారు. వేరుసెనగ కాయలను పంపిణీ చేసేదెప్పుడు, విత్తనం సిద్ధం చేసుకుని ఎప్పుడు సాగు చేస్తారోనన్న అయోమయం నెలకొంది. దీంతో ఉచిత విత్తన సాగు లక్ష్యం నీరుగారేలా ఉందన్న విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

**డివిజన్‌లో 500 హెక్టార్లు**

కదిరి వ్యవసాయ డివిజన్‌లో 500 హెక్టార్లలో సాగుకు వ్యవసాయశాఖ అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. కదిరి–6 రకం సాగులోకి వచ్చి 23 ఏళ్లు పూర్తయ్యింది. దీని స్థానంలో తెగుళ్లకు తట్టుకుని ఎక్కువ దిగుబడి వచ్చేలా కొత్తరకం వేరుసెనగ సాగును పెంచేలా చర్యలు చేపట్టారు. ఇందుకు టీసీజీఎస్ 1694 వంగడాన్ని పూర్తి ఉచితంగా పంపిణీ చేస్తున్నారు. ఒక్కో రైతుకు హెక్టారుకు 5 బస్తాల చొప్పున విత్తనం అందజేస్తారు. ఇప్పటికే నల్లమాడలో పంపిణీ చేశారు. మిగిలిన మండలాలకు సరఫరా చేస్తున్నారు.

**కొత్తరకంతో సాగు విస్తీర్ణం పెంచటమే లక్ష్యం**



సుబ్బారావు, జిల్లా వ్యవసాయాధికారి

కదిరి–6 రకం స్థానంలో వాతావరణ మార్పులు, చీడపీడలు, దిగుబడి పెంచేలా విశిష్ట రకం విత్తనాన్ని ఉచితంగా ఇస్తున్నాం. ఎఫ్‌పీఓలతో రైతుల గుర్తింపు, సాగు చేయిస్తాం. వ్యవసాయశాఖ పర్యవేక్షణలో పండించే పంటను తిరిగి వెనక్కు తీసుకునేలా రైతులతో ఒప్పందం చేయిస్తున్నాం. ఎక్కడా సమస్యలేదు. కొత్తరకం విత్తనంతో సాగు విస్తీర్ణం పెంచేలా చూస్తున్నాం.

జిల్లా: శ్రీసత్యసాయి

వేరుసెనగ రకం: టీసీజీఎస్ 1694

సాగు విస్తీర్ణం: 1,250 ఎకరాలు

రైతులు: 500

# విశాఖ కేంద్రంగా అద్దె గర్భం అక్రమాలు

విశాఖపట్నం : ఎంతోమంది చిన్నారులను తల్లి ఒడికి దూరం చేశారు. సరోగసీ ఎరవేసి ఎందరో దంపతులను మనోవేదనకు గురి చేశారు. కాసుల కక్కుర్తితో అడ్డదారి తొక్కారు. తల్లీపిల్లల్ని వేరు చేస్తున్నామనే మానవత్వం మరిచారు. తప్పొప్పుల విచక్షణ గాలికొదిలేసి సంతానలేమిని సొమ్ము చేసుకునేందుకు ఎన్నో అక్రమాలకు పాల్పడ్డారు. ఇవీ సికింద్రాబాద్‌లోని సృష్టి యూనివర్సల్ ఫెర్టిలిటీ సెంటర్ నిర్వాహకులు సాగించిన దారుణాలు. పోలీసుల దర్యాప్తులో వెలుగు చూస్తున్న కొత్త విషయాలు కలవరపాటుకు గురిచేస్తున్నాయి. తెలుగు రాష్ట్రాల్లో బాధితులు ఒక్కొక్కరుగా ఫిర్యాదు చేసేందుకు ముందుకొస్తున్నట్టు సమాచారం. రాజస్థాన్‌కు చెందిన దంపతులు సరోగసీ కోసం సృష్టి ఫెర్టిలిటీ సెంటర్‌లోని డాక్టర్ నమ్రతను ఆశ్రయించారు. వారి వద్ద రూ.35లక్షలు వసూలు చేసి సరోగసీ విధానంలో బిడ్డ పుట్టాడంటూ అసోంలో కొనుగోలు చేసిన పిల్లాడిని విక్రయించిన సంగతి తెలిసిందే. ఈ కేసులో గోపాలపురం పోలీసులు 8 మందిని అరెస్ట్ చేశారు. మరో ఇద్దరి కోసం గాలిస్తున్నారు. చంచల్‌గూడ జైలులో రిమాండ్‌లో ఉన్న ప్రధాన నిందితురాలు డాక్టర్ నమ్రత సహా 8 మందిని 7 రోజుల పోలీసు కస్టడీకి కోరుతూ న్యాయస్థానాన్ని ఆశ్రయించారు. వారిని అదుపులోకి తీసుకొని విచారిస్తే 30 ఏళ్లుగా సాగించిన అక్రమాల బాగోతం బయటపడుతుందని పోలీసులు భావిస్తున్నారు. డాక్టర్ నమ్రతతో సహా 8 మంది నిందితులు నాంపల్లి న్యాయస్థానంలో బెయిల్ పిటీషన్ దాఖలు చేశారు.



విశాఖ కేంద్రంగా దందా: సంతానం లేని దంపతులకు హైదరాబాద్, విజయవాడ, విశాఖపట్నం, కోల్‌కతా, ఒడిశాలో సృష్టి ఫెర్టిలిటీ కేంద్రాల్లో వైద్యచికిత్స అందిస్తున్నారు. సికింద్రాబాద్‌లోని ఫెర్టిలిటీ సెంటర్‌కు నాలుగేళ్ల క్రితమే అనుమతి రద్దు చేశారు. అయినా.. దాన్ని నివాస భవనంగా చూపుతూ దందా సాగిస్తున్నారు. సామాజిక మాధ్యమాలు, వెబ్‌సైట్లలో వివరాలు సేకరిస్తూ అద్దెగర్భంతో సంతానం పొందే వీలుందని ఎంతోమంది దంపతుల్లో నమ్మకం కలిగించి రూ.లక్షలు వసూలు చేస్తున్నారు. ఉమ్మడి ఖమ్మం జిల్లాకు చెందిన దంపతులకు వివాహమై 18 ఏళ్లు దాటినా పిల్లలు పుట్టకపోవటంతో 2019లో కేపీహెచ్‌బీ కాలనీలోని యూనివర్సల్ సృష్టి ఫెర్టిలిటీ సెంటర్ నిర్వాహకురాలు డాక్టర్ నమ్రతను ఆశ్రయించారు. వారి వద్ద రూ.13లక్షలు తీసుకొని సరోగసీతో బిడ్డను అందిస్తామంటూ భరోసా ఇచ్చారు. సరోగసీ చికిత్స అందిస్తున్న మహిళ కొవిడ్‌తో మృతి చెందినట్టు బురిడీ కొట్టించారు. ఫెర్టిలిటీ కేంద్రం సాగిస్తున్న మోసాల గురించి తెలిసిన బాధితులు కేపీహెచ్‌బీ ఠాణాలో ఫిర్యాదు చేశారు. అమెరికాలో ఉంటున్న ప్రవాస దంపతుల నుంచి రూ.12లక్షలు తీసుకొని సరోగసీ బిడ్డ పేరుతో విశాఖపట్నంలో కొనుగోలు చేసిన చిన్నారిని చేతికిచ్చారు. డీఎన్ఏ పరీక్షలో అసలు విషయం బయటకు రావటంతో బాధితులు 2015లో పోలీసులకు ఫిర్యాదు చేశారు.

హైదరాబాద్‌లోని కేంద్రాలకు వచ్చిన భార్యాభర్తలకు వైద్యపరీక్షలు నిర్వహించి సరోగసీ కోసం విశాఖపట్నం పంపిస్తున్నారు. అప్పటికే అక్కడికి వచ్చిన నిరుపేద మహిళలు, యువతులను సరోగసీకి సిద్ధంగా ఉన్నట్టు చూపుతారు. దంపతుల నుంచి వీర్యకణాలు, అండాలను సేకరిస్తారు. వాటిని ఏ మహిళ గర్భంలో ప్రవేశపెట్టబోతున్నామనేది వివరిస్తారు. ఏ మాత్రం అనుమానం రాకుండా గర్భంలో ఊపిరిపోసుకుంటున్న బిడ్డకు సంబంధించిన సమాచారం ఎప్పటికప్పుడు కాబోయే తల్లిదండ్రులకు తెలియజేస్తుంటారు. డెలివరీ సమయం ముందుగానే చెప్పి విశాఖపట్నంలో బిడ్డను అప్పగిస్తారు. పిల్లల రూపురేఖలపై అనుమానం వచ్చిన బాధితులు డీఎన్ఏ పరీక్ష చేయించినప్పుడు అక్రమాలు బయటపడుతున్నాయి. తమ బిడ్డలు కాదని తెలిసినా, విషయం బయటకు పొక్కితే శిశువులను కొనుగోలు చేసినందుకు తమపై కేసు నమోదవుతుందనే ఉద్దేశంతో చాలామంది మౌనం వహిస్తున్నట్టు పోలీసు అధికారి తెలిపారు.

# అచ్యుతాపురం

# రోడ్డుకు అక్రమ గ్రావెల్!

అచ్యుతాపురం : అచ్యుతాపురం–అనకాపల్లి రోడ్డు విస్తరణ పనులకు అధికారులు అధికారికంగా ఎక్కడా క్వారీని గుర్తించకపోయినా గ్రావెల్ సరఫరా మాత్రం కొనసాగుతోంది. కొండకర్ల వద్ద 500 మీటర్ల పరిధిలో నమూనా రోడ్డును అభివృద్ధి చేస్తున్న తరుణంలో దీనికి అవసరమైన గ్రావెల్‌ను అక్రమంగా తీసుకొస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. రోడ్డు విస్తరణలో భాగంగా కొండకర్ల వద్ద రోడ్డుకు రెండు వైపులా రక్షణగోడ నిర్మిస్తున్నారు. దీని నిర్మాణానికి కొంత తవ్విన ఎర్రమట్టిని వినియోగిస్తుండగా మరికొంత అక్రమ పద్ధతిలో గ్రావెల్‌ను తీసుకొచ్చి పూడ్పిస్తున్నారని తెలిసింది. ఈ రోడ్డును 100 అడుగుల మేర విస్తరించడానికి అవసరమైన గ్రావెల్‌ను కొండకర్ల కొండ నుంచి తవ్వడానికి అనుమతులు కోసం చేసిన దరఖాస్తు పెండింగ్‌లో ఉందని ఆర్అండ్‌బీ ఏఈ పద్మని తెలిపారు. అనధికారంగా ఎక్కడ నుంచి గ్రావెల్ తీసుకురావడంలేదని రక్షణగోడ కోసం తీస్తున్న గోతుల ద్వారా వచ్చిన మట్టినే వినియోగిస్తున్నామని వివరణ ఇచ్చారు.



# అప్రమత్తతే ప్రాణాలకు రక్ష

అనంతపురం : ముదిగుబ్బ మండలం వట్టికుంటతండాకు చెందిన రమేశ్‌నాయక్ పామిడిలోని ఏడీసీసీ బ్యాంకులో స్టాఫ్ అసిస్టెంట్‌గా పని చేసేవారు. ఈ నెల 19న అనంతపురానికి వచ్చిన ఆయన సాయినగర్ 7వ క్రాస్‌లో ఉన్న ఓ సెలూన్‌కు వెళ్లి కటింగ్, షేవింగ్ చేయించుకున్నారు. ఆ సమయంలో వర్షం కురిసి నీరు పెద్దఎత్తున నిలిచింది. సెలూన్ నుంచి బయటకు వచ్చిన ఆయన నీటిలో రోడ్డు దాటుతూ ఓ ఇనుప పైపును పట్టుకోవడంతో విద్యుదాఘాతానికి గురై మృతిచెందారు. రాయదుర్గం పట్టణంలోని కోట ఏరియాలో ఈ నెల 18న తాపీ మేస్త్రీ ఒకరు కూలీలతో భవన నిర్మాణ పనులు చేయిస్తుండగా ఫోన్ వచ్చింది. ఫోన్‌లో మాట్లాడే క్రమంలో ఆయన విద్యుత్తు తీగలను గమనించకుండా తగలటంతో షాక్‌కు గురై మిద్దెపై నుంచి కిందపడ్డాడు. ఆసుపత్రికి తీసుకెళ్లగా అప్పటికే ప్రాణాలు కోల్పోయినట్లు వైద్యులు ధ్రువీకరించారు.

ఉమ్మడి అనంతపురం జిల్లాలో వరుస విద్యుత్తు ప్రమాదాలు ఆందోళనకు గురి చేస్తున్నాయి. చిన్నపాటి నిర్లక్ష్యం.. అవగాహన లేకపోవడంతో పలువురు విద్యుదాఘాతానికి గురై ప్రాణాలు కోల్పోతుండగా.. మరికొందరు గాయపడుతున్నారు. వర్షాకాలంలో కరెంటు పట్ల అప్రమత్తంగా ఉండాలని విద్యుత్తు అధికారులు సూచిస్తున్నారు.

**ఇవి పాటించాలి..!**

ఉరుములు, మెరుపులతో వర్షం కురుస్తున్నప్పుడు విద్యుత్తు ఉపకరణాలు వాడకూడదు.

ఎలాంటి విద్యుత్తు సర్వీసులైనా ఎర్తింగ్ చేయించుకోవాలి. ప్రతి గదికి ఎంసీబీలు ఏర్పాటు చేసుకోవాలి.

ఐఎస్ఐ, స్టార్‌రేటింగ్ విద్యుత్తు ఉపకరణాలను మాత్రమే వాడాలి.

గృహ సముదాయాల్లో విద్యుత్తు మీటర్లను గ్రౌండ్‌ఫ్లోర్‌లో ఏర్పాటు చేసుకుంటారు. వీటి భద్రత దృష్ట్యా నీరు నిల్వ లేకుండా చూసుకోవాలి.

తెగిపడిన తీగలను, తడిసిన స్తంభాలను, తడి చేతులతో ఉపకరణాలను



ఎట్టి పరిస్థితుల్లోనూ తాకకూడదు.

చిన్నపిల్లలకు స్విచ్‌బోర్డులు అందుబాటులో లేకుండా చూడాలి.

ఉతికిన దుస్తులను ఇనుప తీగలపై ఆరేయొద్దు.

హీటర్ వాడే వారు స్విచ్‌ఆఫ్ చేసి ప్లగ్ తీసిన తరువాతే నీళ్లు పెట్టిన వస్తువును ముట్టుకోవాలి.

విద్యుత్తు లైన్ల కింద ఫోన్‌లో మాట్లాడకూడదు. ఛార్జింగ్ పెట్టి సెల్‌ఫోన్‌లో మాట్లాడొద్దు.

రైతులు, ప్రజలు సొంతంగా విద్యుత్తు పనులు చేయకూడదు. ఉద్యోగులు, టెక్నీషియన్లతో మాత్రమే పనులు చేయించుకోవాలి.

**నివారణకు చర్యలు**

శేషాద్రిశేఖర్, సంపత్‌కుమార్, ఎస్ఈలు, విద్యుత్తుశాఖ, అనంతపురం, శ్రీసత్యసాయి జిల్లాలు విద్యుత్తు సమస్యలు తలెత్తితే 1912 టోల్‌ఫ్రీ నంబరుకు ఫోన్ చేసి ఫిర్యాదు చేస్తే పరిష్కారానికి చర్యలు తీసుకుంటాం. ప్రమాదాలు జరిగే తీరు, నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై లఘు చిత్రాలు తీయించ్చా. పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో కరపత్రాలు అందించి ప్రజలు, రైతులకు అవగాహన కల్పిస్తున్నాం. శాఖ ఉద్యోగుల నిర్లక్ష్యం కారణంగా ప్రమాదం జరిగి ఎవరైనా ప్రాణాలు కోల్పోతే రూ.5 లక్షలు పరిహారం చెల్లిస్తున్నాం.

# శుభ్రత.. బాధ్యత!

నర్సీపటం : పల్లెల స్వచ్ఛతకు కూటమి ప్రభుత్వం అధిక ప్రాధాన్యం ఇస్తోంది. ప్రస్తుతం వర్షాలకు తోడు గ్రామాల్లో అపరిశుభ్రతతో వ్యాధులు ప్రబలుతున్నాయి. ఈ పరిస్థితి ఎక్కడ ఎదురైనా సంబంధిత అధికారులనే బాధ్యులను చేసి చర్యలు తీసుకునేలా ప్రత్యేక కార్యాచరణ అమలవుతోంది. ఏటా వర్షాకాలంలో అతిసారం, మలేరియా, డెంగీ తదితర సీజనల్ వ్యాధులు ప్రబలుతున్నాయి. వీటిని నివారించడంపై పంచాయతీరాజ్ గ్రామీణాభివృద్ధిశాఖ దృష్టి సారించింది. గ్రామాల్లో అంటువ్యాధులు ప్రబలితే సంబంధిత పంచాయతీ కార్యదర్శి, ఉప ఎంపీడీఓలను బాధ్యులను చేస్తామంటూ ఆ శాఖ కమిషనర్ ఇటీవల హెచ్చరించారు. ఈ నేపథ్యంలో జిల్లాలోని గ్రామ పంచాయతీ ఉన్నతాధికారులు వీటి అమలుపై రోజూ సమీక్షిస్తున్నారు. జిల్లాలోని 24 మండలాల్లో 646 గ్రామాలు ఉన్నాయి. వీటన్నింటిలో పారిశుద్ధ్యం, రక్షిత నీటి పథకాల నిర్వహణ పనులను పక్కాగా చేపట్టాలని పంచాయతీలకు ఆదేశాలు జారీ అయ్యాయి. ఉప ఎంపీడీఓలు మండల పరిధిలో డీఎల్‌పీఓలు డివిజన్ పరిధిలో ఊర్లన్నీ సందర్శించి పర్యవేక్షించాలని వీటిలో సూచించారు. రోగాలు ఎక్కువయ్యే చోట సంబంధిత అధికారులు బాధ్యులవుతారని, ఆదేశాలు పాటించని వారిపై క్రమశిక్షణ చర్యలు తప్పవని స్పష్టం చేశారు. ఫలితంగా జిల్లాలోని అన్ని గ్రామాల్లో క్రమంగా పరిశుభ్రతకు బాటలు పడుతున్నాయి. చెత్త కుప్పలతోపాటు వ్యరాలు, కలుషిత నీరు లేకుండా జాగ్రత్తలు తీసుకుంటున్నారు.

**తెల్లవారుజాము నుంచే రోడ్లపైకి**

పారిశుద్ధ్యం మెరుగుకు ఉదయం ఆరు గంటలకే పంచాయతీ కార్యదర్శులు, ఉప ఎంపీడీఓ తమ గ్రామాల్లో పారిశుద్ధ్య సిబ్బందిని పరుగులెట్టిస్తున్నారు. డీపీఓ, డీఎల్‌పీఓ కార్యాలయాల్లోని సిబ్బందికి సైతం ఉన్నతాధికారులు ప్రత్యేక పనులు అప్పగించారు. ఒక్కొక్కరికి ఇరవై మంది పంచాయతీ కార్యదర్శులను కేటాయించారు. వీరు రోజూ ఉదయం చేయించే పనులను వీడియో కాల్ ద్వారా పరిశీలించి నివేదికలు పంపేలా ఏర్పాట్లు చేశారు.

**చాలా మార్పు కనిపిస్తోంది**

జిల్లా కలెక్టర్, డీపీఓ సూచనలు పాటిస్తూ తీసుకుంటున్న చర్యలు ఫలితంగా పారిశుద్ధ్యంలో ఇప్పుడు చాలా మార్పు వచ్చింది. రోడ్డు పక్కన చెత్తకుప్పలను 80 శాతం వరకు తొలగించాం. ఇంటింటి చెత్త సేకరణ పనులు యాభై శాతానికి పైగా మెరుగుపడ్డాయి. సచివాలయంలోని ఇంజినీరింగ్ కార్యదర్శులను బాధ్యులను చేస్తూ శుద్ధమైన తాగునీరు సరఫరాకు చర్యలు తీసుకుంటున్నాం. పల్లెలో దోమల వృద్ధిని కట్టడి చేసే పనులు ముమ్మరమయ్యాయి.మూర్తి, డీఎల్‌పీఓ, నర్సీపట్నం

# గోకివాడ టూ దిల్లీ



పిఠాపురం : కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ పథకాలు అమలు చేయడంలో ముందంజలో ఉన్న పిఠాపురం మండలం గోకివాడ సర్పంచి కీర్తి హరినాథబాబు ఈ ఏడాది దిల్లీ ఎర్రకోట వద్ద జరిగే స్వాతంత్ర్య వేడుకల్లో పాల్గొనే అవకాశం దక్కించుకున్నారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఆధ్వర్యంలో జరిగే ఈ సంబరాలకు మన రాష్ట్రం నుంచి 10 జిల్లాలకు చెందిన సర్పంచులకు అవకాశం కల్పించగా, కాకినాడ జిల్లా నుంచి హరినాథ బాబు ఎంపికైయ్యారు. ఆయన జీవిత భాగస్వామితో కలిసి ఈ నెల 13న ఈ వేడుకలకు హాజరుకావాలని పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ కమిషనర్ వీఆర్ కృష్ణతేజ ఉత్తర్వులు పంపారు. జిల్లా పంచాయతీరాజ్ శాఖ నిధులు నుంచి ఈయన రాకపోకలకు ఖర్చు చేయనున్నారు.

**అవకాశం ఇలా..**

ప్రభుత్వ పథకాలు అమలులో ముందంజలో ఉన్న గ్రామాల సర్పంచులను ఇందుకు ఎంపిక చేస్తారు. ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ ప్రాతినిధ్యం వహిస్తున్న పిఠాపురం నియోజకవర్గం నుంచి గోకివాడ సర్పంచికి ఈ అవకాశం దక్కింది. జలజీవన్ మిషన్, ప్రధాన మంత్రి ఆవాస్ యోజన, ప్రధాన మంత్రి జన్‌ఆరోగ్య యోజన, ప్రధాన మంత్రి మాతృ వందన యోజన, పీఎం విశ్వ కర్మ యోజన, అంగన్‌వాడీ పోషన్ 2.0, కిసాన్ క్రెడిట్ కార్డు, పీఎం సూర్య ఘర్, మిషన్ ఇంద్ర ధనస్సు తదితర పథకాల అమలులో ముందంజలో ఉన్నట్లు గుర్తించి గ్రామాభివృద్ధికి పాటుపడుతున్న సర్పంచిని ఎంపిక చేశారు.

**ఉప ముఖ్యమంత్రి చొరవతోనే..**

ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ పిఠాపురం ఎమ్మెల్యేగా ఎన్నికైనప్పటి నుంచి మా గ్రామం అభివృద్ధి పథంలో నడుస్తోంది. పల్లె పండగ కార్యక్రమంలో భాగంగా రోడ్లు, డ్రెయినేజీలు, శ్మశాన వాటిక అభివృద్ధి, సచివాలయం, పాఠశాలల నిర్మాణం పూర్తయ్యింది. పారిశుద్ధ్య సమస్య మెరుగుపడుతోంది. గ్రామాభివృద్ధికి మరింత కృషి చేస్తాను. కీర్తి హరినాథ బాబు, సర్పంచి, గోకివాడ

# పడవలే ఆధారం..



పి.గన్నవరం : గోదావరి వరద భద్రాచలం వద్ద నెమ్మదించినప్పటికీ కోనసీమ ప్రాంతంలోని నదీపాయల్లో ఇంకా పోటెత్తి ప్రవహిస్తోంది. ధవళేశ్వరం బ్యారేజి నుంచి 6,01,844 క్యూసెక్కుల వరద నీటిని సముద్రంలోకి విడిచిపెట్టారు. బ్యారేజికి సంబంధించి 175 ఫ్లడ్‌గేట్లను 1.0 నుంచి 1.80 మీటర్లు ఎత్తి ధవళేశ్వరం ఆర్మ్ నుంచి 2,59,704 క్యూసెక్కులు, ర్యాలి ఆర్మ్ నుంచి 1,55,242, మద్దూరు ఆర్మ్ నుంచి 81,636, విజ్జేశ్వరం ఆర్మ్ నుంచి 1,05,262 క్యూసెక్కులు చొప్పున విడిచిపెట్టడంతో దిగువన ఉన్న వశిష్ఠ, వైనతేయ, గౌతమి, వృద్ధగౌతమి గోదావరి నదీపాయాల్లో వరద ఉరవడి పెరిగింది. సాయంత్రం ఆరు గంటలకు బ్యారేజి వద్ద 10.90 అడుగుల నీటిమట్టం నమోదైంది. ఖరీఫ్ సాగుకోసం తూర్పుడెల్టాకు 2,200, మధ్యడెల్టాకు 2,050, పశ్చిమడెల్టాకు 5,000 వెరశి 9,250 క్యూసెక్కుల నీటిని పంపిణీ చేస్తున్నారు. కోనసీమలో బూరుగులంక, అరిగెలవారిపేట, జి.పెదపూడిలంక, ఊడుమూడిలంక, పెదమల్లంక, ఆనగార్లంక, మర్రిమూల, అయోధ్యలంక గ్రామాల ప్రజలు మరపడవల్లో రాకపోకలు సాగిస్తున్నారు. లోతట్టు లంకభూముల్లోకి వరద నెమ్మదిగా చేరుతోంది. కనకాయలంకకాజ్‌వే వద్ద వరదపెరిగింది. సోమవారం ఉదయానికి ఈ కాజ్‌వే ముంపు బారినపడే అవకాశం ఉంది. పైనుంచి వరద ప్రవాహం తగ్గుతుండటంతో ఇక్కడ నెమ్మదిగా తగ్గుముఖం పట్టే అవకాశం ఉంది.

**సాగుకు ఇబ్బందులు**

మామిడికుదురు: వైనతేయ నదిలో వరద నీరు పెరగడంతో లంక భూముల్లో వ్యవసాయం చేసుకునే రైతులు ఇబ్బంది పడుతున్నారు. కూరగాయలు, పశుగ్రాసాలు తెచ్చుకునేందుకు పడవలపై వెళ్లి అవస్థలు ఎదుర్కొంటున్నారు. పెదపట్నం, అప్పనపల్లి, పాశర్లపూడి మీదుగా ఆదుర్రు వరకు వరద నీరు పోటెత్తడంతో మత్స్యకారులు పడవలను ఒడ్డునే నిలిపివేశారు. తీరాన్ని ఆనుకుని ఉన్న పాటు రేవుల్లోకి వరద నీరు చేరుతోంది. గోదావరి వరద బొబ్బర్లంక వద్ద ఇళ్లకు చేరువవుతుండటంతో గ్రామస్థులు ఆందోళన చెందతున్నారు. మరింత పెరిగితే లంకలో పంటలు మునిగి దెబ్బతినే ప్రమాదం ఉందని రైతులు అంటున్నారు. వరద తగ్గుముఖం పట్టే అవకాశం ఉందని వరద పర్యవేక్షణ అధికారులు అంటున్నారు.

# పైసలందక.. పనులు సాగక..



ఎమ్మిగనూరు : నెలలు గడుస్తున్నా పైసలు చేతికి రాకపోవడంతో పనులపై గుత్తేదారుల ఆసక్తి సన్నగిల్లుతోంది. ఉమ్మడి జిల్లాలోని పురపాలికల్లో ఆర్థిక సంఘం, సాధారణ నిధులతో చేపడుతున్న పనుల పరిస్థితి అధ్వానంగా మారింది. కొన్నింటికి టెండర్లు పూర్తి చేయగా.. సగం పనులు చేసి వదిలేశారు. కొన్నింటికి టెండర్లు పిలిచినా గుత్తేదారుల నుంచి స్పందన కరవవుతోంది. చాలా చోట్ల ప్రారంభించిన పనులు అసంపూర్తిగా ఉండిపోయాయి. సీసీ రోడ్లు, తాగునీటి సరఫరా, కాల్వల పనులు జరగక పురాల్లో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఈ నేపథ్యంలో ఉమ్మడి జిల్లాల పరిధిలో బిల్లుల బకాయిలు, అసంపూర్తిగా వదిలేసిన పనులపై అందిస్తున్న పరిశీలన కథనం.

**యాప్‌తో చిక్కులు...**

ఎమ్మిగనూరు, నంద్యాల, ఆదోని, డోన్, ఆత్మకూరు, నందికొట్కూర్ మున్సిపాలిటీల పరిధిలో చేపట్టిన పనులకు బిల్లులు చెల్లించకపోవడంతో ఎక్కడి పనులు అక్కడే నిలిచిపోయాయి. పనులు చేపట్టి ఏడాది కావస్తున్నా.. బిల్లులు చెల్లించకపోవడంతో గుత్తేదారులు గగ్గోలు పెడుతున్నారు. ప్రధానంగా నిధి యాప్ ద్వారా పూర్తిగా బిల్లులు రాక అవస్థలు పడుతున్నారు. ఎమ్మిగనూరులో 26 పనులకు రూ.4.50కోట్లు, ఆదోనిలో 35 పనులు పూర్తి చేయగా రూ.5.5 కోట్ల మేరకు చెల్లించాలి.. నంద్యాల, ఇతర మున్సిపాలిటీల పరిధిలో దాదాపు 120 పనులకు రూ.10కోట్లకు పైనే బకాయిలు ఉన్నాయి. మూణ్నెల్లుగా అధికారులు యాప్‌లో అప్‌లోడ్ చేసినా బిల్లులు రాక.. గుత్తేదారులు పనులు వదిలేశారు.

**అసంపూర్తిగా ఉన్న పనులు**

ఎమ్మిగనూరు పట్టణంలో రూ.18లక్షలతో సీసీ రోడ్డు నిర్మించేందుకు టెండర్లు వేశారు. 2023 జనవరిలో పనులకు భూమి పూజ నిర్వహించారు. 300 మీటర్లకు పైగానే సీసీ రోడ్డు వేసేందుకు మట్టి పనులు చేపట్టి కంకర పరిచారు. రెండేళ్లు కావస్తున్నా పనులు చేయకుండా గుత్తేదారు వదిలేశారు. నిర్లక్ష్యం చేస్తున్న గుత్తేదారులపై అధికారులు పట్టించుకోవడం లేదు.

గంజహళ్లి దారి గుంతలు పడటంతో రూ.90లక్షలతో పనులు మంజూరు చేసి గుత్తేదారుడికి అప్పజెప్పారు. కానీ వైకాపా హయంలో చేసిన పనులకు రూ.2కోట్ల మేరకు బిల్లులు పెండింగ్‌లో ఉండడంతో పనులు చేపట్టేందుకు ముందుకు రావడం లేదు. ఏడాది కావస్తున్నా తారు రోడ్డు పనులు చేపట్టలేదు. పాత బిల్లులు వస్తే... కొత్త పనులు చేస్తామని మొండికేశారు. మునెప్పనగర్‌లో రూ.16లక్షలు, మిలటరీ కాలనీ మారెమ్మ దేవాలయం వద్ద రూ.40లక్షలు, సెంట్రల్ లైటింగ్ ఐదు పనులకు దాదాపు రూ.కోటి, రెండో వార్డులో రూ.20లక్షలు, చంద్రయ్యకొట్టాల, వెంకటాపురంలో రూ.30లక్షలు, ఎద్దుల మార్కెట్ సమీపంలో చేసిన పనులకు రూ.30లక్షలు, పట్టణంలో మిగిలిన కాలనీల్లో చేపట్టిన రోడ్లు, ఇతర పనులకు బిల్లులు రాక పట్టణాభివృద్ధి నిలిచిపోయింది.

ఆదోని, నంద్యాల ప్రాంతంలో టెండర్లు పిలిచినా సీసీ రోడ్ల పనులు చేపట్టకుండా వదిలేశారు.

సగంలో వదిలేశారుఎమ్మిగనూరు పట్టణంలో శ్రీనివాస సర్కిల్ నుంచి మెయిన్ రహదారి ఇది. వైకాపా హయాంలో రహదారి అధ్వానంగా ఉంది. కూటమి ప్రభుత్వం వచ్చాక రూ.కోటితో టెండర్లు పిలిచి సుమారు 750 మీటర్ల తారు రోడ్డు నిర్మాణ పనులు చేపట్టారు. మిగిలిన 200 మీటర్ల పనులు వదిలేశారు. ఏడు నెలలుగా బిల్లులు రాకపోవడంతో గుత్తేదారు పనులు వదిలేశారు.

# చినుకమ్మా ఎటు పోతివే!

అనకాపల్లి : జులై నెల ముగింపు దశకొచ్చింది. ఆకాశంలో మబ్బులు కమ్మి.. జోరువానలతో పుడమి పులకించాల్సిన రోజులివి. కానీ ఈ ఏడాది పరిస్థితులు భిన్నంగా ఉన్నాయి. వానలు కురవాల్సిన సమయంలో ఎండలు మండిపోతున్నాయి. వేసవిని తలపించే ఉష్ణోగ్రతలతో జిల్లావాసులు ఉక్కిరిబిక్కిరవుతున్నారు. గతేడాది ఇదే రోజుల్లో వరుణుడు కుంభవృష్టి కురిపిస్తే ఈసారి చిరుజల్లులు పడటమే అరుదైపోయింది. నారు పోసిన రైతన్నలు నీరు కోసం ఆకాశం వైపు ఆశగా ఎదురు చూస్తున్నారు. కర్షకులను వరుణుడు కరుణించడం లేదు. ఆకాశంలో మబ్బులు కమ్ముకోవడం తప్ప చినుకు జాడ కనిపించడం లేదు. ఫలితంగా జిల్లాలో ఖరీఫ్ సీజన్ ముందుకు కదలని పరిస్థితి నెలకొంది. జిల్లాలో అన్ని పంటలు కంటే వరి సాగు అధికం. గతంలో ఎప్పుడూ లేని విధంగా కేవలం ఒక్క శాతమే ఇంత వరకు



నాట్లు వేశారు. జిల్లాలో వరి తర్వాత అధికంగా సాగు చేసేది చెరకు. ఇంతవరకు 37 శాతం విస్తీర్ణంలో సాగు చేశారు. మొక్కజొన్న, నువ్వు, కందులు పరిస్థితీ అదే విధంగా ఉంది. నాట్లు వేసిన పంటలు సైతం నీటి ఎద్దడికి గురవుతున్నాయి. వరి సాగుకు సమయం ఉందని రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని శాస్త్రవేత్తలు చెబుతున్నారు. మే నెల సాధారణ వర్షపాతం 103.7 మి.మీ. కాగా.. 152.2 మి.మీ. పడింది. జూన్‌లో సాధారణ వర్షపాతం 131.1 మి.మీ. కాగా దాదాపు అంతమేర వర్షం పడింది. జులై నెల వచ్చేసరికి పరిస్థితి మొత్తం తారుమారైంది. గతేడాది ఈ సమయానికి వర్షాలు మురిపిస్తే ఈ ఏడాది ఎదురుచూపులతోనే గడిపేయాల్సి వచ్చింది.

**ఎండా కాలంలా ఉంది**

వరి విత్తనాలు సకాలంలో లభించడంతో నారు పోశాం. నారు వేసిన తర్వాత వర్షం సరిగా పడలేదు. నీరు లేక నారు ఎండిపోతుంది. ఏమి చేయాలో తెలియడం లేదు. వర్షాకాలం అయినా ఎండాకాలంలా ఉంది. ఇల్ల అప్పారావు, రైతు, కాకరాపల్లి

జులై నెల సాధారణ వర్షపాతం : 146.9 మి.మీ.
గతేడాది ఇదేనెలలో కురిసింది : 251.2 మి.మీ.
ఈ నెలలో కురిసింది : 62.4 మి.మీ.

# తక్షణ రక్షణకు 'వంద'నం

అనకాపల్లి : శాంతిభద్రతల పరిరక్షణకు.. ఆపద వేళ మేమున్నామని ప్రజలకు భరోసా కల్పించేందుకు పోలీస్‌శాఖ ప్రవేశపెట్టిన డయల్ 100/112తో చాలామంది లబ్ధి పొందుతున్నారు. ప్రజలకు ఏ అవసరం వచ్చినా తక్షణ సాయం అందించడానికి వీలుగా పోలీస్ సిబ్బంది 24 గంటలూ పనిచేస్తున్నారు. 100/112 నంబర్లలో వేటికి ఫోన్ చేసినా వెంటనే సిబ్బంది సకాలంలో సంఘటనా స్థలానికి చేరుకుని సాయం అందిస్తున్నారు. అనకాపల్లి, అల్లూరి సీతారామరాజు జిల్లాలకు సంబంధించి అనకాపల్లి జిల్లా పోలీసు కార్యాలయంలో కంట్రోలు రూం ఏర్పాటుచేశారు. అనకాపల్లి ఎస్పీ తుహిన్‌సిన్హా ఆధ్వర్యంలో ఈ కంట్రోల్ రూంను ఆధునిక హంగులతో తీర్చిదిద్దారు. డయల్ 100/112కి వచ్చే సమస్యలను పరిష్కరించే సమయంలో గతంలో కాలయాపన జరిగేది. దీనిని తగ్గించేలా ఎస్పీ ప్రత్యేక దృష్టి సారించారు. సిబ్బందికి ట్యాబ్‌లు అందించి బాధితులున్న ప్రదేశంతోపాటు సిబ్బంది వెళ్తున్న ప్రాంతం, ప్రయాణిస్తున్న వేగం, సమయంపై ప్రత్యేక పర్యవేక్షణ ఉండేలా సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించారు.

జిల్లాలో 34 పోలీస్ స్టేషన్లు ఉన్నాయి. ఒక్కో స్టేషన్‌లో ముగ్గురు చొప్పున సిబ్బందికి తక్షణ సహాయక చర్యలపై శిక్షణ ఇచ్చారు. వీరు మిగిలిన సిబ్బందికి అవగాహన కల్పిస్తున్నారు. దూరాన్ని బట్టి ఫోన్ చేసిన ఐదు నుంచి 15 నిమిషాల్లోనే పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని సమస్యను పరిష్కరిస్తున్నారు

ఈ ఏడాది జనవరి నుంచి ఇంతవరకు కంట్రోల్ రూంకు 9,025 ఫోన్ కాల్స్ వచ్చాయి. వీటిలో అధికంగా జూదం ఆడటం, వాహనాలు వేగంగా నడపడం, ఈవ్ టీజింగ్, బహిరంగ ప్రదేశాల్లో మద్యం తాగడం, దుర్భాషలాడుతూ తగాదాలకు దిగడం వంటి వాటిపై 4,845 కాల్స్ వచ్చాయి.

ఇంట్లోనుంచి వెళ్లి అదృశ్యం కావడంపై 97, ఆకతాయిల వేధింపులు, అల్లరిమూకల సంచారం, గృహ హింస, భార్యను కొట్టడం వంటివి 1,282 ఫిర్యాదులు వచ్చాయి. కొట్లాటకు సంబంధించి 1,383 ఫోన్‌కాల్స్, చోరీలు, ఆస్తి తగాదాలకు సంబంధించి 488 ఫోన్లు వచ్చాయి. ఇలా వచ్చిన ఫోన్ కాల్స్‌పై సిబ్బంది సకాలంలో సంఘటనా స్థలానికి చేరుకుని సమస్య పరిష్కరించడంతోపాటు అవసరమైతే ఎఫ్ఐఆర్ నమోదు చేస్తున్నారు.

సాంకేతిక పరిజ్ఞానంతో పోలీసుల సేవలు

రోడ్డు ప్రమాదాల్లో క్షతగాత్రులను ఆదుకునేందుకూ పోలీసులు చొరవ చూపుతున్నారు. 16న నంబరు జాతీయ రహదారి వెంబడి 9 పెట్రోలింగ్ వాహనాలు ఉన్నాయి. డయల్ 112కి ఎక్కువగా రోడ్డు ప్రమాదాల సమాచారంపై ఫోన్లు వస్తున్నాయి. దీంతో పెట్రోలింగ్ సిబ్బందికి ప్రథమ చికిత్సపై అవగాహన కల్పించి వీరికి వైద్యులతో శిక్షణ ఇప్పించారు. ప్రమాదం జరిగిన వెంటనే ఆ ప్రదేశానికి చేరుకుని అవసరమైన వారికి ప్రథమ చికిత్స అందించడంతోపాటు వేగంగా ఆసుపత్రికి తరలించేలా చర్యలు తీసుకుంటున్నారు.

పరవాడలోని ఓ ఇంట్లో దొంగ చోరీ చేయడానికి ఇంట్లోకి ప్రవేశించాడు. ఇంటి యజమాని సీసీ టీవీ ద్వారా చూసి విషయం 112కి ఫోన్ చేసి చెప్పాడు. వెంటనే పోలీసులు అక్కడికి చేరుకుని ఆ దొంగను పట్టుకున్నారు. ఇలా ప్రజల్లో చైతన్యం రావడంతోపాటు పోలీసులు ఇస్తున్న భరోసాతో శాంతి భద్రతల పరిరక్షణకు 112 నంబరు ఎంతో ఉపయోగపడుతుంది.

**వేగంగా సేవలు అందించేలా..**

ప్రజలకు పోలీస్ సేవలు వేగంగా అందించేలా ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నాం. ఫోన్ వచ్చిన వెంటనే సంబంధిత స్టేషన్ల సిబ్బందికి అప్రమత్తం చేయడంతోపాటు వారు అక్కడికి వెళ్లే సమయాన్ని సైతం పర్యవేక్షిస్తున్నాం. గతంలో కంటే ఇప్పుడు వేగంగా సంఘటనా స్థలానికి చేరుకునేలా సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించి చర్యలు తీసుకుంటున్నాం. దీనివల్ల చాలావరకు శాంతిభద్రతల సమస్యలకు పరిష్కారం లభించింది.

రమేష్, పోలీస్ కంట్రోల్ రూం సీఐ, అనకాపల్లి




# 20 వేల మంది ఫ్రెషర్ల నియామకం

ప్రముఖ ఐటీ కంపెనీ ఇన్ఫోసిస్ కీలక ప్రకటన చేసింది. ఈ ఏడాది 20 వేలమంది ఫ్రెషర్లను నియమించుకుంటామని ప్రకటించింది. ఈ ఏడాది తొలి త్రైమాసికంలో 17 వేల మందిని నియమించుకున్నామని, మరో 20వేల మంది కాలేజీ గ్రాడ్యుయేట్లను ఈ ఏడాది నియమించుకుంటామని కంపెనీ సీఈఓ సలీల్ పరేఖ్ వెల్లడించారు. ఈ మేరకు ఓ ఆంగ్ల దినపత్రికకు ఇంటర్వ్యూ ఇచ్చారు. ఈ సందర్భంగా ఏఐ, వేతనాల పెంపు వంటి అంశాలపైనా మాట్లాడారు. దాదాపు 12 వేల మంది ఉద్యోగులను తొలగిస్తామన్న టీసీఎస్ ప్రకటన వేళ ఇన్ఫీ నుంచి ఈ ప్రకటన వెలువడడం గమనార్హం. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, నైపుణ్య శిక్షణ వంటి అంశాల్లో ఇన్ఫోసిస్ వ్యూహాత్మకంగా ముందుకెళుతోందని సలీల్ పరేఖ్ పేర్కొన్నారు. ఇప్పటి వరకు వివిధ స్థాయిల్లో ఉన్న 2.75 లక్షల మందికి ఉద్యోగులకు ఆయా విభాగాలలో శిక్షణ ఇచ్చినట్లు చెప్పారు. ఏఐతో ఆటోమేషన్ సాధ్యమవుతుందని, అదే సమయంలో ఉన్నతస్థాయి నైపుణ్యం కలిగిన మానవవనరుల అవసరం కూడా ఉంటుందని తెలిపారు. ఇన్ఫోసిస్ దీర్ఘకాలిక అవసరాల దృష్ట్యా ఉద్యోగుల సంఖ్యను ముమ్ముందు మరింత పెంచుకుంటుందని చెప్పారు.

ఏఐ ఆధారిత ఆటోమేషన్ వల్ల సాఫ్ట్‌వేర్ డెవలప్‌మెంట్ విషయంలో 5 నుంచి 15 శాతం మేర ఉత్పాదకత పెరుగుతోందని సలీల్ పేర్కొన్నారు. నిపుణుల పర్యవేక్షణలో చేపట్టిన ఆటోమేషన్ కారణంగా తమ బ్యాంకింగ్ ప్లాట్‌ఫామ్ ఇన్ఫోసిస్ ఫినాకిల్ 20 శాతం అదనపు ఉత్పాదకత సాధించినట్టు పేర్కొన్నారు. కాబట్టి ఏఐకి నైపుణ్యం కలిగిన మానవ వనరులు తోడైతే మెరుగైన ఫలితాలు వస్తాయన్నారు. వేతన పెంపు గురించిన ప్రశ్నకు.. గత ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన ప్రక్రియ పూర్తయ్యిందని, తదుపరి పెంపు గురించి సరైన సమయంలో వెల్లడిస్తామని పేర్కొన్నారు.




# 'నో హెల్మెట్.. నో పెట్రోల్'

ట్రాఫిక్ నిబంధనల ఉల్లంఘనల్ని నియంత్రించేందుకు మధ్యప్రదేశ్‌లోని ఇండోర్ జిల్లా యంత్రాంగం కీలక చర్యలకు సిద్ధమైంది. ద్విచక్రవాహనదారులు హెల్మెట్ లేకుండా పెట్రోల్ పంపుల వద్దకు వస్తే.. వారికి ఇంధనం నింపేందుకు అనుమతి నిరాకరించనుంది. ఈ నిర్ణయం ఆగస్టు 1 నుంచే అమలులోకి వస్తుందని అధికారులు బుధవారం వెల్లడించారు. మంగళవారం జరిగిన సమావేశంలో రోడ్డు భద్రతా కమిటీ ఛైర్మన్, సుప్రీంకోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ అభయ్ మనోహర్ సప్రే ఆదేశాల మేరకు ఈ ఉత్తర్వులను బుధవారం జారీ చేశారు. ద్విచక్ర వాహనదారులు హెల్మెట్లు ధరించేలా, కార్లలో ప్రయాణించేవారు సీట్ బెల్టులు పెట్టుకొనేలా ఇండోర్‌లో ఓ క్యాంపెయిన్ చేపట్టాలని సప్రే ఆదేశించారు. ఈ ఆదేశాల మేరకు ఆగస్టు 1 నుంచి ద్విచక్రవాహనదారులు హెల్మెట్‌లేకుండా వస్తే పెట్రోల్ బంకుల్లో ఇంధనం నిరాకరించనున్నట్లు ఇండోర్ జిల్లా మెజిస్ట్రేట్ ఆశిష్ సింగ్ తెలిపారు. ఈ ఆదేశాలను ఉల్లంఘిస్తే.. సంబంధిత పెట్రోల్ బంకులపై చట్టపరమైన చర్యలు తప్పవన్నారు. ఏడాది జైలు శిక్ష లేదా రూ.5వేల జరిమానా లేదా రెండూ ఉండే అవకాశం ఉంటుందని హెచ్చరించారు. ఇండోర్ రోడ్లపై ట్రాఫిక్ నిబంధనల ఉల్లంఘనలపై ఇటీవల మధ్యప్రదేశ్ హైకోర్టు తీవ్ర అసహనం వ్యక్తం చేసింది. ఉల్లంఘనులపై కఠిన చర్యలు తీసుకోవాల్సిన అవసరాన్ని గుర్తు చేసిన నేపథ్యంలో ఇండోర్ జిల్లా యంత్రాంగం కఠినచర్యలకు ఉపక్రమించింది.




## పహల్గాం ముష్కరులను
# తప్పించుకోకుండా చేసిన రహస్య టన్నెల్..!

పహల్గాం ఉగ్ర దాడి ముష్కరులను 'ఆపరేషన్ మహాదేవ్' ద్వారా హతమార్చామని కేంద్ర హెూంమంత్రి అమిత్‌షా మంగళవారం లోక్‌సభలో ప్రకటించిన విషయం తెలిసిందే. ఆపరేషన్ సిందూర్‌పై జరిగిన చర్చ సందర్భంగా ఈవిషయాన్ని ఆయన ధ్రువీకరించారు. ఈ దాడిలో పాల్గొన్న ఉగ్రవాదులు చివరిసారిగా ఎం-9, రెండు ఏకే 47 తుపాకులు ఉపయోగించారు. ఆ తర్వాత మూడు నెలల పాటు ఉగ్రవాదులు సులేమాన్, అఫ్గానీ, జిబ్రాన్ ఎవరికంటా పడకుండా దాక్కున్నారు. అయితే.. పాకిస్థాన్ జాతీయులైన వీరు తిరిగి తమ దేశానికి వెళ్లలేకపోయారు. భద్రతా దళాల వ్యూహం కారణంగా వారు తప్పించుకోలేకపోయారు. పహల్గాం దాడి అనంతరం కేంద్ర హెూంమంత్రి అమిత్‌షా, ఉన్నతాధికారులు కశ్మీర్‌కు వెళ్లిన సమయంలోనే ఈ వ్యూహాన్ని రూపొందించినట్లు తెలుస్తోంది. ఎట్టి పరిస్థితుల్లో ముష్కరులు తిరిగి పాకిస్థాన్‌కు వెళ్లకుండా చూడాలని అమిత్ షా భద్రతా బలగాలకు స్పష్టంచేసినట్లు సమాచారం. ఉగ్రవాదులు వినియోగించిన 8 కి.మీ. మార్గాన్ని భద్రతా బలగాలు గుర్తించి.. ఆ ప్రాంతంలో సెక్యూరిటీని కట్టుదిట్టం చేశాయి. ముష్కరులు చొరబాటుకు ఉపయోగించిన ఓ రహస్య టన్నెల్‌ను భద్రతా బలగాలు గుర్తించాయి. ఆ సొరంగాలను వరదలతో ముంచెత్తించారు. దీంతో ఉగ్రవాదులు తప్పించుకునే మార్గం లేకుండా పోయింది. ఆ తర్వాత దళాలు ముష్కరులు ఉన్న ప్రాంతాన్ని ట్రాక్ చేసి.. వారిని మట్టుబెట్టాయి. ఇక 'ఆపరేషన్ మహాదేవ్'లో చనిపోయింది పహల్గాంలో దాడికి పాల్పడిన వారా? కాదా? అనే విషయాన్ని నిర్ధరించుకున్న తర్వాతే పార్లమెంటులో కేంద్ర హెూం మంత్రి అమిత్ షా ప్రకటన చేశారు. "ముగ్గురు ఉగ్రవాదుల నుంచి స్వాధీనం చేసుకున్న ఒక ఎం-9, రెండు ఏకే-47 తుపాకులను సోమవారం రాత్రి ప్రత్యేక విమానంలో శ్రీనగర్ నుంచి చండీగఢ్ పంపాం. అక్కడి కేంద్ర ఫోరెన్సిక్ సైన్స్ ల్యాబ్‌లో పరీక్షలు చేయించాం. ఆ తుపాకుల నుంచి తూటాలు ప్రయోగాత్మకంగా నిపుణులు పేల్చి చూశారు. అనంతరం ఖాళీ తూటాలను.. పహల్గాం వద్ద లభ్యమైన వాటితో పోల్చి చూశారు. పహల్గాం ఊచకోతలో వాడింది ఈ తుపాకులేనని మంగళవారం తెల్లవారుజామున 4.46 గంటలకు ఆరుగురు ఫోరెన్సిక్ నిపుణులు వీడియోకాల్ ద్వారా నాకు తెలియజేశారు" అని అమిత్ షా పేర్కొన్నారు.

# ఆ 2వేలమందికోసం కోర్టు చాలదు..స్టేడియం కావాలి:
## తమిళనాడు ప్రభుత్వంపై సుప్రీం వ్యాఖ్యలు

మాజీమంత్రి సెంథిల్ బాలాజీ కేసు విషయంలో తమిళనాడు ప్రభుత్వంపై సుప్రీంకోర్టు ఆగ్రహం వ్యక్తంచేసింది. ఉద్యోగాల పేరుతో నిరుద్యోగుల నుంచి భారీగా సొమ్ము వసూలు చేశారని బాలాజీపై అభియోగాలు నమోదయ్యాయి. ఈ కేసుపై బుధవారం సుప్రీంకోర్టులో విచారణ జరిగింది. మాజీమంత్రి సెంథిల్ బాలాజీ కేసు విచారణను తమిళనాడు ప్రభుత్వం కావాలని ఆలస్యం చేస్తున్నట్లు కనిపిస్తోందని ఇప్పటికే ఈ కేసు విచారణలో భాగంగా సుప్రీం ఆగ్రహం వ్యక్తంచేసింది. ప్రభుత్వం కేసును మూసివేయడానికి ప్రయత్నిస్తే న్యాయశాఖ అడ్డుకుందని తాజాగా మందలించింది. "ఈ కేసులో 2000 మంది నిందితులు, 500 మంది సాక్షులు ఉన్నారు. భారత్‌లో అత్యధిక మంది విచారణలో పాల్గొన్న కేసు ఇదే అవుతుందేమో. అలాగే ఆ నిందితులందరికీ ఈ కోర్టు గది సరిపోదు.. ఒక క్రికెట్ స్టేడియం కావాలి" అని ఘాటు వ్యాఖ్యలు చేసింది. నిందితుడు, సాక్షుల పూర్తి వివరాలు సమర్పించాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని ఆదేశించింది. అన్నాడీఎంకే హయాంలో సెంథిల్ బాలాజీ రవాణాశాఖ మంత్రిగా ఉన్నారు. ఆ సమయంలో ఉద్యోగాల పేరిట కొందరి నుంచి లంచాలు తీసుకున్నారంటూ ఆయనపై కేసులు నమోదయ్యాయి. ఆ తర్వాత ఆయన డీఎంకేలో చేరి మంత్రి అయ్యారు. పాతకేసులో సెంథిల్ బాలాజీని ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్(ఈడీ) 2023లో అరెస్టు చేసింది. ఏడాదికిపైగా జైల్లో ఉన్న ఆయన గతేడాది బెయిల్‌పై బయటికొచ్చారు. ఆయనను స్టాలిన్ సర్కారు వెంటనే మళ్లీ మంత్రిని చేసింది. ఈ కేసులో సుప్రీంకోర్టు కు చేరడంతో సెంథిల్‌బాలాజీ తన పదవికి రాజీనామా చేసిన సంగతి విదితమే. నిన్నటి విచారణలో.."నాడు ఉద్యోగాల కోసం డబ్బులు ముట్టజెప్పిన 2 వేల మంది నుంచి 2,500 మంది బాధితులను.. లంచాలిచ్చిన వారంటూ రెండు కేసుల్లో నిందితులుగా చేర్చడానికి కారణమేమిటి? వారందరినీ విచారించడం ఎప్పటికి పూర్తవుతుంది?" అని మందలించిన సంగతి తెలిసిందే.

# భారత్ లో పేదలు ఏడు కోట్లేనట!



భారత్ అంటే అభివృద్ధి చెందుతున్న దేశంగానే ఇంకా ఉంది. భారత్ కి స్వాతంత్రం వచ్చి ఇప్పటికి ఏడున్నర దశాబ్దాల కాలం అయింది. భారత్ తో పాటు గా స్వాతంత్ర్యం పొందిన దేశాలు కానీ అదే సమయంలో అభివృద్ధి కోసం ప్రయత్నం చేసిన దేశాలు కానీ చాలా ముందుకు వెళ్ళిన సంగతిని కూడా గుర్తు చేస్తూ ఉంటారు. ఇక భారత్ అభివృద్ధి ఇపుడు వేగంగా సాగుతోందని చెబుతున్న అభివృద్ధి చెందిన దేశం అన్న ట్యాగ్ ఎపుడు దక్కుతుంది అన్నది మాత్రం ఇంకా తెలియడం లేదు. ఇదిలా ఉండగా భారత దేశంలో పేదరికం చాలా ఎక్కువ అని చెబుతారు. ఈ దేశంలో 140 కోట్లకు పైగా జనాభాలో నలభై శాతం పేదలు ఉన్నాయని గతంలో అనేక గణాంకాలు వెల్లడించాయి. అంటే దాదాపుగా యాభై కోట్ల దాకా అన్న మాట. అయితే ఈ పేదరికం ఒక్కసారిగా గాయబ్ అయ్యారని అంటున్నారు. అది ఎవరో చేసిన సర్వే కాదు మరెవరో తయారు చేసిన గణాంకాల నివేదిక కానే కాదు, ప్రపంచ బ్యాంకు ఇచ్చిన ఒక నివేదిక. గడచిన దశాబ్ద కాలంలో భారత్ లో పేదరికం పెద్ద ఎత్తున తగ్గిందని ఆ నివేదిక వెల్లడించింది. ఇక చూస్తే కనుక 2011-12లో 27.1 శాతంగా ఉన్న పేదరికం నుంచి 2022-23 నాటికి 5.3 శాతానికి పేదరికం రేటు పడిపోయిందని పేర్కొంటోంది. ఇక ఈ మధ్య కాలంలో సుమారుగా 26.9 కోట్ల మందికి తీవ్ర పేదరికం నుంచి విముక్తి పొందారని ఆ నివేదిక చెబుతోంది. బహుముఖ పేదరిక సూచీ కూడా 2022-23 నాటికి 15.5 శాతానికి తగ్గుదలగా ఉందని వివరించింది. ఈ మార్పు గ్రామీణ, పట్టణ ప్రాంతాలలో చూసుకుంటే సమానంగా కనిపించడం గమనార్హమని ఈ నివేదికలో పేర్కొంటున్నారు. ఈ నివేదికను ఒక్క సారి పరిశీలిస్తే 2011 నాటికి భారత్ లో 16.2 శాతంగా తీవ్ర పేదరికంలో ఉన్న భారతీయులు అదే 2022-23 నాటికి 2.3 శాతానికి తగ్గారని వివరించింది. అంటే 2011లో 20.59 కోట్ల మంది జనాభా తీవ్ర పేదరికంలో ఉంటే 2022 నాటికి 3.36 కోట్లకు ఆ సంఖ్య తగ్గింది అని చెబుతోంది ఈ నివేదిక. ఇక పల్లెలలో చూసుకుంటే తీవ్ర పేదరికం 18.4 శాతం నుంచి 2.8 శాతానికి తగ్గింది. అదే పట్టణ ప్రాంతాలలో ఇది 10.7 శాతం నుంచి 1.1 శాతానికి పడిపోయిందని ప్రపంచ బ్యాంక్ గణాంకాలు తెలియచేస్తున్నాయి. ఉత్తరప్రదేశ్, మహారాష్ట్ర, బీహార్, పశ్చిమ బెంగాల్, మధ్యప్రదేశ్ రాష్ట్రాలలో తీవ్రమైన పేదరికం తగ్గిందని వివరించి మరీ చెబుతోంది ఈ నివేదిక. ఇలా తీవ్రమైన పేదరికం నుంచి బయటపడడానికి ప్రభుత్వ సంక్షేమ పథకాలు కారణం అని అంటోంది ఈ నివేదిక తద్వారా 25 కోట్లకు పైగా ప్రజలు పేదరికాన్ని జయించడంలో ఈ పథకాలు సహాయపడ్డాయని ఆర్థిక నిపుణులు సైతం విశ్లేషిస్తున్నారు. అయితే ఇక్కడ ఒక విషయం ఉందని అంటున్నారు. భారత దేశంలో తీవ్రమైన పేదరికం నుంచి మాత్రమే ఈ పాతిక కోట్ల మంది బయటపడ్డారు అన్నది ఈ నివేదిక సారాంశం. అంటే సాధారణ పేదరికం అలాగే ఉందని ఈ నివేదికను బట్టి అనుకోవచ్చా అన్నది ఒక సందేహం. ఇక తీవ్రమైన పేదరికం అంటే నిర్వచనం చెప్పలేదు. కానీ కనీసం ఒక పూటకు కూడా పిడికెడు అన్నం దక్కని వారు అని భావించవచ్చు. ఇపుడు వారికి పథకాల పుణ్యమాని అది దక్కుతోంది. అంతే తప్ప వారి ముంగిటి నుంచి పేదరికం ఇంకా వీడలేదు అన్నది కూడా నిపుణులు విశ్లేషణగా ఉంది. ఈ దేశంలో అయిదు నుంచి పది శాతం సంపన్నులు ఉన్నారు. అలాగే ఎగువ మధ్యతరగతి వర్గాలు మరో పది శాతం ఉంటారు. ఈ రెండూ తీసేస్తే మిగిలిన వర్గాలు అన్నీ పేదరికంతోనే ఉన్నాయన్నది ఒక కచ్చితమైన నివేదికగా ఉంది. అంతదాకా ఎందుకు ఈ రోజుకీ ఎనభై కోట్ల మంది ప్రజలను పేదలుగా గుర్తించి ప్రభుత్వాలు దేశవ్యాప్తంగా రేషన్ సరుకులు ఇస్తున్నాయి. అంటే భారత్ లో పేదరికం ఇంకా అలాగే ఉందని వీటిని బట్టి అర్థం అవుతోంది. ఇక ఏడున్నర దశాబ్దాలు అంటే చాలా ఎక్కువ అని అంటున్నారు. మరి తీవ్రమైన పేదరికం నుంచి సాధారణ పేదరికంలోకి రావడానికి ఇంతటి సుదీర్ఘమైన కాలం పడితే అసలు పేదరికం లేని దేశంగా భారత్ ఎపుడు ఆవిర్భవిస్తుంది అన్నదే అతి పెద్ద చర్చగా ఉంది. దీనికి జవాబు కోసం ఇంకా చాలా కాలం చాలా దూరం ప్రయాణించాల్సిందే అని అంటున్నారు మేధావులు.

# వాసన పీల్చి 19ఏళ్ల యువతి మృతి..
# ఏమిటీ 'డస్టింగ్ ఛాలెంజ్'?

సోషల్ మీడియాలో నిత్యం రకరకాల ఛాలెంజ్ లు ట్రెండ్ అవుతుంటాయి! ఈ సమయంలో తాము రాత్రికి రాత్రి ఫేమస్ అయిపోవాలని, సోషల్ మీడియా ట్రెండ్ సెట్టర్స్ గా మారాలని చాలా మంది ఈ ఛాలెంజ్ లను ప్రయత్నిస్తుంటారు.. ప్రాణాల మీదకు తెచ్చుకుంటారు! ఈ క్రమంలో తాజాగా ఓ యువతి ఇలాంటి ఛాలెంజ్ ను స్వీకరించి, ప్రయత్నించి మృతి చెందింది. అవును... ఇప్పుడు సోషల్ మీడియాలో "డస్టింగ్ ఛాలెంజ్" ట్రెండ్ అవుతుంది. ఈ క్రమంలో యువతతో పాటు మైనర్ బాలబాలికల ప్రాణాలతో చెలగాటమాడుతోంది. సోషల్ మీడియాలో ఫేమస్ కావాలనే కోరికతో.. పలువురు ఈ డస్టింగ్ ఛాలెంజ్ ట్రెండ్ ను ఫాలో అవుతున్నారు. ఈ క్రమంలో అమెరికాలోని 19 ఏళ్ల యువతి తాజాగా ప్రాణాలు



కోల్పోయింది. వివరాల్లోకి వెళ్తే.. అమెరికాలో 19 ఏళ్ల యువతి రెన్నా ఓ రూర్కీ తన బాయ్ ఫ్రెండ్ తో కలిసి ఎరోసాల్ కీ బోర్డు క్లీనర్ ను ఆర్డర్ చేసింది. ఆ తర్వాత ఆ కీబోర్డు క్లీనర్ వాసన పీల్చి ఆమె కార్డియాక్ అరెస్టుకు గురైంది. దీంతో.. ఆమె తల్లితండ్రులు హుటాహుటిన ఆమెను ఆస్పత్రికి తరలించారు. ఈ క్రమంలో ఆమె సుమారు నాలుగు రోజులు ఐసీయూలో చికిత్సపొందింది. అయినప్పటికీ నాలుగు రోజులు ప్రాణాలతో పోరాడిన ఆమె చివరికి మృతి చెందింది. ఈ సందర్భంగా స్పందించిన రూర్కీ పేరెంట్స్... తన కుమార్తె ఎప్పుడూ "నేను త్వరలో ఫేమస్ కాబోతున్నాను" అని చెప్పేదని.. ఈ క్రమంలోనే ఆ ఛాలెంజ్ ను ప్రయత్నించినట్లుందని.. అయితే ఇలా జరుగుతుందని మాత్రం తాము అనుకోలేదని విలపించారు. కాగా.. ఈ డస్టింగ్ ఛాలెంజ్ అనేది ఇప్పుడు సోషల్ మీడియాలో ట్రెండింగ్ లో ఉంది. వ్యూస్ కోసం.. ఇళ్లల్లో వినియోగించే క్లీనర్లను వాసన పీల్చడమే ఈ డస్టింగ్ ఛాలెంజ్. అయితే.. ఇది ప్రమాదకరమని తెలియని రూర్కీ.. ఎరోసాల్ కీబోర్డ్ క్లీనర్ వాసన పీల్చి ప్రాణాలు కోల్పోయింది. ఈ ఛాలెంజ్ కు క్రోమింగ్, హఫింగ్ అనే పేర్లు కూడా ఉన్నాయి!

# ఇంగ్లండ్ చీటింగ్ ట్రిక్స్.. బీసీసీఐ కర్మ

భారత్ ను దెబ్బకొట్టాలని ఇంగ్లండ్ స్కెచ్ గీసింది. భారత్ ఏ జట్టుకు ఏమాత్రం ప్రయోజనం లేకుండా కుట్ర చేస్తోంది. తాజాగా ముందుగానే ఇంగ్లండ్ చేరిన భారత ఏ జట్టుకు చుక్కలు చూపిస్తోంది. ఇండియా ఏ Vs ఇంగ్లాండ్ లయన్స్ టెస్టు సిరీస్‌లో పిచ్‌లపై మోసపూరితంగా వ్యవహరిస్తున్నదనే ఆరోపణలతో ఇంగ్లండ్ అండ్ వెల్స్ క్రికెట్ బోర్డు దుమారం ఎదుర్కొంటోంది. ఈ సిరీస్‌లో భారత్ ఏ జట్టుకు మృదువైన పిచ్‌లను మాత్రమే ఇచ్చి, అసలైన ఇంగ్లాండ్ స్వింగ్ పిచ్ లను ప్రధాన మ్యాచ్‌కు మాత్రమే దాచిపెట్టారన్న విమర్శలు ముదిరాయి. ఫలితంగా భారత జట్టు పూర్తి స్థాయిలో సవాళ్లేని, ఫ్లాట్ వికెట్లపై ప్రాక్టీస్ చేస్తోంది.. కానీ అసలు మ్యాచ్ రోజు స్వింగ్ ఉన్న పిచ్‌తో ఇంగ్లాండ్ బౌలర్లు ఒక్కొక్కరినీ వేటాడే అవకాశం ఉందని నెటిజన్లు అంచనా వేస్తున్నారు. ఇది క్రికెట్‌లో హెూం అడ్వాంటేజ్‌ను



కేవలం ప్రయోజనంగా కాకుండా, వ్యూహాత్మకంగా మలచుకుంటున్నదని విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. సోషల్ మీడియాలో పలువురు అభిమానులు బీసీసీఐ పై కూడా ఆరోపణలు చేస్తున్నారు. 2024లో ఇంగ్లాండ్ జట్టు భారత్‌ను సందర్శించినప్పుడు, అప్పుడూ ఇలానే పిచ్‌లను తనకు అనుకూలంగా మార్చుకుందని పేర్కొంటున్నారు. కానీ ఇప్పుడు పరిస్థితి ఆసక్తికరంగా మారుతోంది. ఈ నెల 20న ప్రధాన మ్యాచ్ జరగనున్న నేపథ్యంలో అసలు పిచ్‌లు ఎలా ఉంటాయన్న ఉత్కంఠ పెరుగుతోంది. బీసీసీఐ గతంలో చేసిందని చెబుతూ, %జుజదీ% ఇప్పుడు అదే బాటలో నడవడం నిజమేనా? ఇది కర్మా రూపంగా భావించాలా? అన్నదే ఇప్పుడు సోషల్ మీడియాలో హాట్ టాపిక్‌గా మారింది. ఏమైనా, అసలు మ్యాచులో భారత ఆటగాళ్లు నిజంగా పిచ్ మార్పులతో ఎదురుదాడికి గురవుతారా లేక తమ బ్యాటింగ్ శైలితో ఆ పిచ్‌లను కూడా ఓడిస్తారా అన్నది ఇప్పుడు సర్వత్రా ఉత్కంఠను రేపుతోంది.జూన్ 20న జరగబోయే అసలైన ఫైట్ కోసం దేశవ్యాప్తంగా ఆసక్తి పెరుగుతోంది!

# పదేళ్లలో 18 మంది

వేములవాడ: దక్షిణ కాశీగా పేరొందిన వేములవాడలోని ప్రముఖ పుణ్యక్షేత్రమైన శ్రీ రాజరాజేశ్వరస్వామి ఆలయ కార్యనిర్వహణాధికారి (ఈవో) బాధ్యతలు చేపట్టిన ఏడాదిలోపే బదిలీపై వెళ్లడం చర్చనీయాంశంగా మారింది. ఇటీవల ఆలయ ఈవోగా బాధ్యతలు నిర్వహించిన కె.వినోద్‌రెడ్డి బదిలీపై దేవాదాయశాఖ హైదరాబాద్ కార్యాలయానికి డిప్యూటీ కమిషనర్‌గా వెళ్లారు. ఆయన స్థానంలో వేములవాడ ఆర్డీవోగా విధులు నిర్వహిస్తున్న రాధాబాయి ఈ నెల 13న ఆలయ ఈవోగా అదనపు బాధ్యతలను చేపట్టారు.

**మొదటి నుంచీ ఇంతే..**

మొదటిసారిగా 1956లో ఆలయానికి కార్యనిర్వహణాధికారిని నియమించారు. అప్పటి నుంచి ఇప్పటి వరకు 80 మంది ఈవోలుగా బాధ్యతలు నిర్వహించారు. కొందరు రెండు, మూడు దఫాలుగా బాధ్యతలు నిర్వహించినప్పటికీ వారు సైతం ఏడాదిలోపే బదిలీ అయ్యారు. 1956 నుంచి 1965 వరకు రూప్‌లాల్ ముంతాజియం ఒక్కరే పదేళ్లపాటు ఈవోగా బాధ్యతలు నిర్వహించగా.. మిగిలిన వారిలో ఏ ఒక్కరూ చాలాకాలం పని చేసిన దాఖలాలు లేకపోవడం గమనార్హం. పదేళ్లలో 18 మంది ఈవోలుగా బాధ్యతలు చేపట్టారు. ఈవో రాజేశ్వర్ 2014 నుంచి 2017 వరకు విధులు నిర్వహించారు. అనంతరం 2019 వరకు ప్రత్యేక అధికారిగా బాధ్యతలు చేపట్టారు. క్రిష్ణప్రసాద్ 2020 నుంచి 2022 వరకు తిరిగి 2022 నుంచి 2024 బాధ్యతలు నిర్వహించారు. ఆ తరువాత రామక్రిష్ణారావు కేవలం 36 రోజులు మాత్రమే ఈవోగా ఉన్నారు. ఆ తరువాత వినోద్ కుమార్ నెలపాటు విధులు నిర్వహించిన అనంతరం ఆగస్టు 2024 నుంచి 13 జూన్ 2025 వరకు విధులు నిర్వహించి బదిలీపై వెళ్లారు. 17 జనవరి 2022 నుంచి 9 ఆగస్టు 2022 వరకు స్పెషల్ గ్రేడ్ డిప్యూటీ కలెక్టర్‌గా ఉన్న ఎల్.రమాదేవి ఆలయ ఈవోగా బాధ్యతలు నిర్వహించి ఎనిమిది నెలల్లోనే బదిలీ అయ్యారు.

**పట్టు సాధించేలోపే..**

ఆలయ కార్యనిర్వహణాధికారుల బదిలీల వెనుక అనేక కారణాలున్నా



యని ప్రచారం జరుగుతోంది. పైస్థాయి అధికారుల ప్రమేయం, రాజకీయ ఒత్తిళ్లు, ఆలయంలో ప్రొటోకాల్ వివాదాలు, విజిలెన్స్, ఏసీబీ అధికారుల తనిఖీల్లో వెలుగు చూస్తున్న అవకతవకల వంటివి కారణంగా భావిస్తున్నారు.

స్పెషల్ గ్రేడ్ డిప్యూటీ కలెక్టర్‌గా ఉన్న ఎల్.రమాదేవి ఆలయ ఈవోగా బాధ్యతలు నిర్వహించిన సమయంలో ఆలయంలో అనేక సంస్కరణలు చేపట్టారు. భక్తులకు మెరుగైన సౌకర్యాలు కల్పించేందుకు చర్యలు తీసుకున్నారు. ఉన్న కొద్దికాలంలో భక్తుల ఇబ్బందులు తొలగించేందుకు కృషి చేసి భక్తులు మన్ననలు పొందారు. సంస్కరణలు గిట్టని కొందరు ఆలయ ఉద్యోగులు, నాయకులు ఇక్కడి నుంచి సాగనంపారనే ఆరోపణలు ఉన్నాయి. ఈవోలుగా వచ్చిన వారు ఆలయంలోని వివిధ విభాగాలపై అవగాహనకు వచ్చి పట్టు సాధించేలోపే బదిలీ కాలవడంతో భక్తులకు మెరుగైన సేవలు అందలేకపోతున్నాయనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఇటీవల బదిలీపై వెళ్లిన వినోద్‌కుమార్ పట్టు సాధించి సంస్కరణలు చేస్తున్న క్రమంలో బదిలీ అయ్యారు. ప్రస్తుతం ఆలయ ఈవోగా బాధ్యతలు చేపట్టిన ఆర్డీవో రాధాబాయికి అదనపు బాధ్యతలు అప్పగించారు. అదనపు బాధ్యతలతో వేలల్లో వచ్చే భక్తులకు ఏ మేరకు సేవలు అందుతాయనేది ప్రశ్నార్థకంగా మారింది. ప్రభుత్వం ఆలయానికి ఐఏఎస్ స్థాయి అధికారిని నియమించాలనే డిమాండ్ భక్తుల్లో, స్థానిక నాయకుల్లో వినిపిస్తోంది.

# చెరువులను చెరబట్టారు

పెద్దపల్లి: ఇటుక బట్టీ నిర్వాహకులు చెరువులను చెర బడుతున్నారు. నిబంధనలకు విరుద్ధంగా మట్టిని తరలించి వాటి విధ్వంసానికి పాల్పడుతున్నారు. చెరువులో పూడిక తీస్తున్నారని నీటిపారుదలశాఖ, ప్రభుత్వానికి ఆదాయం వస్తుందని గనులశాఖ, గ్రామానికి చందాలిస్తున్నారని గ్రామాభివృద్ధి కమిటీలు ఉదాసీనంగా వ్యవహరించడంతో ఉమ్మడి జిల్లాలోని చెరువులు రూపం కోల్పోతున్నాయి. యంత్రాలతో తోడటమే కాకుండా, జలాశయాల్లోని మట్టిని పూర్తిగా తరలించేందుకు చెరువుల మధ్యలో రోడ్లు నిర్మించారు. ఎక్కడ, ఎంత లోతులో తీయాలనే అంశాలేవి బట్టీ నిర్వాహకులు పట్టించుకోకపోవడం, అధికారులు పర్యవేక్షణ కొరవడటంతో పర్యావరణానికి తీవ్ర విఘాతం కలుగుతుంది.

**అంతటా అదే దోపిడీ**

ఉమ్మడి జిల్లాలో ఇటుక తయారీ పరిశ్రమకు సంబంధించి పెద్దపల్లి ప్రాంతంలో నాణ్యమైన చెరువు మట్టితోపాటు ఎన్టీపీసీ బూడిద అందుబాటులో ఉండటంతో.. ఈ ప్రాంతంలో 200కుపైగా ఇటుక తయారీ పరిశ్రమలున్నాయి. వీటికి అవసరమైన మట్టిని సమీప చెరువుల నుంచి తరలిస్తున్నారు. ఐదేళ్లుగా ఈ తరలింపు ప్రక్రియ తరుచూ వివాదస్పదమవుతోంది. చెరువులో ఒక మీటరు కంటే ఎక్కువ లోతు మట్టి తీయొద్దనే నిబంధన ఎక్కడ అమలు కావడంలేదు. భారీ యంత్రాలతో తరలించడంతో కనీసం పది నుంచి 20 అడుగుల గుంతలు ఏర్పడుతున్నాయి.

**రెట్టింపు పరిమాణంలో తరలింపు**

తాజాగా పెద్దపల్లి మండలం బొంపల్లిలోని రాచర్లకుంటలో ఏకంగా రోడ్డును నిర్మించి, మట్టిని తరలిస్తున్నారు. వర్షం నీరు చెరువులోకి రాకుండా చుట్టూ కందకాలు తవ్వి, నీటిని బయటకు పంపించేందుకు కచ్చా కాలువలు తవ్వారు. కరీంనగర్, జగిత్యాల, సిరిసిల్ల ప్రాంతాల్లో పరిస్థితి కొంత మెరుగ్గా ఉంది. జమ్మికుంట, హుజురాబాద్, కరీంనగర్ ప్రాంతాల్లో చెరువుల నుంచి అనుమతించిన దాటికంటే రెట్టింపు పరిమాణంలో మట్టిని తరలిస్తున్నారు. వేములవాడ, సిరిసిల్ల ప్రాంతాల్లో చెరువులతోపాటు మానేరు జలాశయం నుంచి కూడా మట్టిని తరలిస్తున్నారు. గతేడాది ఎల్లంపల్లి బ్యాక్‌వాటర్ ప్రాంతం నుంచి మట్టి తరలించడం వివాదానికి దారితీసింది.

**భారీగా వసూళ్లు**

బట్టీ నిర్వాహకుల బలహీనతను ఆసరా చేసుకొని మట్టి ధరను రెట్టింపు చేయడంపై ఉన్న దృష్టి చెరువు పరిరక్షణపై లేకుండా పోతుంది. నిబంధనల ప్రకారం మట్టి లేదా ఇసుకకు క్యూబిక్ మీటర్ చొప్పున రేటు నిర్ణయించి పన్ను వసూలు చేయాల్సి ఉంటుంది. ఈ లెక్కన ఒక్కో టిప్పర్(సుమారు 40 మెట్రిక్ టన్నులు)కు రూ.వెయ్యి వరకు చెల్లిస్తే సరిపోతుంది. అయితే పెద్దపల్లిలో మాత్రం దాదాపు రూ.2700 చొప్పున వసూలు చేస్తున్నారు. ఇదే పరిస్థితి కొనసాగితే చెరువులు బావుల మాదిరిగా మారిపోయి, దిగువకు నీరు వచ్చే పరిస్థితి లేకుండా పోతుంది. చెరువుల్లో మోటార్లు పెట్టుకొని రైతులు సాగు చేసే దుస్థితి వచ్చినా ఆశ్చర్యం కలగకపోవచ్చు.

# ప్రాథమిక బడుల్లో ప్రీప్రైమరీ తరగతులు



కరీంనగర్ : నూతన విద్యాసంవత్సరంలో ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలను బలోపేతం చేసి ప్రవేశాలు పెంచాలనే ఉద్దేశంతో రాష్ట్ర ప్రభుత్వం ఉమ్మడి జిల్లాలోని 81 పాఠశాలల్లో పూర్వప్రాథమిక విద్య తరగతులను ప్రారంభించింది. ఇప్పుడు మరిన్ని పాఠశాలల్లో మొదలు పెట్టాలని సమగ్ర శిక్షా, విద్యాశాఖల ఉన్నతాధికారులు డీఈవోలకు ఉత్తర్వులు జారీ చేశారు. దీంతో తాజాగా 59 ప్రాథమిక పాఠశాలల్లో ప్రీప్రైమరీ తరగతులు ప్రారంభం కానున్నాయి. నర్సరీ, ఎల్‌కేజీ, యూకేజీ తరగతులను బోధించి వచ్చే విద్యాసంవత్సరంలో వారికి 1వ తరగతిలో ప్రవేశాలు కల్పించి విద్యార్థుల సంఖ్యను పెంచుకునేందుకు ఈ విధానాన్ని అమలు చేస్తున్నారు.

ఈ ఏడాది వేసవి సెలవులకు ముందు పూర్వప్రాథమిక విద్య తరగతులు ఏర్పాటు చేయడానికి ఆయా జిల్లాల విద్య, మహిళ, శిశుసంక్షేమ, వైద్య, ఆరోగ్య సంక్షేమ శాఖలు ఇచ్చిన వివరాల ప్రకారం పాఠశాలలను ఎంపిక చేశారు. విద్యాసంవత్సరం ఆరంభంలో పెద్దపల్లి జిల్లాలో 46 పాఠశాలల్లో, జగిత్యాలలో 32, కరీంనగర్‌లో 3 పాఠశాలల్లో ఈ తరగతులను ప్రారంభించారు. రాజన్న సిరిసిల్ల జిల్లాలో మాత్రం ఏర్పాటు కాలేదు. తాజాగా జగిత్యాల జిల్లాలో 15, కరీంనగర్‌లో 19, పెద్దపల్లిలో 12, రాజన్న సిరిసిల్లలో 13 ప్రాథమిక పాఠశాలల్లో ప్రీప్రైమరీ తరగతులను ఏర్పాటుకు అధికారులు శ్రీకారం చుట్టారు.

**ఒక ఇన్‌స్ట్రక్టర్, ఒక ఆయా**

ప్రీప్రైమరీ తరగతుల నిర్వహణ కోసం ప్రతి పాఠశాలకు ఒక ఇన్‌స్ట్రక్టర్, ఒక ఆయాను జిల్లా పాలనాధికారి ఆధ్వర్యంలోని ఎంపికల కమిటీ నియమించాలని రాష్ట్ర సమగ్ర శిక్షా అధికారులు ఉత్తర్వులు జారీ చేశారు.

ఇన్‌స్ట్రక్టర్‌కు ఇంటర్, ఆయాకు 7వ తరగతి విద్యార్హతలు ఉండాలి. పాఠశాలగల హాబిటేషన్, పంచాయతీ పరిధిలోని వారికి ప్రాధాన్యం ఉంటుంది.

ప్రవేశాలు పొందిన బాలల పేర్లు యూడైస్‌లో పొందుపర్చడంతోపాటు మధ్యాహ్న భోజనం, మహిళా శిశు సంక్షేమ శాఖ నుంచి బలవర్ధక ఆహారాన్ని అందిస్తారు.

**నియామకాలతో మేలు**

ఉమ్మడి జిల్లావ్యాప్తంగా గత నెలలో కొత్తగా ఏర్పాటైన 81 పాఠశాలల్లోని ప్రీప్రైమరీ తరగతులకు ఇప్పటివరకు ఇన్‌స్ట్రక్టర్లను ప్రభుత్వం నియమించలేదు. పాఠశాలల్లోని ఉపాధ్యాయులే బోధిస్తుండటంతో వారిపై అదనపు భారం పడుతోంది. అలాగే పాఠశాలల ప్రధానోపాధ్యాయులే వీటి బాధ్యతలను కూడా చూస్తున్నారు. తాజాగా ఉన్నతాధికారుల మార్గనిర్దేశాలతో నియామకాలు చేపడితే పూర్వ ప్రాథమిక విద్యలో చేరిన విద్యార్థులకు ఉపయోగకరంగా ఉంటుంది. అదే విధంగా ప్రవేశాలు కూడా పెరుగుతాయి.

# నిర్లక్ష్యం.. తాగునీటి సరఫరాకు శాపం



సిరిసిల్ల : జ్యోతినగర్ రిజర్వాయర్‌లో చెడిపోయిన షట్టర్ వాల్వును పక్కనపెట్టగా ప్రస్తుతం పని చేస్తున్న వాల్వు నాలుగు వరుసల్లో తిప్పుతూ నడిపిస్తున్నారు. అది కూడా ఏ సమయంలో ఆగిపోతుందో తెలియదు. ఒకటి రిజర్వ్‌లో ఉంచుకోవాల్సి ఉండగా మూడుకు మూడు పని చేయని స్థితిలో ఉన్నాయి. వీటికి మరమ్మతులు చేయాలంటే ఆదిలాబాద్‌కు పరుగులు పెట్టాలి. కనీసం నాలుగు రోజుల సమయం పడుతుంది. కరీంనగర్ నగరపాలక సంస్థ పరిధిలో హైలెవల్ జోన్ పరిధి జ్యోతినగర్ రిజర్వాయర్ నుంచి అన్ని ట్యాంకులకు నీటి పంపిణీ జరుగుతోంది. సుమారు 30 డివిజన్ల ప్రజలకు ఈ రిజర్వాయర్ ద్వారానే తాగునీటి సరఫరా అవుతోంది. అలాంటిచోట ఎప్పటికప్పుడు జాగ్రత్తలు తీసుకోవాల్సి ఉండగా నిర్లక్ష్యం కనిపిస్తోంది. మోటార్లు, వైరింగ్, స్టాటర్లు, ఫ్యూజులు సిద్ధంగా ఉంచుకోవాల్సి ఉంటుంది.

**షట్టర్ మూసుకుంటే నీటి సరఫరా బంద్**

జ్యోతినగర్ రిజర్వాయర్‌లో షట్టర్లు మూసుకుపోతే అంబేద్కర్‌నగర్, జ్యోతినగర్, మల్కాపూర్, ఎస్‌ఆర్‌ఆర్ ట్యాంకుల పరిధిలో నీటి సరఫరా పూర్తిగా బంద్ అవనుంది. ఒకటి మరమ్మతుల కేంద్రంలోనే ఉండగా మరొకటి చెడిపోయింది. ఇంకొకటి అప్పుడో.. ఇప్పుడో అన్నట్లు తయారైంది. ఇప్పటికే తరచూ అంబేద్కర్‌నగర్ రిజర్వాయర్ పరిధిలో చీటికీమాటికి నీటి సరఫరాలో అంతరాయం ఏర్పడుతోంది. ఇంజినీరింగ్ అధికారులు నీటి సరఫరాకు సమస్యలు రాకుండా ముందుగానే ప్రణాళికలు చేయకపోవడం విమర్శలకు తావిస్తోంది.

**కాలిన మోటార్లు కాలినట్లే..**

ఫిల్టర్‌బెడ్ మొదలుకొని పంపింగ్ చేసే రిజర్వాయర్ల వరకు మోటార్లు కాలిపోతే మరమ్మతులు చేయడం లేదు. స్టాండ్‌బై మోటార్లు లేకపోవడం, ఏదైనా కాలితే అప్పటికప్పుడు బిగించి నీటి సరఫరా చేసేలా అదనంగా మోటార్లు ఉండటం లేదు. జ్యోతినగర్ రిజర్వాయర్‌లో మూడు మోటార్లు రోజుల తరబడి మూలనపడి ఉన్నాయి.

**అంతరాయం లేకుండా చర్యలు**

– లచ్చిరెడ్డి, డీఈఈ, కరీంనగర్ నగరపాలిక

నీటి సరఫరాలో అంతరాయం లేకుండా చర్యలు తీసుకుంటాం. షట్టర్లు, మోటార్లు మరమ్మతులు చేయిస్తున్నాం. టెండర్‌లో లేని వాటికి బిల్లులు పెడితే ఆడిట్‌లో ఇబ్బందులు వస్తున్నాయి. దీంతో ఇబ్బందికరంగా ఉంది.

అంబేద్కర్‌నగర్, ఎస్‌ఆర్‌ఆర్, మల్కాపూర్ ట్యాంకులకు నీటిని పంపింగ్ చేయాలంటే మోటార్లు నిరంతరం నడిపించాలి. ప్రస్తుతం అన్ని మోటార్లు నడుస్తుండగా ఏ ఒక్క మోటారు స్టాండ్‌బైలో లేదు. రెండు 40 హెచ్‌పీ మోటార్లు, ఒకటి 30 హెచ్‌పీ మోటార్లు మరమ్మతు చేయకుండా అక్కడే వదిలేశారు. వీటితోపాటు విలీన కాలనీల్లోని మోటార్లు అలాగే నిర్లక్ష్యంగా వదిలేశారు.

# నిబంధనలు సఫలమేనా!



ఖమ్మం : మాతృత్వం, మాధుర్యం.. రెండూ విడదీయలేని పదాలు. అమ్మదనపు కమ్మదనాన్ని అనుభవించేందుకు మహిళలు గర్భందాల్చింది మొదలు ఎన్నో ఇబ్బందుల్ని పంటిబిగువన అణుచుకుంటారు. కంటిలోనే దాచుకుంటారు.. దురదృష్టవశాత్తు దంపతుల్లో తలెత్తే శారీరక సమస్యల కారణంగా సంతానోత్పత్తి కాకపోతే వారి మానసిక వేదన చెప్పనలవి కాదు.. కడుపున పుట్టే బిడ్డతో 'అమ్మా, నాన్న' అనిపించుకోవాలని తపిస్తుంటారు. కనిపించిన దైవాలకూ మొక్కుతుంటారు. అలాంటి దంపతుల బాధలు తీర్చేలా అత్యాధునిక చికిత్సా పద్ధతులు ముందుకొచ్చాయి. దురదృష్టవశాత్తు సంతానలేమితో బాధపడేవారి కాంక్షలను కొన్ని ప్రైవేటు వైద్యశాలలు సొమ్ము చేసుకుంటున్నాయి. సరోగసీ పేరుతో హైదరాబాద్‌లో జరిగిన తాజా ఉదంతం ఇన్‌ఫెర్టిలిటీ కేంద్రాల్లో చీకటి కోణాన్ని వెలుగులోకి తెచ్చింది. విలువలకు తిలోదకాలిచ్చిన ఈ ఘటన తీవ్ర కలకలం రేపింది. ఈ నేపథ్యంలో ఖమ్మం నగరంలో సంతాన సాఫల్య కేంద్రాల పరిస్థితి ఏంటి? అనుమతులు ఎన్నింటికి ఉన్నాయి? నిబంధనలు ఏం చెబుతున్నాయి? అధికారుల పర్యవేక్షణ ఎలా ఉంది తదితర వివరాలతో కథనం.ఖమ్మం నగరంలో ఇన్‌ఫెర్టిలిటీ కేంద్రాల సంఖ్య కొన్నేళ్ల వ్యవధిలో బాగా పెరిగాయి. సంతాన సాఫల్య చికిత్సకు ఖమ్మం చిరునామాగా మారింది. భద్రాద్రికొత్తగూడెం, సూర్యాపేట, మహబూబాబాద్, ఏపీలోని ఎన్టీఆర్ జిల్లాల నుంచి పెద్ద సంఖ్యలో ఇక్కడకు వస్తున్నారు. కొన్ని కేంద్రాలు ధనార్జనే ధ్యేయంగా సేవలందిస్తున్నాయన్న ఆరోపణలున్నాయి. నిబంధనలు ఉల్లంఘిస్తూ బాధితుల నుంచి వసూళ్లే పరమావధిగా ముందుకెళ్తున్నారు. **1 ఏడింటికే అనుమతులు**ఖమ్మం నగరంలో ఏడు కేంద్రాలకు మాత్రమే ఇన్‌ఫెర్టిలిటీ (ఐవీఎఫ్) చికిత్సలకు అనుమతులు ఉన్నట్లు వైద్యారోగ్య శాఖ నిర్ధారించింది. అందులో రెండింటిలో మాత్రమే సరోగసి చికిత్సలకు ప్రభుత్వం అంగీకరించింది. క్షేత్ర స్థాయిలో చూస్తే పదుల సంఖ్యలో కేంద్రాలు పనిచేస్తున్నాయి. అనుమతులు లేకుండా చికిత్స చేస్తున్నా చర్యలేవీ ఉండటం లేదు.

**2.చికిత్స స్థాయి.. తెలిసేదెలా?**

'ఎల్–1' కేంద్రాల్లో టెస్ట్‌ట్యూబ్ ప్రక్రియకు అవకాశం ఉండదు. వాటిల్లో శుక్రకణాలు, అండాలను నిల్వచేయటం సాధ్యపడదు. నగరంలో వీటి సంఖ్య రెండు. మిగిలిన అయిదు ఎల్–2లు. వీటిలో టెస్ట్‌ట్యూబ్ ప్రక్రియకు ఆస్కారం ఉంటుంది. నిజానికి ప్రతి కేంద్రం తమ చికిత్స అర్హతలను బోర్డులపై డిస్‌ప్లే చేయాలి. నిబంధన చాలాచోట్ల అమలు కావటం లేదు.

**3. లెక్కాపత్రం లేదు**

సంతాన సాఫల్య కేంద్రాల్లో ప్రతి నెలా ఎంతమందికి చికిత్స చేస్తున్నారు. ఏ పద్ధతులు అవలంబిస్తున్నారు? సక్సెస్ రేటు ఎంత? ఇవన్నీ జిల్లా వైద్యాధికారుల వద్ద గణాంక రూపంలో ఉండాలి. ఇంతవరకూ వారి వద్ద స్పష్టమైన వివరాలేవీ లేకపోవటం గమనార్హం. దీంతో కొందరు ఇష్టారీతిగా సక్సెస్ రేటు చూపుతూ సొమ్ము చేసుకుంటున్నారు.

**4. తనిఖీలు ఏవి?**

నగరంలోని కేంద్రాలపై ఎక్కడా పటిష్ఠ నిఘా వ్యవస్థ లేదు. ఐవీఎఫ్ సెంటర్లను ఉన్నతాధికారులు తనిఖీ చేయటం లేదు. నిబంధనలు పాటించని, అనుమతుల్లేని వాటిని గుర్తించటం లేదు. ఐవీఫ్ సెంటర్ ఏర్పాటు, పర్యవేక్షణ వేర్వేరు చేతుల్లో ఉండటమే సమస్య. అనుమతుల విషయంలో జిల్లా వైద్యశాఖ బాధ్యత పరిమితం.

**5 .ఇక్కడా మధ్యవర్తులు**సాధారణ వైద్యంతో పోల్చితే ఎక్కువ కమీషన్‌కు ఆస్కారం ఉంటుండటంతో కొందరు గ్రామీణ వైద్యులు చికిత్సలో మధ్యవర్తుల అవతారం ఎత్తుతున్నారు. గోప్యతకు ప్రాధాన్యం ఇచ్చే దంపతుల బలహీనతను సొమ్ము చేసుకుంటున్నారు. కొన్ని ఆసుపత్రులు తామే మధ్యవర్తుల్ని ఏర్పాటు చేసుకుని వారికి రాయితీలు, బహుమతులు ప్రకటిస్తున్నాయి. చికిత్స తీరును బట్టి ఒక్కో కుటుంబం నుంచి రూ.1.2 లక్షల నుంచి రూ.3 లక్షల వరకు ప్యాకేజీ వసూలు చేస్తున్నారు. **6.ఇదేం కౌన్సెలింగ్..**క్లినిక్‌లో తప్పనిసరిగా మానసిక కౌన్సిలర్లు ఉండాలి. ప్రతి సందేహాన్ని వారు నివృత్తి చేయాలి. ఇందుకు భిన్నంగా కొన్నిచోట్ల రోగుల ఆర్థిక సామర్థ్యాన్ని గుర్తించే సాధనంగా వినియోగించుకుంటున్నారు. భార్యాభర్తలను విడివిడిగా కౌన్సెలింగ్ చేస్తూ ఆదాయ వివరాలు రాబడుతూ అందుకనుగుణంగా ఫీజులు వసూలు చేస్తున్నారన్న ఆరోపణలున్నాయి.'సంతాన సాఫల్య కేంద్రాల అనుమతులు మా పరిధిలో ఉండవు. వాటిల్లో అందుతున్న చికిత్సల వివరాలు ఇకమీదట లెక్కిస్తాం. ఆసుపత్రులను తనిఖీలు చేస్తాం. ఎవరైనా బాధితులుంటే నేరుగా ఫిర్యాదు చేయొచ్చు.'కళావతిబాయి, డీఎంహెచ్‌వో

# మీనం మెరవాలె.!

కమ్మర్‌పల్లి : రాష్ట్రంలోనే చేప పిల్లల ఉత్పత్తికి అనువైన ప్రదేశం పోచంపాడ్. ఇక్కడ నెలకొల్పిన జాతీయ చేప పిల్లల ఉత్పత్తి కేంద్ర సామర్థ్యమూ ఎక్కువే. ఏటా రాష్ట్రంలో ప్రథమస్థానంలో నిలుస్తున్న దీనికి మరోసారి భారీ లక్ష్యాన్ని విధించారు. మత్స్యశాఖ అధికారులు తల్లి చేపలను సేకరిస్తూ నీటికుంటల్లో నిల్వ చేస్తున్నారు. భారీ వర్షాలు కురిస్తే జులైలో విత్తనోత్పత్తి చేపడతారు.

**ఎనిమిది కోట్లు.. :** భూవిస్తీర్ణం, నీటి లభ్యతతో పోచంపాడ్ విత్తన చేపకు అనువుగా మారింది. ఈఏడాది 8 కోట్ల స్పాన్, 45 లక్షల అడ్వాన్స్ ఫ్రై లక్ష్యంగా విధించారు. దీనిని సాధించాలంటే జులై మొదటి వారంలోనే ఉత్పత్తి ప్రక్రియ ప్రారంభించాలి. వర్షాలు కురుస్తూ వాతావరణం చల్లగా ఉన్నప్పుడు ప్రక్రియ చేపడితేనే గుడ్డు(సెన) స్పాన్(చిచ్చుర చేప)గా మారుతుంది. వాటిని సిమెంట్ కుండీల్లో వేసి పెంచాలి. పెంచిన చేప పిల్లలు అడ్వాన్స్‌డ్ ఫ్రై(35–40 ఎం.ఎం) సైజులోకి రాగానే మత్స్యకారులకు పంపిణీ చేస్తారు.

**చైనీస్, ఎకో హెచరీలతో.. :** 2016లో రూ.4.30 కోట్ల ఫిష్‌సీడ్ ఫారం నిధులతో కేంద్ర సామర్థ్యాన్ని పెంచారు. 114 పాత సిమెంట్ నర్సరీ(నీటికుండీలు)లకు అదనంగా మరో 140 నిర్మించారు. ఈ కేంద్రంలోని మొట్టమొదటి జార్ హెచరీ లీకేజీలతో నిరుపయోగంగా మారగా, ఈసారి కొత్తగా నిర్మించిన చైనీస్ హెచరీతోపాటు ఎకో హెచరీతో ఉత్పత్తి చేపట్టాలని నిర్ణయించారు. ప్రస్తుతం ఉన్న రెండు యూనిట్ల ఎకో హెచరీలకు అదనంగా నిర్మల్ నుంచి తెచ్చిన మరో



యూనిట్‌ను సిద్ధం చేశారు. ఒక యూనిట్‌లో 30 లక్షల చొప్పున.. మూడింటిలో మొత్తం 90 లక్షలు, చైనీస్ హెచరీలో 50 లక్షల స్పాన్ ఉత్పత్తి చేయాలని అధికారులు నిర్ణయించారు. వీటికి ఆహారంగా తవుడు, పశువుల పేడ, ఇతర పదార్థాలు ఇవ్వాల్సి ఉండడంతో సమకూరుస్తున్నారు.

**1000 కిలోల తల్లి చేపలు**

ఈ ఏడాది కేంద్రానికి భారీ లక్ష్యం విధించడంతో 1000 కిలోల తల్లి చేపలు అవసరం కాగా.. ఇప్పటివరకు బోత్స, రవ్వ, మిరగ, బంగారు తీగ రకాలతో 300 కిలోల తల్లి చేపలను సేకరించారు. మిగతా 700 కిలోలను సమీపంలోని చెరువుల్లో సేకరిస్తున్నారు.

జులైలో ప్రారంభిస్తాం: దామోదర్, మత్స్యశాఖ అధికారి, పోచంపాడ్ ఉత్పత్తికి సన్నాహాలు మొదలయ్యాయి. అన్ని ఏర్పాట్లు చేస్తున్నాం. భారీ లక్ష్యం విధించారు. జులైలో ఉత్పత్తి ప్రక్రియ చేపడతాం. రాష్ట్రంలో మళ్లీ ప్రథమస్థానంలో నిలువడానికి కృషి చేస్తాం.

# భారం.. ఇక దూరం

ఇందల్‌వాయి: నెల వారీగా అద్దె చెల్లించడంలో తీవ్ర జాప్యంతో పలు సంక్షేమ గురుకుల విద్యాసంస్థలకు తాళాలు పడేవి. పాఠశాలల్లో సరైన వసతులు లేనప్పటికీ ప్రిన్సిపాళ్లు యజమానులను గట్టిగా అడగలేని పరిస్థితులుండేవి.. ఇలా చివరకు విద్యార్థులు ఇబ్బందులు పడాల్సి వచ్చేది. మరికొన్నిచోట్ల అద్దె ఒప్పందం ముగియడంతో యజమానులు భవనం ఖాళీ చేయించడంతో నూతన భవనం కోసం అధికారులు నానా కష్టాలు పడేవారు. ఇలాంటి వాటికి ఈ విద్యాసంవత్సరం నుంచి తెర దించాలని సర్కారు తాజాగా నిర్ణయించింది. బోధకులకు వేతనాలతోపాటు గురుకుల భవనాలకు నెలవారీగా అద్దె చెల్లించనున్నట్లు ప్రకటించడంతో ప్రిన్సిపాళ్లు, విద్యార్థుల తల్లిదండ్రులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.**సగం విద్యాసంస్థలు.. :** సామాజిక వర్గాల వారీగా విద్యార్థులకు వసతితో కూడిన ఉచిత విద్యనందించేందుకు అయిదో తరగతి నుంచి డిగ్రీ వరకు గురుకులాలు ఉపయోగపడుతున్నాయి. జిల్లాలో అన్ని కేటగిరీల్లో కలిపి 49 గురుకులాలుంటే.. 24 విద్యాసంస్థలు అద్దె భవనాల్లోనే కొనసాగుతున్నాయి. గ్రామాలు, పట్టణాలు, నగరాల వారీగా సొసైటీలు నెలకు రూ.4 లక్షల నుంచి రూ.10 లక్షల వరకు అద్దె చెల్లిస్తున్నాయి. భవన యజమానులతో చేసుకున్న ఒప్పందం మేరకు రెండేళ్లకోసారి అద్దెలను సవరించాల్సి ఉంటుంది. సంక్షేమ సొసైటీలు బిల్లులను ట్రెజరీ కార్యాలయానికి పంపిస్తున్నా.. పలు ఆంక్షలతో అక్కడే నిలిచిపోతున్నాయి. ఫలితంగా రూ.కోట్లలో అద్దె బకాయిలు పేరుకుపోతున్నాయి. ఇలాంటి సమస్యలకు చెక్ పెట్టేందుకు రాష్ట్ర ప్రభుత్వం సన్నాహాలు ప్రారంభించింది.

**వసతులు మెరుగవుతాయి..**ఇటీవల నిర్వహించిన సమావేశంలో ఉన్నతాధికారులు నెలవారీగా బోధకుల వేతనాలతో పాటే భవనాల అద్దె చెల్లించాలని నిర్ణయించారు. ఇది అమలైతే ప్రిన్సిపాళ్లపై చాలా వరకు భారం తగ్గుతుంది. నెలవారీగా అద్దె చెల్లిస్తే యజమానులను సైతం వసతులు కల్పించాలని డిమాండ్ చేయవచ్చు.

పూర్ణచంద్రరావు, జోనల్ అధికారి, సాంఘిక సంక్షేమ గురుకులాలు

## పర్యావరణంపై అవగాహనకు ఎకో క్లబ్‌లు

కామారెడ్డి : పర్యావరణ హితానికి విద్యార్థులు అడుగులు వేస్తున్నారు. పుడమి తల్లిని రక్షించుకోవడానికి పాటుపడుతున్నారు. విద్యాశాఖ ఆధ్వర్యంలో పర్యావరణంపై మరింత అవగాహన కల్పించేందుకు ఈ నెల 20వ తేదీ నుంచి వారం రోజుల పాటు వివిధ కార్యక్రమాలు నిర్వహించాలని నిర్ణయించారు. బడుల్లో మరిన్ని ఎకో క్లబ్‌ల ఏర్పాటుకు చర్యలు చేపట్టనున్నారు. కేంద్ర సర్కారు 'మేరి లైఫ్' పథకంలో భాగంగా ఈ ఏడాది కూడా పర్యావరణం– వనరుల పునర్వినియోగం పేరిట కార్యక్రమాలను నిర్వహించనున్నారు.**నిత్యం ఒక్కో అంశం ఆధారంగా..**

ఉమ్మడి జిల్లాలో 2,247 ప్రభుత్వ బడులు ఉన్నాయి. ఇందులో 1.56 లక్షల మంది విద్యార్థులు అభ్యసిస్తున్నారు. ప్రభుత్వ ఉన్నత పాఠశాలల్లో హరిత క్లబ్‌ల ఆధ్వర్యంలో పర్యావరణ పరిరక్షణ కార్యక్రమాలను నిర్వహించేందుకు అధికార యంత్రాంగం చర్యలు చేపడుతోంది. నిత్యం ఒక్కో అంశం ఆధారంగా కార్యక్రమాలను చేపట్టనున్నారు. వివిధ బడుల్లో చేపట్టే కార్యక్రమాల చిత్రాలు, దృశ్యాలు చిత్రీకరించి విద్యాశాఖకు పంపాల్సి ఉంటుంది. పాఠశాల, మండల స్థాయిలో పంచాయతీరాజ్, వ్యవసాయ, అటవీశాఖల సమన్వయంతో స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులతో కలిసి సమావేశాలు ఏర్పాటు చేయాలి.

**నాటిన మొక్కలకు పేర్లు** బడుల్లో పర్యావరణ పరిరక్షణకు నాటిన మొక్కలను తల్లిలా భావించి సంరక్షించాలని అధికారులు సూచించారు. ప్రతి విద్యార్థి నాటిన మొక్కకు తల్లి పేరు పెట్టాలని పేర్కొన్నారు. పర్యావరణ హితంలో భాగంగా విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించనున్నారు. విద్యార్థికి తెలిసిన మొక్కపై ప్రత్యేక వ్యాసం రాయాల్సి ఉంటుంది.



# తెలంగాణలో పార్టీ మారిన ఎమ్మెల్యేలపై 3 నెలల్లోపు నిర్ణయం తీసుకోవాలి

దిల్లీ: తెలంగాణలో పార్టీ మారిన ఎమ్మెల్యేల అనర్హత వేటు పిటిషన్‌పై సుప్రీంకోర్టు కీలక తీర్పు వెలువరించింది. ఈ వ్యవహారంలో తెలంగాణ హైకోర్టు డివిజన్ బెంచ్ ఇచ్చిన తీర్పును సుప్రీంకోర్టు కొట్టివేసింది. అనర్హత పిటిషన్లపై 3 నెలల్లోపు స్పీకర్ నిర్ణయం తీసుకోవాలని సీజేఐ జస్టిస్ బీఆర్ గవాయ్ నేతృత్వంలోని ధర్మాసనం ఆదేశాలు జారీ చేసింది. పార్టీ మారిన ఎమ్మెల్యేలపై న్యాయస్థానమే అనర్హత వేటు వేయాలన్న విజ్ఞప్తిని సర్వోన్నత న్యాయస్థానం తోసిపుచ్చింది. 'ఆపరేషన్ సక్సెస్.. పేషెంట్ డైడ్' అన్న సూత్రం వర్తించకూడదని వ్యాఖ్యానించింది. ఏ ఎమ్మెల్యే అయినా స్పీకర్ ప్రక్రియను పొడిగించాలని అడగకూడదు.. అలా చేస్తే స్పీకర్ ప్రతికూల నిర్ణయాలు తీసుకోవచ్చని సుప్రీంకోర్టు సూచించింది. రాజకీయ ఫిరాయింపులు జాతీయ స్థాయిలో చర్చనీయాంశంగా మారిందని, అరికట్టకపోతే.. ప్రజాస్వామ్యాన్ని దెబ్బతీసే శక్తి దానికి ఉందని తీర్పులో ధర్మాసనం అభిప్రాయపడింది. వివిధ సందర్భాల్లో ఈ అంశంపై పార్లమెంట్‌లో చేసిన ప్రసంగాలను కూడా పరిశీలించామని సీజేఐ తెలిపారు. "రాజేష్ పైలట్, దేవేంద్రనాథ్ మున్షీలా.. అనర్హత చర్యలపై స్పీకర్ నిర్ణయం తీసుకోవడం కోర్టుల ముందు జాప్యాన్ని నివారించడమే. పార్టీ మారిన వారిపై చర్యలు తీసుకునే అధికారం స్పీకర్‌కు కట్టబెట్టారు. ఆర్టికల్స్ 136, 226, 227 లకు సంబంధించి న్యాయ సమీక్ష అధికారాలు చాలా పరిమితంగా ఉన్నాయి. తెలంగాణ హైకోర్టు సింగిల్ జడ్జి ఆదేశాల్లో జోక్యం చేసుకోలేమని డివిజన్ బెంచ్ తప్పు చేసింది. స్పీకర్ ఒక న్యాయనిర్ణేత అధికారిగా వ్యవహరిస్తూనే హైకోర్టు, సుప్రీంకోర్టు అధికార పరిధికి లోబడి ఉండే ట్రైబ్యునల్‌గా వ్యవహరిస్తారు. స్పీకర్ అలా వ్యవహరిస్తూనే రాజ్యాంగపరమైన రక్షణని పొందలేరు. తెలంగాణ హైకోర్టు డివిజన్ బెంచ్ ఇచ్చిన తీర్పును పక్కన పెడుతున్నాం. ఒక ముఖ్యమైన నిర్ణయంలో శాసనసభ స్పీకర్లు ప్రజాస్వామ్యానికి ప్రమాదం కలిగించే ఫిరాయింపుదారులపై చర్యలు తీసుకునే విషయంలో ఆలస్యం చేస్తారు. కాబట్టి, పార్టీ ఫిరాయింపు నిరోధక చట్టం కింద ఎమ్మెల్యేల అనర్హతపై ప్రస్తుతం ఉన్న యంత్రాంగాన్ని పార్లమెంటు సమీక్షించాలి. ఇలాంటి చర్యలు ఏళ్ల తరబడి సాగడం వల్ల అర్థరహితంగా మారుతుంది" అని సుప్రీంకోర్టు అభిప్రాయపడింది. పార్టీ మారిన 10 మంది ఎమ్మెల్యేలను అనర్హులుగా ప్రకటించాలంటూ తాము దాఖలు చేసిన అనర్హత పిటిషన్లపై స్పీకర్ నిర్దిష్ట గడువులోగా నిర్ణయం తీసుకొనేలా ఆదేశాలు జారీ చేయాలని కోరుతూ భారత రాష్ట్ర సమితి, ఆ పార్టీ కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్, ఎమ్మెల్యేలు పాడికౌశిక్‌రెడ్డి, కేపీవివేకానంద, జి.జగదీశ్‌రెడ్డి, పల్లారాజేశ్వర్‌రెడ్డి, చింతా ప్రభాకర్, కల్వకుంట్ల సంజయ్, భాజపా శాసనసభాపక్ష నాయకుడు ఏలేటి మహేశ్వర్‌రెడ్డి వేర్వేరుగా సుప్రీంకోర్టులో పిటిషన్లు దాఖలు చేశారు. ఈ ఏడాది జనవరి 15న దాఖలు చేసిన పిటిషన్లు సుప్రీంకోర్టులో తొమ్మిదిసార్లు విచారణకు వచ్చాయి. జస్టిస్ బీఆర్ గవాయ్, జస్టిస్ ఆగస్టిన్ జార్జ్ మసీహ్‌లతో కూడిన ధర్మాసనం అన్నిపక్షాల వాదనలు విన్న తర్వాత ఏప్రిల్ 3న తీర్పును రిజర్వు చేసింది. ఇందులో ప్రతివాదులుగా తెలంగాణ శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్, ఎమ్మెల్యేలు పి.శ్రీనివాసరెడ్డి, బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి, కాలె యాదయ్య, టి.ప్రకాశ్ గౌడ్, ఎ.గాంధీ, గూడెం మహిపాల్‌రెడ్డి, ఎం.సంజయ్‌కుమార్‌లు ఉన్నారు. సుదీర్ఘ వాదనల అనంతరం ఇవాళ తీర్పు వెలువడింది.



# ఎట్టకేలకు బోనులో చిక్కిన చిరుత

హైదరాబాద్: రాజధాని శివారు గండిపేట, మొయినాబాద్, షేక్‌పేట మండలాల్లో స్థానికులకు నిద్రలేకుండా చేసిన చిరుత ఎట్టకేలకు చిక్కింది. దాదాపు 20 రోజులుగా సురక్షిత ప్రాంతాలను ఎంచుకొనే క్రమంలో సంచరిస్తూ అటవీ అధికారులకు సవాల్ విసిరిన చిరుత.. మంచిరేవుల ఫారెస్ట్ టెక్ పార్క్‌లో ఏర్పాటు చేసిన బోనులో చిక్కింది. కాసేపట్లో అటవీశాఖ అధికారులు చిరుతను జూపార్క్‌కు తరలించనున్నారు.




# యూపీఐ లావాదేవీలు.. పేమెంట్ అగ్రిగేటర్లకు షాక్..!

## యూపీఐ లావాదేవీలు.. పేటీఎం, గూగుల్‌పేకు ఐసీఐసీఐ షాక్

యూపీఐ ఆధారిత లావాదేవీల వినియోగం రోజురోజుకూ పెరుగుతోంది. గల్లీ దుకాణాల దగ్గర్నుంచి మాల్స్ వరకు ప్రతిచోటా గూగుల్ పే, పేటీఎం, ఫోన్ పే లావాదేవీలే జరుగుతున్నాయి. దీంతో ఆయా పేమెంట్ అగ్రిగేటర్లపై ఛార్జీలు వసూలుచేసేందుకు సిద్ధమైంది ప్రైవేటు బ్యాంకింగ్ దిగ్గజం ఐసీఐసీఐ. యూపీఐ లావాదేవీలను ప్రాసెస్ చేస్తున్న పేమెంట్ అగ్రిగేటర్లపై ఛార్జీలు విధించనుంది.

ఆగస్టు 1వ తేదీ నుంచే ఈ ఫీజులు వసూలుచేయనున్నట్లు ఆంగ్ల మీడియాలో కథనాలు వెలువడుతున్నాయి. దీనిపై ఈనెల ఆరంభంలోనే పేమెంట్ అగ్రిగేటర్లకు ఐసీఐసీఐ బ్యాంక్ సమాచారమిచ్చినట్లు సదరు కథనాలు పేర్కొన్నాయి. ఐసీఐసీఐలో ఎస్క్రో ఖాతాను నిర్వహించే అగ్రిగేటర్ పై ప్రతి లావాదేవీకి 2 బేసిస్ పాయింట్ల చొప్పున గరిష్ఠంగా రూ.6 వరకు ఛార్జీలు విధించనుందట. ఇక, ఎస్క్రో ఖాతా లేనివారైతే.. ఈ ఛార్జీలు రెట్టింపు కానున్నాయి. అంటే ప్రతి లావాదేవీకి 4 బేసిస్ పాయింట్ల చొప్పున గరిష్ఠంగా రూ.10 వరకు ఫీజులు వసూలుచేయనున్నట్లు సమాచారం.

**కళ్లతో చెల్లింపులు చేయొచ్చు.. పిన్ అవసరం లేదు...** ఈ ఛార్జీలతో ఐసీఐసీఐ బ్యాంక్ ఉన్న మర్చెంట్స్‌పై ఎలాంటి అదనపు భారం పడదు. కేవలం ఆన్‌లైన్, ఆఫ్‌లైన్ మర్చంట్స్ కోసం డిజిటల్ పేమెంట్లు నిర్వహించే పేమెంట్ అగ్రిగేటర్లపై మాత్రమే ఛార్జీలు ఉండనున్నట్లు ఐసీఐసీఐ తమ నోటీసుల్లో పేర్కొన్నట్లు తెలుస్తోంది. యూపీఐ లావాదేవీల నిర్వహణకు సంబంధించి నేషనల్ పేమెంట్స్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియాకు చెల్లించాల్సిన మొత్తాన్ని ఇప్పటివరకు ఐసీఐసీఐ బ్యాంకు భరిస్తోంది. ఈ క్రమంలోనే ఖర్చుల భారాన్ని తగ్గించుకునేందుకు బ్యాంకు ఈ ఛార్జీలు విధిస్తోన్నట్లు సంబంధిత వర్గాలు వెల్లడించాయి. సాధారణంగా యూపీఐ ఆధారిత డిజిటల్ చెల్లింపులపై ప్రస్తుతం ఎలాంటి ఛార్జీలు లేవు. అయితే, అధిక విలువైన డిజిటల్ లావాదేవీలను నిర్వహించేందుకు ఖర్చులు పెరుగుతున్నాయని బ్యాంకులు, చెల్లింపు సేవా సంస్థలు కొంతకాలంగా ఆందోళన వ్యక్తం చేస్తున్నాయి. ఈ నేపథ్యంలోనే ఈ లావాదేవీలపైనా మర్చంట్ ఛార్జీలను ప్రవేశపెట్టనున్నట్లు ఇటీవల వార్తలు రాగా.. కేంద్రం వాటిని కొట్టివేసింది. అయితే, గతవారం రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా గవర్నర్ సంజయ్ మల్హోత్రా మాట్లాడుతూ.. యూపీఐ లావాదేవీలపై ఛార్జీలు ఉండాలని అభిప్రాయపడ్డారు. "ఇది ఎప్పటికీ ఉచితంగా ఉండకూడదు. దీనిపై ఛార్జీలు అవసరం. ఎవరో ఒకరు వాటిని భరించాలి" అని అన్నారు. మూడేళ్ల ముందు వరకు యూపీఐ ఆధారిత చెల్లింపులను ప్రాసెస్ చేసేందుకు వ్యాపారులు కొంతమొత్తం ఛార్జీలను బ్యాంకులకు కట్టాల్సి వచ్చేది. అది కూడా ఒక శాతం లోపే ఉండేది. అయితే, యూపీఐ చెల్లింపులపై ఈ ఎండీఆర్ ఛార్జీలను 2022లో కేంద్రం తొలగించింది. అనంతరం ఈ ప్రాసెసింగ్ ఖర్చులను భర్తీ చేసేందుకు బ్యాంకులు, ఫిన్‌టెక్ కంపెనీలకు కేంద్రం సబ్సిడీలు ఇస్తూ వస్తోంది.



# విచారణ నివేదికను సమర్పించిన కాళేశ్వరం కమిషన్

హైదరాబాద్: కాళేశ్వరం ఆనకట్టలకు సంబంధించి విచారణ నివేదికను జస్టిస్ పీసీ ఘోష్ కమిషన్ సమర్పించింది. నీటి పారుదల శాఖ ముఖ్య కార్యదర్శి రాహుల్ బొజ్జాకు నివేదిక అందజేసింది. 2024 మార్చి 14న కమిషన్‌ను తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసింది. ఈ కమిషన్ 15 నెలల పాటు మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల ఆనకట్టలకు సంబంధించి విచారించింది. 115 మందిని విచారణ చేసి సాక్ష్యాలు నమోదు చేసింది. కమిషన్ నివేదికతో రాహుల్ బొజ్జా సచివాలయానికి బయల్దేరారు. ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావుకు నివేదిక అందించనున్నారు. కాళేశ్వరం ఎత్తిపోతల పథకంలో భాగంగా నిర్మించిన మేడిగడ్డ బ్యారేజీ 2023 ఆఖర్లో కుంగడం, పియర్స్ దెబ్బతినడంతో పాటు అన్నారం, సుందిళ్ల బ్యారేజీల్లో సీపేజీ సమస్యలు ఉత్పన్నమయ్యాయి. 2023 డిసెంబరులో రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం... మేడిగడ్డ బ్యారేజీ దెబ్బతినడం, మిగిలిన బ్యారేజీల్లో సీపేజీ సమస్యలు ఏర్పడటంపై విజిలెన్స్ విచారణతోపాటు నేషనల్ డ్యాం సేఫ్టీ అథారిటీ(ఎన్డీఎస్ఏ)తో అధ్యయనం చేయించింది. లోపాలు తీవ్రంగా ఉన్నట్లు విజిలెన్స్ ప్రాథమిక నివేదిక సమర్పించింది. అసెంబ్లీలో చర్చ సందర్భంగా న్యాయ విచారణకు ఆదేశిస్తామని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రకటించడంతోపాటు వెంటనే కమిషన్ ఏర్పాటుకు ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ హైకోర్టు మాజీ ప్రధాన న్యాయమూర్తి, సుప్రీంకోర్టు విశ్రాంత న్యాయమూర్తి, భారతదేశ మొదటి లోక్‌పాల్‌గా 2019 నుంచి 2022 వరకు పనిచేసిన జస్టిస్ పీసీ ఘోష్ నేతృత్వంలో 2024 మార్చిలో కమిషన్‌ను ఏర్పాటు చేసింది. జులై ఆఖరులోగా నివేదిక ఇవ్వాలని పేర్కొంది. అయితే కమిషన్ ఏర్పాటు ఉత్తర్వులు జస్టిస్ ఘోష్‌కు ఏప్రిల్‌లో అందగా, మే నెల నుంచి కార్యకలాపాలు ప్రారంభించారు. మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బ్యారేజీలను పరిశీలించడంతోపాటు ఎక్కువ మందిని విచారించాల్సి రావడం, క్రాస్ ఎగ్జామినేషన్, విజిలెన్స్, ఎన్డీఎస్ఏ నివేదికల పరిశీలన.. ఇలా పలు కారణాలతో కమిషన్ గడువును ప్రభుత్వం పొడిగిస్తూ వచ్చింది. ఇవాళ జస్టిస్ పీసీ ఘోష్ తన నివేదికను ప్రభుత్వానికి సమర్పించారు.

## పార్టీ ఫిరాయింపులపై సుప్రీం తీర్పు.. మంచి పరిణామం: రామచందర్‌రావు



హైదరాబాద్: పార్టీ మారిన ఎమ్మెల్యేల అనర్హత వేటు పిటిషన్‌పై సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పుపై తెలంగాణ భాజపా అధ్యక్షుడు రామచందర్‌రావు స్పందించారు. అనర్హత పిటిషన్లపై స్పీకర్ 3 నెలల్లోగా నిర్ణయం తీసుకోవాలన్న తీర్పును తాము స్వాగతిస్తున్నట్లు చెప్పారు. ఈ తీర్పు మంచి పరిణామమన్నారు. భారత రాష్ట్ర సమితి, కాంగ్రెస్‌లు పార్టీ ఫిరాయింపులను ప్రోత్సహించాయని విమర్శించారు. కాంగ్రెస్ చేపట్టనున్న జనహిత పాదయాత్రపై రామచందర్‌రావు స్పందిస్తూ.. ఆ పార్టీ జనహిత పాదయాత్ర చేస్తోందో? జనాల్ని మోసం చేసే పాదయాత్ర చేస్తుందో చెప్పాలన్నారు. ఆరు గ్యారెంటీలు, డిక్లరేషన్లు, కాంగ్రెస్ మ్యానిఫెస్టోలో ఇచ్చిన హామీల్లో ఎన్ని నెరవేర్చిందో తెలుపుతూ శ్వేతపత్రం విడుదల చేయాలని డిమాండ్ చేశారు. శ్వేతపత్రం విడుదల చేస్తేనే కాంగ్రెస్‌కు పాదయాత్ర చేసే నైతిక హక్కు ఉంటుందన్నారు. అన్ని వర్గాలను కాంగ్రెస్ మోసం చేస్తోందని విమర్శించారు.

## ఎమ్మెల్యేల అనర్హతపై స్పీకర్‌కు సుప్రీంకోర్టు సూచనలు మాత్రమే చేసింది: అద్దంకి దయాకర్



హైదరాబాద్: ఎమ్మెల్యేల అనర్హతపై స్పీకర్ అధికారాలను సుప్రీంకోర్టు ప్రశ్నించలేదని, కేవలం సూచనలు మాత్రమే చేసిందని కాంగ్రెస్ ఎమ్మెల్సీ అద్దంకి దయాకర్ అన్నారు. సీఎల్పీ మీడియా పాయింట్ వద్ద ఆయన మాట్లాడారు. సభాహక్కులు కాపాడేది కేవలం స్పీకర్ మాత్రమేనని సుప్రీంకోర్టు తేల్చి చెప్పిందన్నారు. తమకు అనుకూలంగా తీర్పు వచ్చిందంటూ భారత రాష్ట్ర సమితి నాయకులు తెలివి తక్కువగా మాట్లాడుతున్నారని వ్యాఖ్యానించారు. "భారత రాష్ట్ర సమితి నాయకులు ముందు సుప్రీంకోర్టు తీర్పును చదవాలి. అధికారంలో ఉన్నప్పుడు పార్టీలను తమ పార్టీలో విలీనం చేసుకున్న చరిత్ర కేసీఆర్‌ది. అధికారంలో ఉన్న పదేళ్లు భారత రాష్ట్ర సమితి రాజ్యాంగాన్ని తుంగలో తొక్కింది. సీఎల్పీ నేతగా ఒక దళిత నేత ఉంటే సహించలేక కేసీఆర్ కాంగ్రెస్ శాసనసభాపక్షాన్ని విలీనం చేసుకున్నారు. కమ్యూనిస్టు పార్టీల అంతం చూడాలని కేసీఆర్ ప్రయత్నించారు. మేం ఆ పార్టీతో పొత్తు పెట్టుకొని ప్రజాస్వామ్యాన్ని బతికించాం. ప్రతిపక్ష హోదా ఉన్నా అసెంబ్లీకి రాని కేసీఆర్‌పై మేం కోర్టుకు వెళ్లాలా? కేసీఆర్ అసెంబ్లీకి రాకపోవడంపై స్పీకర్ చర్యలు తీసుకోవాలని కోరుతున్నాం"అని అద్దంకి దయాకర్ అన్నారు.

## 10 నియోజకవర్గాల్లో ఉప ఎన్నికలకు పార్టీ శ్రేణులు సిద్ధం కావాలి: కేటీఆర్



హైదరాబాద్: 'సత్యమేవ జయతే' అని భారత రాష్ట్ర సమితి కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ ఎక్స్‌లో పోస్టు చేశారు.

తెలంగాణలో పార్టీ మారిన 10 మంది ఎమ్మెల్యేల అనర్హతపై 3 నెలల్లోపు స్పీకర్ నిర్ణయం తీసుకోవాలని సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పుపై ఆయన ఈమేరకు స్పందించారు. సర్వోన్నత న్యాయస్థానం తీర్పును భారత రాష్ట్ర సమితి స్వాగతిస్తోందన్నారు. ప్రజాస్వామ్యాన్ని కాపాడిన సీజేఐకి దన్యవాదాలు తెలిపారు. "రాహుల్ గాంధీ చెప్పే పాంచ్ న్యాయ సూత్రకు కట్టుబడి ఉండాలి. చట్టవిరుద్ధంగా 10 మంది పార్టీ మారారని చెప్పేందుకు దర్యాప్తు అవసరం లేదు. కష్ట సమయాల్లో మాతో నిలిచిన భారత రాష్ట్ర సమితి లీగల్ టీమ్‌కు ధన్యవాదాలు. 10 నియోజకవర్గాల్లో ఉపఎన్నికకు 3 నెలల సమయం ఉంది. పార్టీ శ్రేణులు సిద్ధం కావాలి" అని కేటీఆర్ పేర్కొన్నారు.

## ఎర్రవల్లిలోని నివాసంలో పార్టీ నేతలతో కేసీఆర్ సమావేశం



గజ్వేల్: ఎర్రవల్లిలోని నివాసంలో పార్టీ నేతలతో భారత రాష్ట్ర సమితి అధినేత కేసీఆర్ సమావేశమయ్యారు.

మాజీ మంత్రులు కేటీఆర్, హరీశ్‌రావు, జగదీశ్‌రెడ్డితో పాటు పలువురు నేతలు భేటీకి హాజరయ్యారు. తెలంగాణలో పార్టీ మారిన ఎమ్మెల్యేల అనర్హత పిటిషన్లపై 3 నెలల్లోపు స్పీకర్ నిర్ణయం తీసుకోవాలని సుప్రీంకోర్టు ఆదేశించిన నేపథ్యంలో.. ఈ అంశంపై నేతల మధ్య చర్చ జరిగినట్టు సమాచారం.

## సుప్రీంకోర్టు తీర్పును భారాస స్వాగతిస్తోంది: ఎమ్మెల్యే కేపీ వివేకానంద

హైదరాబాద్: పార్టీ మారిన ఎమ్మెల్యేల అనర్హత వేటు విషయంలో సుప్రీంకోర్టు తీర్పును స్వాగతిస్తున్నట్టు భారత రాష్ట్ర సమితి ఎమ్మెల్యే కేపీ వివేకానంద చెప్పారు. హైదరాబాద్‌లోని పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. దేశ చరిత్రలో సుప్రీంకోర్టు సంచలన తీర్పు ఇచ్చిందన్నారు. ప్రజాస్వామ్యంపై ముఖ్యమంత్రికి గౌరవం ఉంటే వెంటనే 10 మంది ఎమ్మెల్యేలతో రాజీనామా చేయించి.. ఎన్నికలకు వెళ్లాలని డిమాండ్ చేశారు. గతంలో న్యాయవ్యవస్థను శాసించే విధంగా సీఎం వ్యాఖ్యలు చేశారని మండిపడ్డారు.



# ఈడీ ఎంట్రీతో జగన్ సీన్ చేంజ్!

విజయవాడ, జులై 31: ఏపీలో సంచలనంగా మారిన లిక్కర్ స్కామ్ కేసులో కీలక పరిణామం చోటుచేసుకుంది. ఈ కేసులో ఈడీ ఎంట్రీ ఇచ్చింది. ఈ కేసులో భాగంగా రూ.11 కోట్ల సీజ్‌కు సంబంధించిన వివరాలు కావాలని సిట్‌ను ఈడీ కోరింది. లిక్కర్ కేసులో ఇప్పటికే ఈడీ కేసు నమోదు చేసిన సంగతి తెలిసిందే. నిన్న శంషాబాద్ కాచారంలో సిట్ అధికారులు స్వాధీనం చేసుకున్న రూ.11 కోట్లకు సంబంధించిన వివరాలను ఇవ్వాలని ఈడీ కోరింది.

**జగన్ అరెస్ట్ అవుతారంటూ..!...** ఇదే కేసులో ఇప్పటికే రాజ్ కేసిరెడ్డి స్టేట్మెంట్ రికార్డు చేసిన ఈడీ.. ఇటీవల చంద్ర రెడ్డి సైతం విచారించింది. తాజాగా ఈ రూ.11 కోట్లు సీజ్ చేసిన వ్యవహారంలో మరికొందరికి ఈడీ నోటీసులు ఇవ్వనుంది. అయితే లిక్కర్ స్కామ్ కేసులో ఓవైపు సిట్, మరోవైపు ఈడీ విచారణను వేగవంతం చేసింది. ఇదిలా ఉంటే గత వైసీపీ ప్రభుత్వ హయాంలో జరిగిన ఈ స్కామ్ కేసులో అసలు పాత్రధారి జగనే అంటూ కొన్ని కథనాలు వచ్చాయి. ఒకవేళ ఇప్పటికే ఈ కేసులో అరెస్టైన నిందితులు ఇచ్చే స్టేట్మెంట్ లో జగన్ పేరు వస్తే ఆయన్ను అరెస్ట్ చేస్తారంటూ జోరుగా ప్రచారం జరుగుతోంది. మరి ఈ కేసు ఎటు దారి తీస్తుందో వేచి చూడాలి.

**మరో కీలక నిందితుడు అరెస్ట్..** లిక్కర్ స్కామ్ కేసులో మరొకరిని సిట్ అధికారులు అరెస్ట్ చేశారు. కీలక నిందితుడు వరుణ్‌ను శంషాబాద్ ఎయిర్‌పోర్టులో అదుపులోకి తీసుకున్నారు. A1గా ఉన్న కసిరెడ్డి రాజశేఖర్ రెడ్డి కలెక్షన్ గ్యాంగ్‌లో వరుణ్ కీలక వ్యక్తిగా గుర్తించారు. అయితే ఈ లిక్కర్ కేసు నమోదైన వెంటనే వరుణ్‌ను కొందరు కీలక వ్యక్తులు దేశం దాటించారు. ఇప్పటికే వరుణ్‌పై విజయవాడ కోర్టు నాన్ బెయిలబుల్ అరెస్ట్ వారెంట్ జారీ అయింది. ఈ కేసుకు సంబంధించి వరుణ్ నుంచి సిట్ అధికారులు కీలక సమాచారం రాబట్టారు. ఇవాళ, రేపు మరికొన్ని ప్రాంతాల్లో సిట్ అధికారులు సోదాలు నిర్వహించే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. కాగా లిక్కర్ స్కామ్ కేసులో ఎంపీ మిథున్ రెడ్డితో సహా మరో 12 మందిని సిట్ అధికారులు అరెస్ట్ చేసిన సంగతి తెలిసిందే.

## నమ్రత మేడం సర్ మేడం అంతే..!

ఈ జనరేషన్ ప్రేక్షకులకు నమ్రత శిరోద్కర్ కేవలం మహేష్ బాబు భార్యగా మాత్రమే తెలుసు. కానీ రెండు దశాబ్దాలు వెనక్కి వెళ్తే ఆమె స్థాయి ఏంటో అందరికీ అర్థం అవుతుంది. 1993లో ఫెమినా మిస్ ఇండియా కిరీటాన్ని గెలుచుకుంది. హిందీలో ఎన్నో సినిమాల్లో నటించి సూపర్ హిట్స్‌ను సైతం అందుకుంది. తెలుగులో మెగాస్టార్ చిరంజీవితో పాటు పలు సినిమాల్లో నటించింది. మహేష్ బాబుతో ప్రేమలో పడ్డ నమ్రత శిరోద్కర్ ఆయన్ను పెళ్లి చేసుకున్న తర్వాత ఇండస్ట్రీకి దూరం అయింది. ఆమె ఫ్యామిలీ వ్యవహారాలు చూసుకుంటే ఈ జనరేషన్‌కి కేవలం మహేష్ బాబు భార్యగా మాత్రమే గుర్తు ఉండి పోయేలా ఆమె లో ప్రొఫైల్‌ను మెయింటెన్ చేస్తూ వస్తుంది. అప్పుడప్పుడు సోషల్ మీడియాలో నమ్రత తన హద్దులు దాటకుండా, పరిధిలో ఉంటూ అందమైన ఫోటోలను షేర్ చేస్తూ ఉంటుంది. చాలా మంది పెళ్లి అయిన హీరోయిన్స్ అందాల ఆరబోత చేస్తూ ఇప్పటికీ వార్తల్లో ఉన్నారు. వారి ఫామ్ కోల్పోయినా కూడా స్కిన్ షో చేయడం ద్వారా వార్తల్లో నిలవాలని ప్రయత్నాలు చేస్తున్న వారు కొందరు ఉన్నారు. కానీ నమ్రత మాత్రం ఎప్పుడూ చాలా హుందగా ప్రవర్తిస్తూ వస్తున్నారు. ఆమె తన గౌరవ, మర్యాదలు కాపాడుకోవడం ద్వారా అందరి దృష్టిని ఆకర్షిస్తూ ఉంటుంది. నమ్రత భార్య కావడం అనేది మహేష్ బాబు అదృష్టం అంటూ చాలా మంది అభిమానులు సైతం అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. తాజాగా నమ్రత ఇన్‌స్టాగ్రామ్ ద్వారా



అందమైన ఫోటోలను షేర్ చేసింది. విభిన్నమైన డిజైనర్ ఔట్ ఫిట్‌ను ధరించిన నమ్రత అంతే స్టైలిష్ ఆభరణాలు ధరించడం ద్వారా చాలా ఆకర్షణీయంగా కనిపించింది. ఆకట్టుకునే అందంతో పాటు, మంచి ఫిజిక్ నమ్రత సొంతం అంటూ ఉంటారు. ఆమె వయసు పెరిగినా కొద్ది మరింత అందంగా కనిపిస్తుందని, మిస్ ఇండియా సమయంలో ఎంత అందంగా ఉందో అంతే అందంగా కనిపిస్తుందని మరికొందరు కామెంట్స్ చేస్తున్నారు. మొత్తానికి నమ్రత సోషల్ మీడియాలో ఇలాంటి ఫోటోలను రెగ్యులర్‌గా షేర్ చేయాలని అభిమానులు కోరుకుంటూ ఉన్నారు. తరుణ్ తాహిళాని డిజైన్ చేసిన ఈ ఔట్ ఫిట్ నమ్రత ధరించడంతో మరింత అందంగా కనిపిస్తుందని నెటిజన్స్ కామెంట్స్ చేస్తున్నారు. సోషల్ మీడియాలో నమ్రత ఏ ఫోటోలు షేర్ చేసినా వెంటనే వైరల్ అవుతూ ఉంటాయి. ఎక్కువ శాతం తన పిల్లలు గౌతమ్, సితార ఫోటోలను షేర్ చేస్తూ ఉండే నమ్రత ఈసారి మాత్రం తన పిక్స్‌ను షేర్ చేసింది. ఇంత అందంగా ఉన్న నమ్రత ఎందుకు సినిమాలకు దూరం అయిందని అభిమానులు కొందరు అసహనం వ్యక్తం చేస్తున్నారు. పిల్లల బాధ్యత ఉన్న కారణంగా అప్పుడు సినిమాలకు దూరంగా ఉన్న నమ్రత ఇప్పుడు అయినా రీ ఎంట్రీ ఇవ్వచ్చు కదా అంటున్నారు. ఆ మధ్య రేణు దేశాయ్ తో పాటు పలువురు రీ ఎంట్రీ ఇచ్చిన విషయం తెల్సిందే. వారిలాగే నమ్రత ఏదో ఒక రోజున రీ ఎంట్రీ ఇస్తుందని అంతా ఆసక్తిగా ఎదురు చూస్తున్నారు. మరి నమ్రత మనసులో ఏముందో తెలియాల్సి ఉంది.

## జూనియర్ అతిలోక సుందరి వైబ్స్

నేటి జెన్ జెడ్ స్టార్లలో దూసుకుపోయే తత్వం జాన్వీకపూర్ కి ఉంది. అతిలోక సుందరి శ్రీదేవి నటవారసురాలిగా సినీ ఆరంగేట్రం చేసిన జాన్వీ కపూర్ తనను తాను నటిగా నిరూపించుకుంటూ ఒక్కో మెట్టు ఎక్కుతోంది. అదే సమయంలో జాన్వీ నిరంతర ఫ్యాషన్ సెన్స్ తో ప్రజల దృష్టిని తనవైపు తిప్పేసుకోవడంలో పెద్ద సక్సెసైంది. ఇప్పుడు మరోసారి జాన్వీ తనదైన యూనిక్ స్టైల్ తో కనిపించింది. ఈ బ్యూటీ జగదేక వీరుడు - అతిలోక సుందరి పోస్టర్ ప్రింట్ చేసి ఉన్న క్లాసిక్ డెనిమ్ జీన్స్ షర్ట్ ధరించి కనిపించింది. డెనిమ్స్ షర్ట్ వెనక భాగంలో ఈ పోస్టర్ ముద్రించి ఉండటం ఆసక్తికరం. ఈ స్పెషల్ డెనిమ్ జాకెట్ అంటే తనకు చాలా ఇష్టం అని జాన్వీ తెలిపింది. శ్రీదేవిని -ఒక



దేవదూత అద్భుత యువరాణి%-% అని ప్రశంసించారు. చిరంజీవి -శ్రీదేవితో పాటు ఈ పోస్టర్ లో నాటి మేటి విలన్ అమ్రీష్ పురి ఫోటో కూడా ఉంది. జాన్వీ కపూర్ ప్రస్తుతం కెరీర్ పరంగా ఫుల్ బిజీగా ఉంది. ఈ బ్యూటీ తదుపరి రామ్ చరణ్ తో కలిసి పెద్దిలో కనిపిస్తుంది. ఆ తర్వాత జగదేక వీరుడు అతిలోక సుందరి సీక్వెల్ ని తెరకెక్కిస్తే నటించేందుకు సిద్ధమేనని కూడా జాన్వీ ఇంతకుముందు చెప్పింది. రామ్ చరణ్- జాన్వీ కపూర్ జంటగా జగదేక వీరుడు సీక్వెల్ ని తెకెక్కిస్తే బావుంటుందని చిరు కూడా సూచించారు. అయితే ఈ ప్రాజెక్టుకు ఇంకా చాలా సమయం పడుతుంది.




## డీజే టిల్లు కాదు.. ఇప్పట్నుంచి తెలుసు కదా అంటారు




డీజే టిల్లు సినిమాలతో యంగ్ హీరో సిద్ధు జొన్నలగడ్డకు యూత్ లో ఫుల్ క్రేజ్ వచ్చిన విషయం తెలిసింది. ప్రస్తుతం ఆయన తెలుసు కదా సినిమా షూటింగ్ లో బిజీగా ఉన్నారు. నీరజ కోనా తెరక్కిస్తున్న ఈ సినిమాలో రాశీ ఖన్నా, శ్రీనిధి శెట్టి హీరోయిన్లుగా నటిస్తున్నారు. తాజాగా సినిమా నుంచి తొలి పాట రిలీజ్ చేశారు. సెన్సేషనల్ మ్యూజిక్ డైరెక్టర్ తమన్ ఈ సినిమాకు సంగీతం అందిస్తున్నారు. ఫస్ట్ సింగిల్ రిలీజ్ కోసం ఓ ఈవెంట్ నిర్వహించారు. ఈ ఈవెంట్ లోనే తమన్ స్వరాలు సమకూర్చిన మల్లిక గంద అనే పాట తాజాగా రిలీజైంది. లిరిసిస్ట్ కృష్ణ కాంత్ రాసిన ఈ పాటను సిధ్ శ్రీరామ్ పాటను ఆలపించారు. మెలోడియస్ గా ఉన్న ఈ పాట మ్యూజిక్ లవర్స్ ను ఆకట్టుకుంటుంది. తమన్ మ్యూజిక్ తో మరోసారి మ్యాజిక్ చేశారు. ఇక ఈ పాటలో సిద్ధు- రాశీ ఖన్నా మధ్య కెమిస్ట్రీ బాగా కుదిరినట్లు కనిపిస్తుంది. వైఫ్ అండ్ హస్బెండ్ గా కనిపిస్తున్నారు. రొమాంటిక్ గా ఉన్న ఈ పాట ఆలరిస్తుంది. ఇది పక్కా 2025 రొమాంటిక్ హిట్ లో ఒకటిగా నిలువడం పక్కా అని ఆడియెన్స్ కామెంట్ పెడుతున్నారు. మరోవైపు ఈ సాంగ్ రిలీజ్ ఈవెంట్ లో పాల్గొన్న రాశీ ఖన్నా మాట్లాడారు. ఆమె మాట్లాడుతూ.. ఈ ఈవెంట్ లో తమన్, సిద్ శ్రీరామ్ స్టార్లు. తమన్ అద్భుతమైన సంగీతం అందించారు. లవ్ స్టోరీకి మ్యూజిక్ అందించాలంటే అందిరికీ ఫస్ట్ ఛాయిస్ తమనే. ఇక ఫీమేల్ డైరెక్టర్ తో పనిచేయడం నాకు ఇదే తొలిసారి. నీరజా కోన ఈ సినిమాకు వెన్నుముక. అయితే అందరూ సిద్ధు బెస్ట్ ఫిల్మ్ డీజే టిల్లు అని చెబుతున్నారు. కానీ, ఈ సినిమా చూసిన తర్వాత అందరూ తెలుసు కదా అని చెబుతారు.

ఈ సినిమాలో సిద్ధు క్యారెక్టర్ తో ప్రేమలో పడిపోతారు. అంత బాగా వచ్చింది. అని రాశీ ఖన్నా అన్నారు. ప్రస్తుతం ఈ సినిమా షూటింగ్ దశలో ఉంది. ఈ సినిమాతోనే నీరజ కోన డైరెక్టర్ గా పరిచయం అవుతున్నారు. ట్రై యాంగిల్ స్టోరీగా ఇది తెరకెక్కుతుంది. ఇటీవల టీజర్ కూడా రిలీజ్ చేశారు. ఇందులో సిద్ధు- రాశీ ఖన్నా- శ్రీనిధి శెట్టి మధ్య సన్నివేశాలు ఆకట్టుకున్నాయి. అక్టోబర్ 17న ఈ సినిమా రిలీజ్ కానుంది.

## వార్-2.. నిర్మాతలు పెద్ద యుద్ధమే చేయాలేమో?



టాలీవుడ్ స్టార్ హీరో జూనియర్ ఎన్టీఆర్, బాలీవుడ్ ప్రముఖ నటుడు హృతిక్ రోషన్ కాంబినేషన్ లో వార్-2 మూవీ రూపొందుతున్న విషయం తెలిసిందే. ఆ సినిమాతోనే తారక్ బాలీవుడ్ లోకి ఎంట్రీ (డైరెక్ట్ హిందీ మూవీ) ఇస్తున్నారు. స్పై జోనర్ లో స్టార్ డైరెక్టర్ అయాన్ ముఖర్జీ దర్శకత్వం వహిస్తుండగా.. యష్ రాజ్ ఫిల్మ్స్ భారీగా నిర్మిస్తోంది. బాలీవుడ్ బ్యూటీ కియారా అద్వానీ ఫిమేల్ లీడ్ రోల్ లో నటిస్తున్న వార్-2ను ఆగస్టు 14వ తేదీన ప్రపంచవ్యాప్తంగా రిలీజ్ చేయనున్నట్లు మేకర్స్ ఇప్పటికే అనౌన్స్ చేశారు. అందుకు సంబంధించిన ఏర్పాట్లు చేస్తున్నారు. ప్రస్తుతం బిజినెస్ కు సంబంధించిన వ్యవహారాలు పూర్తి చేస్తున్నట్లు సినీ వర్గాల్లో జోరుగా ప్రచారం సాగుతోంది. అయితే తెలుగులో కూడా వార్-2 రిలీజ్ కానుండగా.. ఇప్పటికే థియేట్రికల్ రైట్స్ కోసం టాలీవుడ్ బడా ప్రొడక్షన్ హౌసెస్ పోటీ పడినట్లు కొద్ది రోజుల నుంచి వార్తలు వస్తున్నాయి. కానీ వారెవరికీ హక్కులు ఇవ్వమని యష్ రాజ్ ఫిల్మ్స్ చెప్పిందని టాక్. రెండు తెలుగు రాష్ట్రాల్లో కూడా సినిమాను సొంతంగా రిలీజ్ చేయాలని నిర్ణయించుకుందని సమాచారం. అదే సమయంలో తెలుగు రాష్ట్రాల థియేట్రికల్ రైట్స్ వాల్యూ రూ. 90 కోట్ల వరకు ఉంటుందని ట్రేడ్ వర్గాలు చెబుతున్నాయి. దీంతో ఇప్పుడు వాటిని తిరిగి పొందాలంటే.. వార్-2 మేకర్స్.. పెద్ద యుద్ధమే చేయాలేమోనని అంటున్నారు. యష్ రాజ్ ఫిల్మ్స్ సేఫ్ జోన్ ఉండే ఛాన్స్ ఉన్నా.. రిస్క్ చేస్తుందని అభిప్రాయపడుతున్నారు. ముఖ్యంగా స్పై జోనర్ కు తెలుగులో మరింత అంత ఫ్యాన్ బేస్ ఉండదు. అందుకే జోనర్ తోనే ఫస్ట్ సమస్య. ఆ తర్వాత ఎన్టీఆర్ సోలో మూవీ అయితే.. తెలుగులో భారీ వసూళ్లు రాబట్టడం ఈజీనే. కానీ సినిమా కంటెంట్ అంతా బాలీవుడ్ ఫ్లేవర్ లో ఉన్నట్టు క్లియర్ గా తెలుస్తోంది. కాబట్టి తారక్ ప్రమోషన్స్ చేసినా అది సరిపోదు. అదే సమయంలో వార్-2 రిలీజ్ రోజు కూలీ మూవీ విడుదల కానుంది. రజనీకాంత్, లోకేష్ కనగరాజ్ కాంబోలో రానున్న ఆ మూవీపై భారీ అంచనాలు ఉన్నాయి. ప్రమోషన్స్ కూడా జోరుగా సాగుతున్నాయి. సినిమాలో అన్ని ఇండస్ట్రీల నటులున్నారు. దీంతో వార్-2 కన్నా కూలీకే ఎక్కువ బ్రాండ్ వాల్యూ ఉన్నట్లు కనిపిస్తోంది. అందుకే ఇప్పుడు వార్-2.. తెలుగులో ఎలా గట్టెక్కుతుందో వేచి చూడాలి.

## శ్రీలీల కొంటె చూపుల వలపు బాణం

టాలీవుడ్ కోలీవుడ్ బాలీవుడ్ .. పరిశ్రమ ఏదైనా శ్రీలీల కొంటె చూపులకు దాసోహం అనాల్సిందే! అందానికి అందం, ప్రతిభ ఈ అమ్మడి సొంతం. ముఖ్యంగా డ్యాన్సింగ్ క్వీన్ గా ఓ వెలుగు వెలుగుతున్న శ్రీలీలలో గ్లామ్ యాంగిల్ కూడా ఎప్పుడూ యూత్ లో చర్చకొస్తుంది. ఇక ఫ్యాషన్ సెన్స్ లోను ఈ తెలుగమ్మాయి తగ్గేదే లే! అంటోంది. ముంబై, దిల్లీ, కోల్ కతా, బెంగళూరు లాంటి మెట్రో నగరాల నుంచి వచ్చిన చాలా మంది టాప్ మోడల్స్ కి పోటీనిచ్చేంత మ్యాటర్ ఉంది ఈ బ్యూటీలో. గత కొంత కాలంగా శ్రీలీల ఇన్



స్టాలో స్పెషల్ ఫోటోషూట్లతో విరుచుకుపడుతోంది. తాజాగా షేర్ చేసిన ఫోటోషూట్ లో శ్రీలీల సంథింగ్ స్పెషల్ గా కనిపిస్తోంది. సింపుల్ గా నవ్వేస్తూ, హాఫ్ షోల్డర్ ఫ్రాక్‌లో ప్లెజెంట్ గా కనిపిస్తున్న ఈ బ్యూటీ గజిబిజి షూట్ లైఫ్ నుంచి రిలాక్స్ అవుతున్నట్టే కనిపిస్తోంది. ఈ అందాల భామ ప్రస్తుతం అరడజను సినిమాలతో బిజీ బిజీగా ఉంది. జూనియర్స్, మాస్ జాతర, లెనిన్ అనే చిత్రాల్లో నటిస్తోంది. మరోవైపు కార్తీక్ ఆర్యన్ సరసనా ఓ చిత్రంలో శ్రీలీల కథానాయిక. ఇది ఆషిఖి ఫ్రాంఛైజీ నుంచి వస్తున్న సినిమాగా ప్రచారం ఉన్నా, అలాంటిదేమీ లేదని చిత్రబృందం తెలిపింది. పరాశక్తి అనే తమిళ చిత్రంలోను ఈ భామ నటించింది.

## 'తెలుసు కదా' రాశి ఖన్నాకు...!

ఊహలు గుసగుసలాడే సినిమాతో దశాబ్ద కాలం క్రితం హీరోయిన్‌గా తెలుగు ప్రేక్షకుల ముందుకు వచ్చిన ముద్దుగుమ్మ రాశి ఖన్నా. ఆ సినిమా నటిగా రాశి ఖన్నాకు మంచి గుర్తింపును తెచ్చి పెట్టింది. ఆ సినిమా కమర్షియల్‌గా కూడా మంచి ఫలితాన్ని సొంతం చేసుకుంది. అందుకే రాశి ఖన్నా చాలా సినిమా ఆఫర్లను సొంతం చేసుకుంది. టాలీవుడ్‌లో ఒకానొక సమయంలో యంగ్ హీరోలకు మోస్ట్ వాంటెడ్ హీరోయిన్‌గా నిలిచింది. టాలీవుడ్ టైర్ 2 హీరోల్లో చాలా మందికి జోడీగా నటించడం ద్వారా నాలుగు... ఐదేళ్ల పాటు బిజీ బిజీగా సినిమాల్లో నటించింది. ఒకానొక సమయంలో ఈమె ఏడాదికి నాలుగు అయిదు సినిమాల్లో కనిపించింది. ఈమధ్య కాలంలో టాలీవుడ్ కి రాశి ఖన్నా దూరం అయింది. తెలుగు సినిమాల్లో ఈమె చివరిగా కనిపించి రెండేళ్లకు పైగా అయింది. ఈమె నాగ చైతన్య హీరోగా నటించిన థాంక్యూ సినిమాలో చివరగా కనిపించింది. 2022లో విడుదలైన ఆ సినిమా బాక్సాఫీస్ వద్ద ఆశించిన స్థాయిలో విజయాన్ని సొంతం చేసుకోలేదు. పైగా అంతకు ముందు ఈమె చేసిన తెలుగు సినిమాలు కూడా అంతంత మాత్రమే అన్నట్లుగా ఆడటంతో మెల్ల మెల్లగా ఆఫర్లు తగ్గాయి. అదే సమయంలో తెలుగులో



వచ్చే చిన్నా చితకా ఆఫర్లను కాదని కోలీవుడ్‌లో రాశి ఖన్నా బిజీ అయింది. తెలుగులో సినిమా ఆఫర్లు రాకున్నా కోలీవుడ్, బాలీవుడ్‌లో ఈ అమ్మడు నటించి మెప్పించింది. టాలీవుడ్‌లో 'థాంక్యూ' సినిమా తర్వాత రాశి ఖన్నా ఎట్టకేలకు 'తెలుసు కదా' సినిమాతో ప్రేక్షకుల ముందుకు రాబోతుంది. సిద్దు జొన్నలగడ్డ హీరోగా నీరజ కోన దర్శకత్వంలో రూపొందిన ఈ సినిమాను అక్టోబర్ 17న ప్రేక్షకుల ముందుకు రాబోతుంది. చాలా కాలం క్రితమే రావాల్సిన ఈ తెలుసు కదా సినిమా కొన్ని కారణాల వల్ల వాయిదా పడుతూ వచ్చింది. ఎట్టకేలకు విడుదలకు సంబంధించిన ప్రకటన వచ్చింది. అంతే కాకుండా ఈ సినిమా జోనర్ ఏంటి... ఎలాంటి కంటెంట్ ఈ సినిమాలో ఉండబోతుంది అనే విషయాన్ని తెలియజేస్తూ సరదాగా ఒక వీడియోను సోషల్ మీడియా ద్వారా విడుదల చేశారు. ఇద్దరు హీరోయిన్స్ ఈ సినిమాలో కనిపించబోతున్నారు. సిద్దు జొన్నలగడ్డకు జోడీగా రాశి ఖన్నాతో పాటు కేజీఎఫ్ ముద్దుగుమ్మ శ్రీనిధి శెట్టి సైతం హీరోయిన్‌గా నటించింది. వీరిద్దరి కాంబోలో ఉండే సీన్స్ వినోదాత్మకంగా ఉంటాయని ఇటీవల విడుదల అయిన ప్రమోషన్ వీడియోను చూస్తే అనిపిస్తుంది. తెలుగు కదా సినిమా యూత్ ఫుల్ ఎంటర్‌టైనర్‌గా సాగే ట్రై యాంగిల్ లవ్ స్టోరీ అని క్లారిటీ ఇచ్చారు. అదే సమయంలో సినిమాలో రాశి ఖన్నా పాత్ర చాలా ప్రాముఖ్యతను కలిగి ఉంటుందని తెలుస్తోంది. తెలుగు సినిమాల్లో చాలా కాలం తర్వాత కనిపించబోతున్న రాశి ఖన్నాకు తెలుసు కదా అయినా మంచి విజయాన్ని తెచ్చి పెడుతుందా అని అంతా ఆసక్తిగా ఎదురు చూస్తున్నారు. తెలుసు కదా హిట్ అయితే టాలీవుడ్‌లో మరో రెండు మూడు ఏళ్ల పాటు రాశి ఖన్నా బిజీగా ఉండే అవకాశం ఉంటుంది.

Printed by Yendluri Srinivasa Rao, Published by Yendluri Srinivasa Rao, Owned by Yendluri Srinivasa Rao, Printed at Sri Kanaka Bhargav Offset Printers, D.No.3-1514/1, Anjaneya Colony, Reddypalem, Guntur -1, Published at D.No. 30-679, Opp. Keerthi Deluxe, Enugupalem Road, Vinukonda, Guntur Dist., Cell:94407 29604, Editor: Yendluri Srinivasa Rao, RNI Registration No.: APBIL/2018/76841